30-10Pg1exHMNWJQE 1GNT_30-10Pg1exHMNWJQE.qxd 29/Oct/25 1:04 AM Page 1

సాహితీ వరంగల్లు పై వెలుగు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
29-10-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 267 పేజీలు: 12 వెల: 6.50

మూడోసారి పోటీకి ఇష్టమే: ట్రంప్

భారత్, పాక్ సరిహద్దులు మళ్లీ ఉద్రిక్తం 9లో



# అల కల్లోలం

# 'మొంథా' టెర్రర్

## అంతర్వేది సమీపంలో తీరాన్ని తాకిన తుఫాన్

## గంటకు 90 నుంచి 100 కి.మీ వేగంతో ఈదురుగాలులు



విశాఖలో పెనుగాలులకు చెట్టు కూలిపడిన దృశ్యం

### భారీగా ఆస్తి, పంట నష్టం

### వణికిన తీరప్రాంత జనం..

### లోతట్టు ప్రాంతాల నుంచి పునరావాస కేంద్రాలకు తరలింపు

### కోనసీమలో మహిళ మృతి

**విజయవాడ,అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను తీరాన్ని తాకింది. కాకినాడ మచిలీపట్నం మధ్య అంతర్వేదిపాలెం సమీపంలో తీరాన్ని తాకింది. పూర్తిగా తీరం దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కి.మీ వేగంతో గాలులు వీచినట్లు అంచనా తీరం దాటే ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాల్లో భారీగా గాలులు వీస్తున్నాయి. తుపాను ప్రభావంతో కాకినాడ, కోనసీమ, ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. రానున్న 24 గంటల్లో తీరప్రాంతంలో 15 నుంచి 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అంతర్వేదిపాలెంలో తీరం తాకిన మొంథా తుపాను గడిచిన దాదాపు 12 గంటల్లో గంటకు 17 కి.మీ. వేగంతో కదిలిన తుపాను మచిలీపట్నానికి 20 కి.మీ.దూరంలో తుపాను >>2



కాకినాడ తీరంలో సముద్ర అలల ధాటికి ఛిద్రమైన రహదారి

# తెలంగాణలో హై అలర్ట్

### రాష్ట్ర వ్యాప్తంగా 3 రోజులు భారీ వర్షాలు

### పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ

### కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు28:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను మొథా ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు పడటం ప్రారంభించాయి. రాగల మూడురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించింది. ఈ మేరకు ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఈ మూడు జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరం లేకుండా బయటకు వెళ్లరాదని సూచించింది. 24 గంటల్లో మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, భువనగిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, హన్మకొండ, జనగాం, సిద్దిపేట,యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. గడిచిన 24గంటల్లో ఆసిఫాబాద్, సంగారెడ్డి, మెదక్, మంచిర్యాల, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, నల్గొండతో పాటు పలు చోట్ల మోస్తరు >>2

# తుఫాన్‌పై పూర్తి అప్రమత్తం



మంగళవారం మొంథా తుఫానుపై డిప్యూటీ సీఎం పవన్‌తో కలిసి సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

### క్షేత్రస్థాయిలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

### ప్రజలకు అండగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు

### తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ

### నష్టాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం: సీఎం చంద్రబాబు

**విజయవాడ, అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథ్రా తుఫాను ప్రభావం నుంచి ప్రజల ప్రాణాలు కాపాడి నష్టాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.సంక్షోభ సమయాల్లో ప్రజల చెంతనే ప్రభుత్వం ఉంటుందన్నారు. ప్రకృతి పరీక్షిస్తే, పరిపాలన రక్షణ కోసం ప్రయత్నిస్తోంది. రాష్ట్రంపై మొంథా తుపాను ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీజీఎస్ నుంచి సమీక్షించారు. ప్రస్తుతం తుపాను తీరానికి దగ్గరగా వస్తోందని, కోస్తాంధ్ర జిల్లాలపై దీని ప్రభావం ప్రారంభమైందని అధికారులు వెల్లడించారు. కాకినాడ, మచిలీపట్నం, విశాఖ తదితర తీరప్రాంతాల్లో వర్షాలు, గాలుల తీవ్రత ఉందని చెప్పారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. గతంలో వచ్చిన తుపానుల నష్టాన్ని బేరీజు వేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుపాను తీరం దాటే కాకినాడ, ఆ పరిసర ప్రాంతాలకు రెస్క్యూ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని ఆదేశాలు జారీ చేశారు.విశాఖ, ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు సీఎంకు తెలిపారు. ఇప్పటికే తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లను పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశామని సీఎస్ విజయానంద్ వెల్లడించారు. తుపాను ప్రభావిత ప్రాంతాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు, కార్యకర్తలంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఎన్డీయే కూటమి ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నేడు, రేపు అప్రమత్తంగా ఉండి ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. తిత్లీ, హుద్‌హుద్ తుపాను వచ్చినప్పుడు కూడా సమర్థవంతంగా ఎదుర్కొన్నామని సీఎం గుర్తు చేశారు. చెట్లు,స్తంభాలు వంటివి కూలినా యుద్ధప్రాతిపదికన తొలగించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తుపాను ప్రభావంతో కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. ఫ్లాష్ ఫ్లడ్ వచ్చే అవకాశం ఉందన్న సమాచారంతో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని క్షేత్రస్థాయిలో మోహరించామని తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులను వెనక్కి రప్పించామని, వారితోనూ ఎన్డీయే శ్రేణులు సమన్వయంతో ఉండాలని సూచించారు. ప్రతి గంటకు బులిటెన్ కూడా విడుదల చేస్తామన్నారు. దాదాపు 39 నియోజకవర్గాలకు వర్ష ప్రభావం ఎక్కువగా చూపిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. సీఎం ఆదేశాల మేరకు కోస్తా జిల్లాల్లోని 26 తీరప్రాంత గ్రామాల్లో ప్రయోగాత్మకంగా మొంథా తుఫాన్ హెచ్చరికలు పంపే వ్యవస్థను ఏర్పాటు చేశారు. రియల్ టైమ్ వాయిస్ అలర్ట్‌లను క్షణాల్లో అందిస్తున్నారు. విద్యుత్ అంతరాయం జరిగినా 360 డిగ్రీల్లో హార్న్ స్పీకర్ వ్యవస్థ, ఒక >>2



# 8వ వేతనసంఘం ఏర్పాటు

### 50 లక్షల ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి

### 18 నెలల్లో నివేదిక తయారు

### రూ. 36,792 కోట్ల ఎరువుల సబ్సిడీ

### కేబినెట్ కీలక నిర్ణయాలు

### వెల్లడించిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్లకు మోడీసర్కార్ శుభవార్త చెప్పింది. లక్షలాదిమంది ఉద్యోగుల జీతాలు, విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు పెంచేందుకు 8వ వేతన సంఘం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ కమిషన్‌కు జస్టిస్ రంజనప్రకాశ్ దేశాయ్ సారథ్యం వహించనుండగా ఐఐఎం బెంగ >>2

## 'అద్వికి' ఛీటింగ్ కేసు ప్రధాన నిందితుల అరెస్ట్

### 139 మంది డిపాజిటర్లకు రూ.143 కోట్ల మేర టోకరా

### రూ.23లక్షలు, బంగారం స్వాధీనం

**విజయవాడ కార్పొరేషన్,అక్టోబరు 28,ప్రభాత వార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన అద్విక ట్రేడింగ్ మార్కెటింగ్ కంపెనీ ప్రజల నుండి డిపాజిట్‌లు సేకరించి బోర్డు తిప్పేసిన ఘటనలో ఫిర్యాది అయిన వీరమల్లు గణేష్ చంద్ర ఫిర్యాదు మేరకు మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి సిపి రాజశేఖర బాబు ఆదేశాల మేరకు లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. వివరాల ప్రకారం గణేష్ చంద్ర తమ కుటుంబ సభ్యులు సదరు ట్రేడింగ్ కంపెనీ అధినేత తాడేపల్లిఆదిత్యకుచెందిన కంపెనీలో రూ.53 లక్షలు డిపాజిట్ చేశారు. >>2

# 40లక్షల మంది ప్రభావితం



మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

### కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో తుఫాన్ తీవ్రత

### మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలోనే..

### రెండుగంటలకోసారి పరిస్థితి సమీక్షిస్తున్న సిఎం: మంత్రి లోకేష్

**విజయవాడ,అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుపాను వల్ల రాష్ట్రంలో సుమారు 40లక్షల మంది ప్రజలు ప్రభావితమవుతున్నారు. కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు అత్యధిక తీవ్రత కలిగిన ప్రాంతాలుగా గుర్తించామన్నారు. ఆ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఆ జిల్లాలు రెడ్ అలర్ట్‌లో ఉన్నాయి. ప్రజాప్రభుత్వం లక్ష్యం ఒక్కటే, ఎటువంటి ప్రాణ నష్టంఉండకూడదు, ముఖ్యమంత్రి ఆదేశాలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హోంమంత్రి అనితతో కలిసి మంగళవారం సాయంత్రం మంత్రి లోకేష్ విలేకరులతో మాట్లాడుతూ తుపాను సహాయ చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. ఒకపక్క డిజాస్టర్ మేనేజర్ మెంట్ మంత్రి అనిత, మరోవైపు ఆర్టీజీఎస్ మంత్రిగా నేను సమన్వయంతో గత 24గంటలవరిస్థితినివర్యవేక్షిన్నున్నామన్నారు. మంగళవారంరాత్రి 11.30 గం.లకు అమలాపురం సమీపంలో తుపాను తీరం దాటబోతోంది. ఈ సందర్భంగా 90 నుంచి 100 కి.మీల వేగంతో అక్కడ ఈదురు గాలులు వీచే అవకాశం పరిసర ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

**1906 తాత్కాలిక షెల్టర్ల ఏర్పాటు.:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ఈ నెల 23వ తేదీ నుంచి నేరుగా పర్యవేక్షిస్తున్నారు. యుఏఈకి వెళ్లే ముందు, అక్కడ నుంచి వచ్చిన తర్వాత 12 రివ్యూ మీటింగ్‌లు, టెలీ కాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా తుపాను >>2

## తిరుమలలో వైకుంఠద్వార దర్శనం

# 10 రోజులు యధాతథం



మంగళవారం టిటిడి బోర్డు సమావేశంలో చైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ సింఘాల్, అదనపు ఇఒ చౌదరి

### టిటిడి అన్ని ఆస్పత్రులకు ఒకే డైరెక్టర్‌గా డా.జగదీశ్

### రూ.30కోట్లతో కరీంనగర్‌లో శ్రీవారి ఆలయం

### ప్రొక్యూర్‌మెంట్ సెల్ అవకతవకలపై ఎసిబితో విచారణ

### టిటిడి బోర్డు కీలక నిర్ణయాలు

**తిరుమల,అక్టోబరు 28ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా పూజలు జరిగే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ ఏడాది డిసెంబర్‌లో కూడా పదిరోజులపాటు వైకుంఠద్వారాలు తెరిచి భక్తులకు దర్శనం కల్పించేలా టిటిడి నిర్ణయించింది. వైకుంఠద్వార దర్శనాల టోకెన్లు జారీ విధానం అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించుకోనున్నారు. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో 30కోట్లరూపాయలతో టిటిడి ఆలయాన్ని నిర్మించేందుకు నిర్ణయించారు. మంగళవారం తిరుమల అన్నమయ్య భవనం లో టిటిడి ధర్మకర్తలమండలి సమావేశం జరిగింది. >>2





## హైదరాబాద్ నుంచి 18 విమానాలు నిలిపివేత

'మొంథా' ఎఫెక్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు28:** మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో శంషాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సిన 18 విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. వాతావరణం అనుకూలించని కారణంగా హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్టణం, రాజమహేంద్రవరానికి వెళ్లాల్సిన విమానాలను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. విజయవాడ, విశాఖ, రాజమహేంద్రవరం నుంచి శంషాబాద్‌కు రావాల్సిన 17 విమాన సర్వీసులను కూడా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. రద్దయిన వాటిలో విశాఖపట్టణం నుంచి 9, రాజమహేంద్రవరం నుంచి 5, విజయవాడ నుంచి 5 విమానాలు ఉన్నాయి. మొంథా తుపాను నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే అప్రమత్తమైంది. మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో ఏపీ రాష్ట్రంలోనిఇ కోస్తా ప్రాంత జిల్లాలకు వెళ్లే పలు రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. 107 రైళ్లను రద్దు చేసింది. బుధవారం,గురువారం కూడా రైళ్ల రద్దు ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. మంగళవారం 70, బుధవారం 36, గురువారం ఒక రైలును రద్దు చేసినట్లు వెల్లడించింది.



## 107 రైళ్ల రద్దు.. 10 దారి మళ్లింపు

**హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 28 ప్రభాతవార్త :** మొంథా తుఫాన్ నేపథ్యంలో 107 రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్యరైల్వే అధికారులు వెల్లడించారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటుంది. కొన్ని రైళ్లను ఇప్పటికే దారి మళ్లించింది. మరికొన్ని రైళ్ల గమ్యం కుదించింది. ఎపి నుంచి హైదరాబాద్ వైపు వచ్చే పలు రైళ్లు రద్దుచేసినట్లు దక్షిణ మధ్యరైల్వే పేర్కొంది. సోమవారంతో పాటు రేపు, ఎల్లుండి బయలుదేరే పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, రైళ్లు రద్దు చేశారు. అదేవిదంగా పార్సిల్ రైళును, మరో 10 రైళ్లను దారి మళ్లించారు. మరో 28 రైళ్లను రీషెడ్యూల్డ్ చేశారు. మరో రైలును రిస్టోరేషన్ చేయడంజరిగింది. తుఫాన్ తీవ్రతను బట్టి రైల్వే సర్వీసులను పునరుద్ధరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గోదావరి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్, విశాఖపట్నం.. తిరుపతి ఎక్స్‌ప్రెస్,చెన్నై సెంట్రల్ వీక్లి ఎక్స్‌ప్రెస్, ఎల్టిటీతో పాటు పలు ప్రధాన రైళ్లు, పలు పాసింజర్ రైళ్లు ఉన్నాయి. విశాఖ మీదుగా సాగే రెల్వే సర్వీసుల జాబితాను రైల్వే శాఖ ఇప్పటికే విడుదల చేసింది. స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసింది. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు జిఎం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

30-10pg2exHMNWJQER 2_30-10pg2exHMNWJQER.qxd 29/Oct/25 1:07 AM Page 1





కాకినాడ తీరంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు

# 10 రోజులు యథాతథం

>> ఉదయం 10గంటలకు మొదలైన సమావేశం సాయంత్రం 6గంటల వరకు సుదీర్ఘంగా కొనసాగింది. ధర్మకర్తలమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాలను టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డిప్రశాంతిరెడ్డి, ఎంఎస్‌రాజు, శాంతారామ్, నర్శిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, జానకీదేవితో కలసి మీడియాకు వెల్లడించారు. తిరుమల ఆలయంలో అత్యంత పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి పదిరోజులా,రెండురోజులా అనే అనుమానాలకు చెక్‌పెడుతూ సామాన్యభక్తుల అభిప్రాయాలకు అనుగుణంగా పదిరోజులపాటు వైకుంఠ దర్శనాలకు మొగ్గుచూపారు. డిసెంబర్ 30వతేదీ వైకుంఠ ఏకాదశి ఘడియలు మొదలవుతాయి. 31వతేదీ ద్వాదశితో బాటు 2026 నూతన సంవత్సరం జనవరి 8వతేదీ వరకు వైకుంఠద్వారాలు తెరచి ఉంచుతారు. పదిరోజులపాటు పవిత్రమైన వైకుంఠద్వారాలను తెరచి ఉంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలమేరకు ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో ఐదువేల ఆలయాల నిర్మాణాలకు ఆమోదం తెలిపారు.దేశంలోని అన్ని టిటిడి ఆలయాల్లో అన్నప్రసాద వితరణ ప్రారంభిస్తారు.కడపజిల్లా ఒంటిమిట్టలో 37కోట్ల రూపాయలతో వసతి సముదాయం నిర్మాణానికి ఆమోదం. మరో 3కోట్ల రూపాయలతో ఒంటిమిట్టపవిత్ర వనం నిర్మాణానికి ఆమోదించారు.టిటిడి గోశాల నిర్వహణను గోసంరక్షకులకు అప్పగించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేశారు. చిత్తూరుజిల్లా కాణిపాకం వరసిద్ధివినాయకస్వామి కొలువైన చోట 25కోట్ల రూపాయలతో టిటిడి అతిధిగృహం, కల్యాణమండపాలు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. సాధ్యమైనంతమంది ఎక్కువమంది భక్తులకు పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలు చేయించేందుకు ఇదివరకు లాగే పదిరోజులు వైకుంఠద్వార దర్శనాలకే ఆమోదం తెలిపారు. టిటిడి ప్రోక్యూర్‌మెంట్ సెల్‌లో భారీగా అవకతవకలు జరిగినట్లు గుర్తించడంతో ఏసిబితో విచారణ చేయించాలని బోర్డు నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో టిటిడి కొనుగోలుచేసిన అన్ని వస్తువుల్లోనూ భారీగా అవినీతి అక్రమాలు జరిగాయనేది బోర్డు నిర్ధారించింది. ఆ అక్రమాలపై సిబిఐతో సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారికి కఠినంగా శిక్షించేలాచూస్తామన్నారు. టిటిడి వైద్యవిభాగంలో అన్ని ఆస్పత్రులను మరింతగా పారదర్శకంగా నిర్వహిచేందుకు ఒకే డైరెక్టర్‌క్రిందకు తీసుకురానున్నామన్నారు. ప్రస్తుతం బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీశ్‌ను అన్ని ఆస్పత్రుల డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ అనుమతికి సిఫార్సు చేశారు. అంతకుముందు నవంబర్ 17నుండి 25వరకు జరిగే తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు.

## తెలంగాణలో హై అలర్ట్

>> నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో 6.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని టీజీడీపీఎస్ చెప్పింది.వాతావరణ హెచ్చరికలు బుధవారం 9 గంటల వరకు కొనసాగుతాయని ఐఎండీ తెలిపింది. మెదక్ జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షం వల్ల పలు కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది.

# 8వ వేతనసంఘం ఏర్పాటు

>> ఊరు ఆచార్యుడు పాలుక్ ఘోష్ తాత్కాలిక సభ్యుడిగా, పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్ సభ్య కార్యదర్శిగా ఉంటారు. జస్టిస్ దేశాయ్ కమిషన్ 18నెలల్లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. 8వ వేతన సంఘం సిఫారుసులు జనవరి ఒకటి నుంచి అమలయ్యే అవకాశం ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతమున్న జీతాలు, పింఛన్లను ఎంత మేర పెంచాలో ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం వేతన సవరణ చేపడుతుంది. ఈ కమిషన్ సిఫార్స్‌లతో 50లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69లక్షల మంది పింఛనుదారులకు ప్రయోజనం కలుగనుందని సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

**ఎరువుల రాయితీకి ఆమోదం:** మరోవైపు రూ.37,952 కోట్ల ఎరువుల రాయితీకి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి ఫాస్ఫేట్ అండ్ పొటాషియం ఎరువులపై సబ్సిడీ రేట్లను నిర్ణయించే ప్రతిపాదనను కేంద్రం ఆమోదం తెలిపిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఎరువుల రాయితీకి రూ.37,952 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఇది 2025 ఖరీఫ్ సీజన్ కంటే రూ.736 కోట్లు ఎక్కువ అని చెప్పారు. డై అమ్మోనియం ఫాస్ఫేట్, నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాష్, సల్ఫర్ వంటి ఎరువులపై ఆమోదించిన రేట్ల ప్రకారం సబ్సిడీలు అందించనున్నట్లు తెలిపారు. దీనివల్ల రైతులకు సబ్సిడీతో, సరసమైన ధరలకు ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

# 'మొంథా' టెర్రర్

>> విశాఖకు 220 కి.మీ. దూరంలో తుపాను కేంద్రీకృతమైంది.ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడకు సమీపంలో మొంథా తుపాన్ తీరాన్ని తాకిందని అమరావతి వాతావరణ కేంద్రం . పూర్తిగా తీరాన్ని దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటలు సమయం పట్టే అవకాశం ఉందని వాతావరణ అధికార యంత్రాంగం పేర్కొంది. తీరాన్ని దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని స్పష్టం చేసింది. ఊహించినట్లు మంగళవారం రాత్రి పరిస్థితుల్లో అనుహ్య మార్పులు చోటు చేసుకున్నాయి.దాదాపు 10 జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిస్తే, ఏడు జిల్లాల్లో పంటనష్టంతో రహదారి వ్యవస్థ దెబ్బతింది. కాకినాడ- మచిలీపట్నం మధ్య మొంథా తుపాన్ తీరాన్ని తాకిందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడిం చారు. గడిచిన 12 గంటల్లో గంటకు 17 కి.మీ వేగంతో తుపాన్ కదిలిందని పేర్కొన్నారు. ప్రస్తు తానికి మచిలీపట్నానికి 120 కిమీ, కాకినాడకి 110 కిమీ, విశాఖపట్నానికి 220 కిమీ దూ రంలో కేంద్రీకృతమైందని తెలిపారు. పూర్తిగా తీరం దాటడానికి 34 గంటల సమయం పడుతోందన్నారు. దీని ప్రభావంతో కోస్తా వెంబడి గంటకు 90-100 కిమీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వివరించారు. ప్రజలు సురక్షి తంగా ఇంట్లోనే ఉండాలన్నారు, కృష్ణా జిల్లాలోని గుడివాడలో తుఫాను ప్రభావంతో భారీ గాలులతో పలుచోట్ల ప్రధాన రహదారుల్లో చెట్లు నేలకూలాయి. ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్, గుడివాడ ముదినేపల్లి ప్రధాన రహదారిలో వృక్షాలు నేలకూలాయి. దీంతో రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్ నిలిచి పోయింది. హుటాహుటిన విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. చిమ్మ చీకటిలో ఆధునిక యంత్ర సామాగ్రితో రోడ్లపై కూలిన చెట్లను బృందాలు తొలగిస్తున్నాయి. అధికార యంత్రాంగం మొత్తం సహాయక చర్యలను ముమ్మరంగా చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో 222 పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తించి వాటిలో అవస రమైన 177 కేంద్రాలను ప్రారంభించింది. ఇప్ప టివరకు మొత్తం 11317 మందిని పునరావాస కేంద్రాలకు చేరవేసింది. అంతేకాకుండా ఉచితంగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరము, జలుబు, దగ్గు,వాంతులు, విరోచనాల నివారణకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం జరిగింది. సముద్ర తీర ప్రాంతంలో ఎలాంటి ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించి కాపాడుటకు ఎక్కడికక్కడ మొత్తం 196 పడవలు, 296 గజఈతగాళ్లను లైఫ్ జాకెట్లతో సిద్ధంగా ఉంచారు. నాగాయ లంకలోనీ శ్రీపాద క్షేత్రం నుండి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుటుం బాలు దెబ్బలో చిక్కుకుపోయిన నలు గురు గొర్రెల కాపరులను మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది ఎంతగానో కృషి చేసి సురక్షి తంగా ఒడ్డుకు చేర్చారు. మచిలీపట్నం నగరంలోని సాయిబాబా గుడి దగ్గర ఉన్న మురికి కాలువలో ఆవు దూడ ఇరుక్కుపోగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 1962 వాహన సిబ్బంది ఆ పశువులను సురక్షి తంగా బయటకు తీసి కాపాడారు. జిల్లాలో ప్రమాదాలను ప్రమాదాలు జరిగితే కాపాడేందుకు వీలుగా రెండు ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలను జిల్లాకు రప్పించి మచిలీపట్నం గుడివాడ డివి జన్లలో ఉంచడం జరిగింది. కృత్తివెన్ను మం డలం వాలంక గ్రామానికి చెందిన కోయ సుబ్బా రావు (55) పై చెట్టు విరిగిపడటంతో కాలు పెరిగింది. 108 వాహనంలో ఎక్కించి చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చేర్చారు. తుఫాను ప్రభావానికి జిల్లాలో 12 మండలాల్లోని 68 గ్రామాలు, 5 పట్టన ఆవాసాలల్లో 41,729 మంది ప్రజలు ప్రభావితం అవుతున్నారని, ఇప్పటి వరకూ 35,114 మందిని సురక్షి త ప్రదేశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. మొత్తం 401 పునరావాస కేంద్రాలు ఏర్పాటుకు సిద్ధం చేసి ఇప్పటి వరకూ 81 కేంద్రాలను తెరిచామని, లోతట్టు ప్రాంతాలలోని 9901 పశువులను సురక్షి త ప్రాంతాలకు తరలించడం జరిగిందని, 52 మంది పశువైద్యులతో 30 పశువైద్య శిభిరాలు ఏర్పాటు చేసి 200 మెట్రిక్ టన్నుల పశుగ్రాసం, 17 వేల వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచామన్నారు. సముద్ర వేటవలో ఉన్న బోట్లన్నిటినీ తీరానికి రప్పించామని, 4,573 బోట్లు కొట్టుకుపోకుండా ఉప్పుటేరు, క్రీక్ లలో ఉంచుకోవాలని మత్స్యకారులకు సూచించామని తెలియజేసారు. విజయవాడ డివిజన్‌లోని ప్రధాన రైల్వేస్టేషన్లలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లుఅధికారులు తెలిపారు.ప్రధాన రైల్వేస్టేషన్ల హెల్ప్‌డెస్క్‌ల నంబర్లు ఇలా ఉన్నాయి.

విజయవాడ - 0866 2575167
గూడూరు - 08624 250795
నెల్లూరు - 90633 47961
ఒంగోలు - 78159 09489
బాపట్ల - 78159 09329
తెనాలి - 78159 09463
ఏలూరు - 75693 05268
రాజమండ్రి - 83319 87657
సామర్లకోట - 73823 83188
తుని - 78159 09479
అనకాపల్లి - 75693 05669
భీమవరం - 78159 09402
గుడివాడ - 78159 09462

.ఇక మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలో రైలు సర్వీసులను రైల్వే శాఖ రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం నుంచి నడిచే దాదాపు 100 మేర విమాన సర్వీసులు రద్దయ్యాయి. కోస్తా జిల్లాల మీదుగా నడిచే మొత్తం 95



స్వాధీనం చేసుకున్న చరాస్థులను ప్రదర్శిస్తున్న దృశ్యం

## 'అద్విక' ఛీటింగ్ కేసు: ప్రధాన నిందితుల అరెస్ట్

>> రూ.13 లక్షలు ఇచ్చి కంపెనీ క్లోజ్ చేసి పారిపోయినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసు వివరాలు బయటకు రావడంతో సుమారు 1355 మంది మోసపోయినట్లు వెల్లడైంది. దీంతో ఈ కేసును తీవ్రంగా పరిగణించిన సిపి రాజశేఖరబాబు ఆదేశాలతో క్రైం డిసిపి తిరుమలేశ్వరరెడ్డి,అధ్వర్యంలో సెంట్రల్ ఎసిపి దర్యాప్తులో టాస్క్‌ఫోర్స్ ఎసిపి లతకుమారి, వారి సిబ్బంది,10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు కొనసాగించారు. ప్రధాన నిందితుడైన ఆదిత్య,మిగిలిన నిందితుల బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను, టెక్నికల్ సాక్షాలను సేకరించారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక బృందాల సమాచారం మేరకు సెంట్రల్ ఏసిపి దామోదరరావు వారి సిబ్బందితో కలిసి బల్లెం వారి వీధిలోని శ్రీ లక్ష్మిఎంక్లేవ్ అపార్ట్‌మెంట్ వద్ద నలుగురు నిందితులు, ఏజెంట్లైన తాడేపల్లి వెంకట ఆదిత్య, తాడేపల్లి అలియాస్ గంట సుజాత,గాదంశెట్టి బాలకృష్ణమూర్తి,(బృందావన్‌కాలని), గాదెంశెట్టి నాగలక్ష్మి(బృందావన్ కాలనీ)అను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో ప్రధాన నిందితుడైన ఆదిత్య అతని భార్య అయిన రెండవ నిందితురాలు సుజాత 2022లో అద్విక ట్రేడింగ్ కంపెనీ స్థాపించి రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టి,దుబాయిలో ఉన్న 'కబానా అకౌంట్' ద్వారా ట్రేడింగ్ ప్రారంభించారు. మొదట్లో పెద్దగా లాభాలు రాకపోయిన డబ్బులు సంపాదించాలన్న ఆశతో అధిక లాభాల పేరుతో ప్రధాన నిందితుడైన ఆదిత్య,అతని భార్య సుజాత,ఏజెంట్లు అయిన బాలకృష్ణమూర్తి, నాగలక్ష్మీ కుమారి,ఇతర ఏజెంట్ల సహాయంతో నెలకు 5% వడ్డీ ఏజెంట్లకు 3-4% మోసపూరిత హామినిచ్చి ప్రజలనుండి అధిక మొత్తంలో డిపాజిట్‌లు సేకరించారు. ట్రేడింగ్‌లో లాభాలు లేకపోయినా కొత్త డిపాజిటర్స్ కట్టిన డబ్బులతో పాత డిపాజిటర్స్‌కు వడ్డీ చెల్లించారు. 2023లో వార్షికోత్సవం నిర్వహించి మరిన్ని డిపాజిట్లు సేకరించారు. విచారణలో 2022 నుండి ఇప్పటి వరకు సుమారు 1450 మంది వద్ద నుండి సుమారు 400 కోట్లు డిపాజిట్‌లు సేకరించి దానిలో కొంత భాగాన్ని దుబాయిలో ఉన్న కబానా ట్రేడింగ్ మల్టీ బ్యాంకింగ్ ఫోరెక్స్ వంటి విదేశీ ప్లాట్‌ఫారంలకు బదిలీ చేసినట్లు వెల్లడైంది. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో సుమారు 14 కోట్లు లాస్ వచ్చినా కొత్తగాసేకరించిన డిపాజిట్స్‌నే పాత వారికి వడ్డీ కింద ఇచ్చారు. డిపాజిట్‌లలో సుమారు 4కోట్లతో ఆదిత్య చరాస్తులు కొనుగోలు చేశాడు. డిపాజిట్స్ దారులకు వడ్డీ కట్టలేని స్థితికి వచ్చేసరికి పలాయనం చిత్తగించాడు. అద్విక ట్రేడింగ్ కంపెనీలో మూసివేసే సమయానికి సుమారు 1450 మంది డిపాజిటర్స్,60 మంది ఏజెంట్లు ఉండగా వారిలో 1150 మంది డిపాజిటర్స్ నష్టపోయిన డబ్బులు సుమారు 135కోట్లు. సుమారు 25 ఏజెంట్లు నష్టపోయింది 9 కోట్లు. మొత్తం 144 కోట్లు. ఈ కేసులో నిందితులకు సంబంధించి రూ.100 కోట్ల విలువైన చరాస్థులను పోలీసులు గుర్తించి, వారినుండి రూ.23 లక్షల నగదు,580 గ్రాముల బంగారపు వస్తువులు,8.3 కిలోల వెండి వస్తువులు,టాటా సఫారి కారు,కంప్యూటర్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.కేసు విచారణలో కృషి చేసిన సెంట్రల్ ఏసిపి దామోదరరావు,టాస్క్‌ఫోర్స్ ఎసిసి లతకుమారి,సిఐ ఎ.సుబ్రహ్మణ్యం, సిహెచ్ ప్రకాష్,వాసిరెడ్డి శ్రీను,ఎ.పవన్ కిషోర్,ఎన్. రాజశేఖర్, డి.చవాన్, బి.చంద్రశేఖర్, కె.కిషోర్‌బాబులను,క్రైం డిసిపి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డిని సిపి రాజశేఖర బాబు ప్రత్యేకంగా అభినందించారు.

# 9 జిల్లాల్లో 544 క్యాంపుల ఏర్పాటు

### కోనసీమ జిల్లావాసులు బయటకు రావొద్దు: స్పెషల్ సిఎస్ అజయ్‌జైన్

**విశాఖపట్టణం, అక్టోబరు 28 :** మొంథా తుపాను మంగళవారం సాయంత్రం 5.00 గంటల సమయానికి కాకినాడ తీరానికి 120 కి.మీ. దూరంలో ఉందని, రాత్రి 10 నుంచి 12 గంటల మధ్యలో రాజోలు వద్ద తీరం దాటే అవకాశం ఉందని కోస్తాంధ్ర 9 జిల్లాల తుపాను ప్రత్యేకాధికారి, రాష్ట్ర స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ పేర్కొన్నారు. 9 జిల్లాల్లో 554 క్యాంపులు ఏర్పాటు చేశామని, 31,600 మందిని తరలించామన్నారు. కోనసీమ జిల్లా వాసులు బైటకు రావద్దని హెచ్చరికలు చేస్తున్నామన్నారు. కొబ్బరి, పామ్ ట్రీలు విరిగిపడే ప్రమాదం ఉందని, కోనసీమలో పవర్ సప్లైకి విఘాతం కలిగే అవకాశం ఉందని అజయ్ జైన్ పేర్కొన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా 18 వేల విద్యుత్ స్తంభాలను సిద్ధంగా ఉంచామని వివరించారు. కోనసీమ జిల్లా మామిడికుదురులో చెట్టుపడి 48 ఏళ్ల మహిళ దురదృష్టవశాత్తు మృత్యువాత పడిందని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన మినహా ఎక్కడా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని స్పష్టం చేశారు. మరీ అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు.ప్రతి చోటా తక్షణ సహాయక బృందాలను అందుబాటులో ఉంచాం : జిల్లా కలెక్టర్27వ తేదీ ఉదయం నుంచి 28వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు విశాఖపట్టణం జిల్లాలో 147 మి.మీ. వర్షపాతం నమోదైందని, 28వ తేదీ ఉదయం 8.30 నుంచి సాయంత్రం 3.00 గంటల వరకు 1.3 సెం.మీ. వర్షపాతం నమోదైందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. సోమవారంతో పోల్చితే మంగళవారం జిల్లాలో వర్షపాతం తగ్గిందని స్పష్టం చేశారు. ఎక్కడా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, జీవీఎంసీ పరిధిలోని 10 జోన్లలో జోన్ కు రెండేసి చొప్పున క్యూ.ఆర్.టి. బృందాలను అందుబాటులో ఉంచామని చెప్పారు. ఎప్పటికప్పుడు చెట్ల కొమ్మలను, డ్రెయిన్లలో పూడికను తొలగిస్తున్నామని వివరించారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రజలను సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించామని పేర్కొన్నారు. ప్రస్తుతం 8 క్యాంపుల్లో 144 మంది పునరావాసం పొందారని వివరించారు. ములగాడ, సీతకొండ వద్ద కొండచరియలు విరిగిపడ్డాయని, ఇతర చోట్ల రాళ్లు జారాయని పేర్కొన్నారు. మేఘాద్రి గెడ్డలో 6,000 క్యూసెక్కులు ఇన్ ఫ్లో, 7,000 క్యూసెక్కులు ఔట్ ఫ్లో ఉందని చెప్పారు. జిల్లాలోని 14 చెరువులు ప్రమాదరకర స్థితిలో ఉన్నాయని, ప్రజలను అప్రమత్తం చేయటంతో పాటు పునరావాస కేంద్రాలకు తరలించామని పేర్కొన్నారు. 119 చెట్లు కూలిపోగా 60 తొలగించామన్నారు. 9 విద్యుత్ స్తంభాలు పడిపోగాఏడింటిని పునరుద్ధరించామన్నారు. 16 యూజీడీ డ్రెయిన్లు పొంగిపొర్లగా మంగళవారం సాయంత్రం నాటికి తొమ్మిదింటిని సరి చేశామని, పనులు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. 29 చోట్ల నీరు నిలిచిపోగా 22చోట్ల పునరుద్ధరణ చర్యలు చేపట్టామన్నారు. 8 గోడలు కూలిపోగా 4 చోట్ల చర్యలు చేపట్టామన్నారు. తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా 35 ట్యాంకులను అందుబాటులో ఉంచామని కలెక్టర్ వివరించారు.

### చెట్టుకూలి కోనసీమలో

## మహిళ మృతి

**అమలాపురం, అక్టోబరు 28:** మొంథా తుపాను తీరం తాకే సమయంలో ప్రకృతి భీభత్సం సృష్టించింది. కోనసీమ జిల్లాలోని మాకనగూడెం గ్రామంలో చెట్టుకూలి మీదపడి ఒక మహిళ చెందినట్లు అధికారులు తెలిపారు. కోస్తాతీరంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ తుపాను భీభత్సానికి ప్రజలు వణికిపోతున్నారు. మొత్తం 19 సహాయ శిబిరాల్లో 700 మందిని చేర్పించామని అధికారులు చెపుతున్నారు. 22 జిల్లాల్లో రాష్ట్రప్రభుత్వం మొత్తం 3174 పునరావాసకేంద్రాలను ఏర్పాటుచేసింది. 3778 మంది అధికారులను నియమించింది. ఒక్క కోనసీమ జిల్లాలోనే అత్యధికంగా 650 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసింది. 110 కిలోమీటర్ల వేగంతో వస్తున్న ఈదురుగాలులకు విద్యుత్‌సరఫరా స్తంభించిపోయింది. అనేక చోట్ల విద్యుత్‌స్తంభాలు కూలి పోవడంతో సరఫరాను నిలిపివేశారు. విశాఖ ఎయిర్‌పోర్టునుండి మొత్తం 32 విమానసర్వీసులు రద్దయ్యాయి.

## వారం - వర్జ్యం

29-10-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
సప్తమి ఉ.9.21
ఉత్తరాషాఢ సాం.5.25
వర్జ్యం : రా.9.35-11.15
దు.ఉ.11.29-12.15
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** పెద్దల సలహాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**వృషభం:** బంధు, మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఉద్యోగయత్నాలు.

**మిథునం:** షేర్లు, భూముల క్రయవిక్రయాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారు.

**కర్కాటకం :** సంఘోద్ధరణకు మీ వంతు సహాయాన్ని అందిస్తారు.

**సింహం:** కారణం లేని చికాకులు మానసిక ప్రశాంతతకు భంగం కలిగిస్తాయి.

**కన్య :** ముఖ్యమైన విషయాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం.

**తుల :** స్త్రీలతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రుత్తులు పాటించండి. వాహన సౌఖ్యం.

**వృశ్చికం:** పురోభివృద్ధిలో స్వల్ప మందగమనం ఏర్పడిందని గుర్తించి కొత్త వ్యూహాలను అనుసరిస్తారు.

**ధనుస్సు:** వృత్తి, ఉద్యోగాలలో ఏర్పడిన చికాకులను కుటుంబసభ్యులపై ప్రదర్శిస్తారు.

**మకరం:** సేవక బృందము యొక్క బాగోగులు పరిశీలించి వారికి సహాయం అందిస్తారు.

**కుంభం:** ప్రతి చిన్న పనికి శ్రమించి చివరకు పూర్తి చేస్తారు. ప్రయాణాలు.

**మీనం :** సంతానం విద్యా విషయంలో బాధ్యతతో వ్యవహరిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తుఫాన్‌పై పూర్తి అప్రమత్తం

>> కిలోమీటరు పరిధిలో కూడా స్పష్టమైన హెచ్చరికలను అందిస్తుంది. గడచిన 24 గంటల్లో విశాఖ, కోనసీమ, శ్రీకాకుళం, అనకాపల్లి, పశ్చిమగోదావరి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. మొంథా తుపాను ప్రభావం కారణంగా వర్ష ప్రభావిత జిల్లాల్లోని 1.92 కోట్ల మందికి భారీ వర్ష సూచనలకు సంబంధించిన సమాచారాన్ని మొబైల్ ఫోన్లకు పంపామని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా 2,703 జనరేటర్లను కూడా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని సీఎంకు తెలిపారు. సచివాలయాల వారీగా నిత్యావసర వస్తువులను కూడా సిద్ధం చేసుకున్నట్టు వివరించారు. అత్యవసర సమయంలో కమ్యూనికేషన్ కోసం పోలీసు విభాగం 81 టవర్లతో వైర్ లెస్ సిస్టంను ఏర్పాటు చేశామన్నారు. జేసీబీలు, యంత్ర పరికరాలను కూడా యాప్ ద్వారా పర్యవేక్షి స్తున్నట్టు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం పశువులకు కావాల్సిన గ్రాసం కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాన్ని, చెట్లు, టవర్లు, హోర్డింగ్ లు పడిపోయిన ప్రాంతాలను గుర్తించి తక్షణం పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వర్ష ప్రభావంతో ఇప్పటి వరకూ 43 వేల హెక్టార్ల పంట నీట మునిగిందని అధికారులు తెలిపారు. కోనసీమ, ప్రకాశం, నంద్యాల, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో పంట నీటమునిగిందని సీఎంకు వివరించారు. అయితే పంట నష్టం వివరాలను రైతులు కూడా పంపేలా వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ లో మార్పు చేర్పులు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తుఫాను కారణంగా రోడ్లపై చెట్లు, విద్యుత్ స్తంభాలు, రోడ్ల ధ్వంసం వంటివి జరిగితే ఊళ్ల మధ్య రాకపోకలకు ఇబ్బంది అవుతుందని అలాంటి పరిస్థితి రాకుండా చూడాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్ర స్థాయి యంత్రాంగంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని, అందరూ ఫీల్డులో ఉన్నారని మంత్రి నారా లోకేష్ సీఎంకు వివరించారు. సమీక్షకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్ , అనిత, నారాయణ, సీఎస్ విజయానంద్, వివిధ శాఖల అధికారులు హాజరైయ్యారు. ఇక ఎన్డీయే కూటమి ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్ లో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం కాకినాడకు 270 కి.మీ దూరం నుంచి 15 కి.మీ వేగంతో రాష్ట్రం వైపు వస్తోంది. మంగళవారం రాత్రికి సివియర్ సైక్లోన్ గా మారి మచిలీపట్నంకళింగపట్నం మధ్య తీరం దాటుతుంది.కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంది. పరిస్థితి తీవ్రతను బట్టి రియల్ టైంలోనే మొబైల్ ఫోన్లకు సందేశాలు పంపిస్తున్నామన్నారు.

# 40లక్షల మంది ప్రభావితం


>> పరిస్థితులపై సమీక్ష చేశారు. ప్రధాని నరేంద్రమోడీ సీఎంతో మాట్లాడి ముందస్తు ఏర్పాట్లపై వాకబు చేశారు. తుపాను ప్రభావం, ముంపు తీవ్రత అధికంగా ఉండే 1,328 గ్రామాల్లోని ప్రజలను సురక్షి త ప్రాంతాలకు తరలించాం. 3,465 గర్భిణీలను తరలించి, వారికి కావాల్సిన పౌష్టికాహారం, నిత్యావసరాలను అందజేస్తున్నాం. 1,906 తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటుచేసి పునరావాసానికి అవసరమైన సామగ్రి అంతా పంపించామన్నారు.

**ఎన్ డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధం:** 14,798 పాఠశాలలకు సెలవులు ప్రకటించాం, 364 స్కూళ్లను పునరావాస కేంద్రాలుగా మార్చాం. ఈ నెల 29వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీచేసి, నిషేదాజ్ఞలు విధించాం. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యల కోసం 11 ఎన్ డీఆర్‌ఎఫ్, 12 ఎస్ డీఆర్ ఎఫ్ టీమ్ లు, రిజర్వ్ టీమ్ లు కూడా సిద్ధంగా ఉన్నాయి. అవసరమైతే రావడానికి ఆర్మీ కూడా హైదరాబాద్ లో సిద్ధంగా ఉన్నారు. 145 ఉడ్ కటింగ్ టీమ్స్ సిద్ధంగా ఉన్నారు, ఇప్పటికే విశాఖపట్నం, తదితర ప్రాంతాల్లో చెట్లు పడిపోయిన చోట వారు సేవలందిస్తున్నారు. మెడికల్ అండ్ హెల్త్ కు సంబంధించి 325 శిబిరాలు సిద్ధం చేశాం, 876 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ కూడా రెడీగా ఉన్నాయి.

**సహాయ చర్యలపై ముందస్తు ఏర్పాట్లు:**
తుపాను తీరం దాటిన తర్వాత పునరుద్ధరణ కార్యక్రమాలు చాలా కీలకం. ముఖ్యంగా విద్యుత్ శాఖకు సంబంధించి 11,347 స్తంభాలు, 1210 ట్రాన్స్ ఫార్మర్లు రెడీ చేశాం. సైక్లోన్ డైరెక్షన్ ను బట్టి సేవలందించేందుకు 772 రిస్టోరేషన్ టీమ్స్ ను కూడా సిద్ధంగా ఉంచాం. ట్రాఫిక్ కు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఆర్ అండ్ బి శాఖకు సంబంధించి 7,289 జేసీబీ, క్రేన్స్, వాహనాలు సిద్ధంగా ఉంచాం. ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో పక్కాగా చర్యలు చేపట్టి 1,037 డీజిల్ జనరేటర్లను ఆయా ప్రాంతాలకు పంపించాం. ఎయిర్ టెల్, జియో, ఇతర సర్వీసు ప్రొవైడర్లు సెల్ ఫోన్ టవర్లకు అవసరమైన డీజి సెట్లు సిద్ధం చేశారు, డీజిల్ కూడా అందుబాటులో ఉంచాం.

**రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తున్నాం:** డ్రోన్స్, లోలెవల్ ఫ్లయింగ్ వెహికల్స్ తో పంట నష్టం, ఇళ్లు, ఆస్తి నష్టంపై రియల్ టైమ్ ట్రాకింగ్ పెట్టి యుద్ధప్రాతిపదికన సహాయ, పునరావాస చర్యలు ప్రారంభిస్తాం తీరం దాటాక కూడా భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. గోపాలపురం ఎమ్మెల్యే ఎర్రకాలువ సమస్య ఉందన్నారు. వెంటనే తగు చర్యలు చేపట్టాం. తుపాను తీరం దాటాక క్షేత్రస్థాయిలో గ్రామాలు, పంటపొలాలకు వెళ్లి సహాయ, పునరావాస చర్యల్లో పాల్గొనాల్సిందిగా ప్రజాప్రతినిధులకు సూచించాం. ఇప్పుడు మా దృష్టి అంతా ప్రజలను చైతన్యవంతం చేసి, అప్రమత్తం చేయడమే. ప్రభుత్వం ఈ నెల 23నుంచే అప్రమత్తంగా ఉంది. ముఖ్యమంత్రిగారు ఇప్పటికి 12సార్లు సమీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజాప్రతినిధులంతా ఫీల్డ్‌లోనే ఉన్నారన్నారు.





కోనసీమ ప్రాంతంలో నీటమునిగిన కాలనీలు

# ప్రజలు ఆందోళన చెందవద్దు



మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు

కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ

తుఫాన్ ప్రభావిత తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించిన కేంద్రమంత్రి , ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

**నరసాపురం, ప్రభాతవార్త :** మొంథా తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేసిందని, తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందవద్దని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. మంగళవారం నరసాపురం నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాలలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో ఆయనతోపాటు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ గొట్టిపాటి రవికుమార్, నర్సాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు తదితరులు పాల్గొన్నారు. మొగల్తూరు మండలం పేరుపాలెం, కేపీ పాలెం గ్రామాలలో పర్యటించి పునరావాస కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రాల్లో వసతి సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉందని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న తుఫాన్ బాధితులతో మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుందని, ఆందోళన పడవద్దని మంత్రులు శ్రీనివాస వర్మ, గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. అనంతరం నర్సాపురం మండలం పెద్దమైనవానిలంకలోని పునరావాస కేంద్రాన్ని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, జిల్లా ఇన్చార్జి మంత్రి రవికుమార్, నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సందర్శించారు. పునరావాస కేంద్రంలోని ఏర్పాట్లపై తుఫాన్ బాధితులతో మాట్లాడి తెలుసుకున్నారు. జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని, ప్రజలు ధైర్యంగా ఉండాలని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ కోరారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందిన వారికి మంచి భోజనం, అల్పాహారం అందించాలని, ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ అధికారులను ఆదేశించారు. సముద్రపు కోత నుండి పెద్దమైనవాని లంక గ్రామానికి పూర్తి రక్షణ కల్పిస్తాం.. సముద్రపు కోతకి గురవుతున్న పెద్దమైనవానిలంక తీర ప్రాంతాన్ని పరిశీలించారు. సముద్రపు కోత నివారణకు జరుగుతున్న అడ్డుకట్ట పనుల పురోగతిని నరసాపురం ఆర్డీవో దాసిరాజును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తూ మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుందని, జిల్లాలో మొగల్తూరు మండలంలో 8, నరసాపురం మండలంలో 8 చొప్పున మొత్తం 16 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం కూడా నరసాపురం ప్రాంతానికి చేరుకుందని తెలిపారు. రాష్ట్రంలో తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోడీకి ఫోన్లో తెలిపారని, తుఫాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కావలసిన అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని మోడీ హామీ ఇచ్చారని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తెలిపారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లలో నుంచి బయటికి రావద్దని ఆయన సూచించారు. అనంతరం వేములదీవి వెస్ట్, ఈస్ట్ గ్రామాలలో పర్యటించి పునరావాస కేంద్రాలను సందర్శించారు. పర్యటనలో మంత్రుల వెంట ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిలు కలిదిండి వినోద్ వర్మ, తోట గంగరాజు పాల్గొన్నారు.



# తిరుమలపై 'మొంథా'!

- కూలిన భారీ చెట్టు, కారు ధ్వంసం
- ఎడతెరపిలేకుండా కురుస్తున్న వాన

**తిరుమల,అక్టోబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:** 'మొంథా"తుఫాన్ ప్రభావం తిరుమలపై తీవ్రంగా చూపుతోంది. మంగళవారం ఉదయం నుండి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు తిరుమల బాలాజీనగర్‌లో భారీ వృక్షం కూలింది. ఆ సమయంలో దానిక్రింద పార్కుచేసిన కారుపై పడటంతో ధ్వంసమైంది. అదే ప్రాంతంలో భక్తులు, స్థానికులు కూడా లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. కూలిన చెట్టును టిటిడి అటవీశాఖ అధికారులు గంటలోపే తొలగించారు. ఇటీవల వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు తిరుమల జలమయంగా మారింది. కొండపై ఐదు ప్రధాన జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. మంగళవారం ఉదయం నుండి ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తోంది. ఓ వైపు ఎడతెరపిలేని వర్షం మరోవైపు విపరీతమైన చలితో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీగా కురుస్తున్న వానలతో వాతావరణం మారి చలితీవ్రత పెరిగింది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు చలికి వణుకుతున్నారు. మంగళవారం ఉదయం కూడా భారీ వర్షం కురవడంతో భక్తులు ఆలయంలోపలకు శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపలకు వర్షంలో తడిసి లడ్డూవితరణ శాలకు చేరుకోవాల్సి వస్తోంది. భారీ వర్షాల కారణంగా తిరుమల ఘాట్‌రోడ్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం వుందని, వాహనదారులు ,భక్తులు అప్రమత్తంగా ఉండాలని టిటిడి విజిలెన్స్ హెచ్చరిస్తున్నారు. భారీ వర్షాలు పడుతుండటంతో ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు తలదాచుకునేందుకు షెడ్లవద్దకు పరుగులు తీస్తున్నారు. భారీ వర్షాలకు భక్తులు జాగ్రత్తలు పాటించాలని టిటిడి విజ్ఞప్తి చేస్తోంది. వర్షం తగ్గుముఖం పట్టేవరకు భక్తులు తిరుమలలో సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరుతున్నారు. తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే, తిరుగుప్రయాణమయ్యే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు కొండల్లోంచి జలపాతాలు జోరున పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తున్నాయి. తిరుమలకొండలను తెల్లటిపొగమంచు కమ్మేసి ఆహ్లాదకరంగా ఊటీని తలపింపజేస్తోంది.


# తుఫాన్ పరిస్థితులపై ప్రభుత్వం, అధికారులు అప్రమత్తం

## ఉప్పుటేరు వద్ద ప్రమాదకరంగా లేదు - పునరావాస కేంద్రాల వద్ద ఆహారం, వైద్య సౌకర్యాలు - జోరువానలో తుఫాన్ ప్రాంతాల్లో ఎంపి పర్యటన

**ఏలూరు, ప్రభాతవార్త అక్టోబర్ 28:** ఏలూరు జిల్లాలోన తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పర్యటించారు. ఉదయం జోరువానలోనే కొల్లేరు బయలుదేరిన ఎంపీ, కైకలూరు సమీపంలో మాదేపల్లి గ్రామంలో పంట పొలాల వద్ద రైతులతో మాట్లాడారు. కొల్లేరు సమీపంలో చెరువుల వద్ద ఆక్వా రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. కైకలూరు నుంచి ఉప్పుటేరు బ్రిడ్జి వద్దకు చేరుకున్న ఎంపీ ఉప్పుటేరు నీటి ఉధృతిని పరిశీలించారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఉండి ఎమ్మెల్యే, శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తో కలిసి ఉప్పుటేరు ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఎంపీ పుట్టా మహేష్ మీడియాతో మాట్లాడారు. తుఫాన్ పరిస్థితులపై ప్రభుత్వం, అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, ఎటువంటి ప్రాణ నష్టం జరక్కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబుగారు, నారా లోకేష్ గారు నిరంతరం పరిస్థితులను సమీక్షి స్తున్నారని, ప్రజా ప్రతినిధులంతా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోనే ఉండి, సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఆహారం, అత్యవసర వైద్యం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అనంతరం అక్కడినుంచి కైకలూరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పునరావాసం పొందుతున్న వ్యక్తులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. సాయంత్రం ముదినేపల్లి మండలం పెనుమల్లి గ్రామంలో కూటమి పార్టీల కార్యకర్తలతో భేటీలో పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తుఫాను సహాయ చర్యల్లో పాల్గొనాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలు కూడా అధికారుల సూచనలు పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసరం అయితే ఏలూరు కలెక్టరేట్ వద్ద కంట్రోల్ రూమ్ నెంబర్ 1800233 1077, 94910 41419 ఫోన్ నెంబర్ల లేదా ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయ నంబర్స్ +91 96181 94377, +91 98855 19299 కు ఎవరైనా కాల్ చేయవచ్చని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు.

# ప్రాజెక్టులను పరిశీలించిన కడప, అన్నమయ్య జిల్లా కలెక్టర్లు

## ఫించా ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత



**రాజంపేట, అక్టోబర్28 ప్రభాతవార్త** రాజంపేట, అక్టోబర్ 28: కడప, అన్నమయ్య జిల్లాలలో "మొంథా" తుఫాను ప్రభావంతో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రెండు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తమయ్యారు. అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. స్వయంగా వారే ప్రాజెక్టులను, ప్రమాదకరమైన ప్రాంతాల్లో పరిశీలించారు. పెనగలూరుమండలం లోని పల్లంపాడు గ్రామాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, రాజంపేట సబ్ కలెక్టర్ భావన,రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే తో కలసి పరిశీలించారు. గ్రామాన్ని నీరు చుట్టుపడటంతో నదిలోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎస్డిఎఫ్ బృందాన్ని అక్కడే మకాం వేసేలా ఆదేశించారు. మరోవైపు కడప కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి బుగ్గ వంక ప్రాజెక్టు ను పరిశీలించారు. రెండు జిల్లాలలో దాదాపు అన్ని ప్రాజెక్టులు నిండిపోయాయి. దీంతో వీటిని లోతట్టు ప్రాంతాలకు విడుదల చేశారు. గండికోట, మైలవరం, బుగ్గ వంక, వెలుగల్లు, పింఛ ప్రాజెక్టులు నిండిపోవడంతో నీటిని విడుదల చేశారు. అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు చెయ్యరు నది వరద ప్రవాహాన్ని స్వయంగా వెళ్లి పరిశీలించారు. మందపల్లి గ్రామాన్ని పరిశీలించారు ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెండు జిల్లాలలో తుఫాన్ ప్రభావంతో ఎక్కడా భారీ వర్ష వర్షపాతం నమోదు కాలేదు. కడప జిల్లాలో అత్యధికంగా కాసినాయన మండలంలో 6 సెంటీమీటర్లు, అన్నమయ్య జిల్లాలో పెన గలూరులో 3 సెంటీమీటర్లు వర్షపాతం నమోదయింది.

# తీర ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు

## పునరావాస కేంద్రాలను పరిశీలించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 (ప్రభాతవార్త):** మొంథా తుఫాను నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ఇతర అధికారులతో కలిసి కాకినాడ పట్టణం ఏటిమొగ, దుమ్ములుపేట; పర్లోవపేట ఏఎంజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం, తాళ్ళరేవు మండలం గాడిమొగ ఇతర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరఏర్పాట్లను పర్యవేక్షించారు. కాకినాడ పట్టణంలో పునరావాసక కేంద్రాలకు తరలించిన ప్రజల కోసం కాకినాడ సూర్యకళామందిరం ప్రక్కన సిద్ధం చేసిన భోజన పదార్థాలను జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం కాకినాడ పట్టణం దుమ్ములుపేట తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజల కోసం పర్లోవపేట ఏఎంజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ప్రజలకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందు మాధవ్, ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు స్వయం గా మధ్యాహ్నం భోజనం వడ్డించారు. అనంతరం కాకినాడ జిల్లా తాళ్ళరేవు గాడిమొగ ధీరుబాయ్ అంబానీ కమ్యూ నిటీ హాలులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలోని ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను అడిగి తెలుసు కున్నారు. ప్రజలకు భోజన పదార్థాలు వడ్డించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ మొంథా తుఫాను నేపథ్యంలో కాకినాడ జిల్లాలో 18 మండలాల్లో 67 గ్రామాలు, 5 పట్టణ ప్రాంతాల్లో తుఫాను ప్రభావం ఉంద న్నారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలను సుం ˆక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసేమన్నారు. జిల్లా వ్యాప్తంగా 401 పునరావాస కేంద్రాలు సిద్ధం చేయగా, ఇప్పటికే 76 కేంద్రాలు ప్రారంభించామన్నారు. కాకినాడ పట్టణంలో 16 పునరావాస కేంద్రాల్లోకి లోతట్టు ప్రాంత ప్రజలను తరలించడం జరి గిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# అవసరమైతే తప్ప.. ప్రజలు బయటకు రావొద్దు

- మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి సూచన



**ఒంగోలు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 28:** తీవ్ర తుఫాను ప్రభావరీత్యా మంగళవారం రాత్రికి ప్రజలు ఎట్టి పరి స్థితుల్లో సాధ్యమైనంత వరకు బయటకు రావద్దని ఏదైనా అత్యవసర పరిస్థితుల దృష్ట్యా పోలీస్ శాఖ వారిని గాని, రెవిన్యూ శాఖ వారిని గాని, తెలుగుదేశం నాయకులనుసంప్రదించగలరని మార్కా పురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గ అధికారలతో చరవాణి ద్వారా సమీక్ష నిర్వహించామని, నియోజక వర్గంలోని తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు గ్రామాల్లో, వార్డుల్లో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# రాజధానిలో ప్రత్యేక ప్రాజెక్టులకు ఎస్పివి ఏర్పాటు

**విజయవాడ,అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికారిక సంస్థ (సీఆర్‌డీఉ) పరిధిలో ప్రత్యేక ప్రాజెక్టులు చేపట్టేందుకు 'అమరావతి గ్రోత్,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్' పేరుతో ప్రత్యేక వాహక సంస్థ(ఎస్పీవీ)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రత్యేక ప్రాజెక్టులు గడువులోగా పూర్తి చేసేందుకు ఎస్పీవీ అవసరమన్న సీఆర్‌డీఏ కమీషనర్ ప్రతిపాదనలు ఆమోదిస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. 'అమరావతి గ్రోత్,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్'కు రాష్ట్ర పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఇంధన,రోడ్లు,భవనాల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు,పరిశ్రమల శాఖ కార్యదర్శి,సీఆర్‌డీఏ కమీషనర్ డైరెక్టర్లుగా ఉంటారని ప్రభుత్వం పేర్కొంది.

# గ్రామీణ స్థానికసంస్థలకు రూ. 410 కోట్లు విడుదల

## గ్రామీణాభివృద్ధి సంస్థ ఉత్తర్వులు

**విజయవాడ,అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ స్థానికసంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.410 కోట్లు విడుదల చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్త ర్వులు జారీచేసింది. 202526 సంవత్స రానికి సంబంధించి మొదటి విడత అన్ టైడ్ గ్రాంట్ కింద రూ.365 కోట్లు,

అదనపు నిధులు మరో రూ.45 కోట్లు కలిపి మొత్తం రూ.410 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం వేరు వేరుగా ఆదేశాలిచ్చింది.

# ర్యాంప్ ప్రోగ్రాం పర్యవేక్షణకు కమిటీ

**వి.యవాడ,అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** పరిశ్రమల శాఖ కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళిక అమలు ల క్ష్యం(ఎస్ఐపీ-ఐపీ) కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంఎస్ఎంఈ సీఈవో కమిటీ మెంబర్ కన్వీనర్‌గా...వివిధ శాఖలకు చెందిన 7 మంది సభ్యులుగా...జిల్లా నోడల్ అధికారులు ప్రత్యేక ఆహ్వానితులుగా కమిటీలో ఉంటారని పేర్కొంది. ర్యాంప్ జిల్లా నోడల్ అధికారులు కమిటీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు ర్యాంప్ ప్రోగ్రాంలో తీసుకున్న నిర్ణయాల పురోగతిని నెలకోసారి కమిటీ సమీక్షించాలి. వ్యూహాత్మక పెట్టుబడి కార్యాచరణకు అనుగుణంగా సమావేశం ఉండాలి.

# తిరుమల సమాచారం

## కార్తికమాస హోమాల్లో వేదోక్తంగా నవగ్రహహోమం



**తిరుమల,అక్టోబర్ 28ప్రభాత వార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యం లోని ప్రముఖ శైవాలయం తిరుపతి కపిలేశ్వర ఆలయంలో కార్తీకమాస పూజల్లో భాగంగా మంగళవారం నవగ్రహహోమం నిర్వహించారు. ఆలయ అర్చ కులు ఉదయం శాస్త్రోక్తం గా యాగశాలలో పూజ, హోమం, లఘుపూర్ణాహుతి, నివేదన హారతి చేపట్టారు. సాయంత్రం హోమం, సహస్రనామార్చన, విశేషదీపారాధన జరిపించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు. కార్తీకమాసాన నెలరోజులపాటు హోమాలను ఏకాంతంగా జరిపించడం సంప్రదాయం.

## అంతా మంచి జరగాలి

- శ్రీవారి సుప్రభాతసేవలో తమిళనటుడు అజిత్‌కుమార్



**తిరుమల,అక్టోబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదమొక్కులవాడు...తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని, దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తమిళనాడు అజిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం వేకువజామున ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి సుప్రభాతసేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకుని దేవుని ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రం బహుకరించారు.ఆలయం వెలుపలకు వచ్చిన అజిత్‌ను చూడటానికి ఆయనతో చేతులు కలిపి సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం చూపారు. అందరినీ ఆప్యాయంగా పలకరించి అభిమానులతో సెల్ఫీలు దిగారు.అందరి కోరికతో ఆయన స్వయంగా సెల్ఫీలు దిగడమేగాక తీశాడు. అభిమానులతో ఆనందంగా గడిపారు. ఓ అభిమానితో స్వయంగా ఆయన సెల్ఫీ దిగడం అక్కడివారిని ఔరా అనిపించింది. కొందరు అభిమానులు తల.. తల అనే నినాదాలు చేయగా ఆలయంముందు అలాంటి నినాదాలు వద్దని ఆయన సైగలతో సూచించారు.

## శ్రీవారి సేవలో జయ్‌అన్మోల్‌అంబానీ



**తిరుమల,అక్టోబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:** కలి యుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్‌అంబానీ కుటుంబసభ్యుడు జయ్‌అన్మోల్‌అంబానీ దర్శించు కున్నారు. కుటుంబంతో కలసి వచ్చిన ఆయన ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. ఆలయంలో తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన అన్మోల్‌అంబానీ ఆనందనిలయం లోని శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన జయ్‌అన్మోల్‌అంబానీని చూడటానికి భక్తులు ఆసక్తిచూపారు. సెల్ఫీలు తీసుకున్నారు. భక్తులతో ఆయన కూడా ఆప్యాయంగా పలకరించారు. తదేకంగా ఆధ్యాత్మికభావంతోనే కనిపించారు.

# 'ఆరంజ్ అలర్ట్'తో తిరుపతిలో ముంచెత్తుతున్న వానలు

**తిరుపతి,అక్టోబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:** "మొంథా"తుఫాన్ తో తిరుపతి జిల్లాలో ప్రభుత్వం ఆరంజెఅలర్ట్ ప్రకటించినా జిల్లావ్యాప్తంగా వానలు ముంచెత్తుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం వరకు తిరుపతి,తిరుపతి రూరల్,చంద్రగిరి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట, చిల్లకూరు ,సత్యవేడు, పుత్తూరు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2గంటల నుండి విపరీతమైనగాలు వీస్తున్నాయి. తుఫాన్ తీరం దాటే అవకాశం ఉండటంతో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికార యంత్రాంగం హెచ్చరికలు చేసింది. మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూమ్‌లో తుఫాన్ పరిస్థితుల అంచనా ప్రత్యేక అధికారి అరుణ్‌బాబు, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, ఇన్‌ఛార్జి సంయుక్తకలెక్టర్ మౌర్య రెవెన్యూయంత్రాంగంతో సమీక్షించారు. తిరుపతి జిల్లాలో తుఫాన్‌ను తేలికగా తీసుకోవద్దని, వర్షాల తీవ్రత దృష్ట్యా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.


**నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**

(పూర్వపు ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)
నమోదిత కార్యాలయం-కార్యాలయం : యూనిట్ నం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ అంధేరి ఘట్‌కోపర్ లింక్ రోడ్, చాకల, అంధేరి (ఈస్ట్), ముంబై-400093

NIWAS HOUSING FINANCE

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన

NHFPL ఈ క్రింది రుణగ్రహీతలకు నివాసితగృహాల యొక్క తనఖా పై గృహ రుణం/తనఖా రుణం/నిర్మాణ రుణం మంజూరు చేసింది. నేషనల్ హౌసింగ్ బ్యాంక్/RBI యొక్క మార్గదర్శకాలు మరియు ఆదేశాలను అనుసరించి సదరు రుణాలు తిరిగి చెల్లింపులు సక్రమంగా లేకపోవడంతో వారి ఖాతాలను ఫైనల్‌గా నిరర్థక ఆస్తులుగా వర్గీకరించడమైనది. అందువలన NHFPL సర్ఫాసి చట్టం 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద హక్కులను వినియోగిస్తూ వారికి చట్ట ప్రకారం నోటీస్ జారీ చేస్తూ ఆ రుణగ్రహీతలను రుణబకాయి మొత్తాలను వారికి ఎదురుగా పేర్కొన్న రుణబకాయి మొత్తం డిమాండ్ నోటీస్ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా పిలుపు ఇవ్వడమైనది. [illegible] 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ఇందుమూలముగా పిలుపు ఇవ్వడమైనది. [illegible]

| క్ర. సం. | స్థానం/రుణ ఖాతా నంబర్ | రుణగ్రహీత పేరు/ సహ రుణగ్రహీతలు/ హామీదారు | డిమాండ్ నోటీస్ పంపిన తేది | డిమాండ్ నోటీస్‌ప్రకారం మొత్తం |
|---|---|---|---|---|
| 1. | గుంటూరు-అరండల్‌పేట LNGUN0HL-12180008270, LNGUN0HL-12180008271 | 1. అల్లాబక్ష్ షేక్ (ఋణగ్రహీత) 2. జరీనా షా (సహ- ఋణగ్రహీత) | 08-అక్టోబర్-2025 | రూ.1300836/- (రూపాయలు పదమూడు లక్షల ఎనిమిది వందల ముప్పై ఆరు మాత్రమే) |
| | ఆస్తి వివరణ : గుంటూరు జిల్లా వద్ద, తెనాలి రిజిస్ట్రేషన్ జిల్లా, తెనాలి ఉప-జిల్లా, తెనాలి పట్టణ మునిసిపల్ ఏరియా పరిధిలో, వార్డ్ నం.7, బ్లాక్ నం. 5, TS No 181/2 ఎక. 0.63 సెంట్లు మొత్తంలో, తెనాలి పట్టణం, [illegible] 36చ.గ. విస్తీర్ణం దాని దక్షిణంలో 72చ.గ. గ్రౌండ్ మరియు ఫస్ట్ ఫ్లోర్‌లతో అందులోని ఆర్‌సిసి ఇల్లు ఇం.నం.17-2-47 (పార్ట్) కలిగి అన్ని ఫిక్చర్లు మరియు ఫిట్టింగ్‌తో ఈ క్రింది సరిహద్దులు. తూర్పు : మునిసిపల్ బజార్ 16-00. దక్షిణం : [illegible] 20.03. పడమర: [illegible] 16-03. ఉత్తరం : [illegible] 20-03 అన్ని ప్రస్తుత మరియు భవిష్యత్ నిర్మాణ భవనాలు మరియు సూపర్ స్ట్రక్చర్‌లు అన్నీ కలిపి. | | | |
| 2. | గుంటూరు-అరండల్‌పేట LNGUNLAP-11180007043, LNGUNLAP-11180007044 | 1. షేక్ అబ్దుల్ రహీం (ఋణగ్రహీత) 2. షేక్ అబ్దుల్ రవూఫ్ (సహ- ఋణగ్రహీత) 3. షేక్ సకీనాబీ (సహ- ఋణగ్రహీత) 4. షేక్ గౌస్యా (సహ- ఋణగ్రహీత) | 08-అక్టోబర్-2025 | రూ.278972/- (రూపాయలు రెండు లక్షల డెబ్బై ఎనిమిది వేల తొమ్మిది వందల డెబ్బై రెండు మాత్రమే) |
| | ఆస్తి వివరణ : గుంటూరు జిల్లా వద్ద గుంటూరు ఉప జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో, గుంటూరు సిటీ, [illegible] తోట, మునిసిపల్ పాత వార్డ్ నం.3, కొత్త వార్డ్ నం.7, బ్లాక్ నం. 12, TS No. 731, ఎక. 9-912 చ.అ. మొత్తంలో, 50చ.గ. లేదా సమానం 41.80చ.మీ. విస్తీర్ణం యొక్క ఖాళీ నివాసిత స్థలం, ఇం.నం.7-2-84 కలిగిన టైల్ ఇల్లుతో అసెట్ నెం. 12627 మరియు విద్యుత్ సర్వీస్ కనక్షన్ SC No. 22903 తో సరిహద్దులచే: తూర్పు: [illegible] గంటయ్యకు చెందిన ప్రహారీ గోడ 30'-0". దక్షిణం: మునిసిపల్ రోడ్ 15'-0". పడమర : ఎస్.కె. [illegible] చెందిన కొంత ఆస్తి మరియు కొంత ప్రహారీ గోడ. మొత్తంలో 30'-0". ఉత్తరం: [illegible] చెందిన ఆస్తి వగైరా 150' | | | |
| 3. | గుంటూరు-అరండల్‌పేట LNGUNLAP-11240049837 | 1. [illegible] రాజేష్ (ఋణగ్రహీత) 2. [illegible] వరదనమ్మ (సహ- ఋణగ్రహీత) | 14-అక్టోబర్-2025 | రూ.625161/- (రూపాయలు ఆరు లక్షల ఇరవై ఐదు వేల ఒక వంద అరవై ఒక్కటి మాత్రమే) |
| | ఆస్తి వివరణ : పల్నాడు జిల్లా, నరసరావు పేట RO,వినుకొండ SRO,ఇపూరు మండలం,ఇనుమెళ్ల, [illegible] గ్రామం యొక్క ఎస్.నెం.570 మరియు పంచాయత్, ఆస్తి ఇం.నం.3-11, కలిగివున్న, అసెస్‌మెంట్ నం.311తో. తూర్పు: [illegible] ఖాళీ స్థలం. దక్షిణం: పంచాయతీ రోడ్. పడమర: [illegible] ఖాళీ స్థలం. ఉత్తరం : [illegible] ఖాళీ స్థలం. ఈ సరిహద్దులలో 387.11చ.గ. విస్తీర్ణం కలిగిన ACC రూఫ్ కలిగిన 675చ.అ. ఏరియా యొక్క స్థలం అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో | | | |

ప్రదేశం : గుంటూరు, ఆంధ్రప్రదేశ్
తేదీ : 29.10.2025

సం/- అధీకృత అధికారి
నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున

వార్త


మంచి మాటయే గొప్ప అలంకారం. ఆభరణాలన్ని నశిస్తాయి కాని, వాక్కు అనే ఆభరణం ఎన్నటికీ నశించదు.

-భర్తృహరి

# రసకందాయంలో రాజకీయం!


దేశమంతటా బీహార్ శాసనసభ ఎన్నికల గురించే పెద్ద చర్చ జరుగుతోంది. రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయనే చెప్పాలి. విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రచారం వేడెక్కింది. ఈ మధ్యనే ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచార సభలో ఆర్‌జెడి పరిపాలన గురించి చెణుకులు విసరడంతో ప్రచారం వేడెక్కినట్లేవుంది. అలనాటి అవినీతి గురించి వందేళ్లయినా చర్చించుకుంటారని ప్రధాని చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల బీహారుకు ఒరిగిందేమీ లేదని ఇండియా బ్లాక్ మహా ఘట్బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్ జెడి నేత తేజస్వీ యాదవ్ ఘాటుగా స్పందించారు. ఈ కూటమి నేతల మధ్య ఏకాభిప్రాయం మాత్రం కుదరకపోవడం చెప్పుకోదగిన అంశం. అయినా కూటమి భాగస్వాముల మధ్య ఏదో తెలియని శంక వెన్నాడుతూనేవుంది. అక్కడ పోటీ చేస్తున్న సీట్లను బట్టి ఎవరి పరువు వారు కాపాడుకొని ఎక్కువ స్థానాల్లో తమ అభ్యర్థుల్ని గెలిచి తీసుకురావడం తప్ప వేరే ప్రత్యామ్నయమూ కనపడదు కొన్ని చోట్ల పరస్పర పోటీలో ఉండడం వారికి వ్యతిరేకఅంశం. దీనికితోడు ప్రచార పోస్టర్లలో రాహుల్ బొమ్మ లేకుండా ఆర్జెడి ముందుకు వెళ్తుండడం కాంగ్రెస్ శ్రేణులకు రుచించడం లేదు. సహజంగానే ఇలాంటి అంశాలను ఎన్డీఎ కూటమి తమకు అనుకూల ప్రచార అస్త్రాలుగా చేసుకుంటోంది. ఎత్తిచూపుతోంది. ఆర్‌జెడి కాంగ్రెస్‌ల మధ్య పొత్తు లేదనేందుకు ఇదే ఉదాహరణంటూ ఓటర్ల ముందుకు ఎన్డీఏ తెస్తోంది. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ పాత్ర ప్రభావం ఏ మేరకు ఉంటుందనేది ఎన్నికల ఫలితాల నాడు కానీ తెలియదు. బీహార్‌లో పాలనపై కన్నేసి నితీష్ కుమార్ చెంతన చేరడం విభేదించి బయటకువచ్చి జన సురాజ్‌పార్టీ పెట్టడం, ఆపై జనంలోకి బాగా చొచ్చుకెళ్లిన ప్రశాంత కిషోర్ ఎలాంటి వ్యూహాలు లేకుండా ఎన్నికల గోదాలోకి దిగి వుంటారని ఎవరూఅనుకోలేరు. ఎంత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారెండు ప్రధాన కూటములను నిలవరించి ముందుకు రాగలరని ఎవరూ అనుకోవడం లేదు. రావడం కష్టమే. అలాగని హంగ్ ఏర్పడుతుందని ఎక్కడా చెప్పడం లేదు. ఏదో ఆశయం ఉండబట్టే దింపుడు కళ్లాల ఆశతో ప్రశాంతంగా తన పనేదో తాను చేసుకుపోతున్నారు. బీహార్లో ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణ ఎత్తుగడ ద్వారా ఎన్నికల కమిషన్ ఏదో చేస్తోందనే అనుమానాలు రేకెత్తించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తన ప్రచారాన్ని ముందుగానే చేసుకోగలిగింది. బీహార్ ప్రజల నోళ్లల్లో ఆ అంశానికి సంబంధించిన విషయాలు బాగా నానాయి. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ పాలనతో జనం విసుగెత్తి ఉన్నారన్న ప్రకంపనలు కూడా ఉన్నాయి. పదవే లక్ష్యంగా కూట ములు ఫిరాయించారని ఆయనపై ఆరోపణలున్నాయి. స్వచ్ఛమైన నేతగా పేరుండి చివరకు పదవి కోసంఅవకాశ వాద రాజకీయాలకు పాల్పడినట్లు జనాభిప్రాయం. 2020అక్టోబరు నవంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత బిజెపి పంచన చేరి నితీష్ సిఎం అయ్యారు. ఆ పార్టీ తనను ఇబ్బంది పెడుతోందని పదవికి రాజీనామా చేసి మహా ఘట్ బంధన్ వైపు వచ్చి తిరిగి సిఎం అయ్యారు. రెండేళ్లన్నా గడవక ముందే, సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముంగిట 2024 జనవరిలో ఎన్డీఏ తీర్థం పుచ్చుకొని మరోసారి తన పదవి కాపాడుకున్నారు. ఇలా ఆయన నిలకడలేని రాజకీయాలకు ఆరితేరారని ప్రత్యర్థి పార్టీలు భారీ ప్రచారం చేస్తున్నాయి. ఈ విషయంలో ప్రశాంత్ కిషోర్ తన ర్యాలీలో ఇదే ప్రచారంతో ప్రజల్లోకి వెళ్లి చేసినప్రచారం జనం స్మృతిపథంలో మెదులుతూనేఉంది. నితీష్‌తన సీట్లతో భుజం కాసి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించారని ప్రతీతి. అందుకే ఎన్డీయే తన తరపున సిఎం అభ్యర్థి ఎవరో చెప్పడానికి జంకుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నితీష్ పార్టీకి బిజెపి కంటే తక్కువ సీట్లొచ్చినా ఆయన్నే సిఎం కుర్చీలో కూర్చోబెట్టామంటున్న బిజెపి ప్రస్తుత ఎన్నికల్లో తన గొంతును సవరిస్తోంది. మొత్తం 243 సీట్లలో బిజెపి, జెడియు చెరో 101 పోటీ చేసి, తతిమ్మా స్థానాలను తమ భాగస్వామ్య పార్టీలకు కేటాయించాయి. కూటమి విస్తృత ప్రయోజనాల కోసం తాము గతంలో పోటీ చేసిన సీట్ల కంటే ఇరువురం దిగొచ్చి తగ్గించుకున్నామని బిజెపి వాదనలో పసకనిపించదు. రాష్ట్రంలో బలమైన ప్రాంతీయ పార్టీ జెడియును మింగేసి ఆ స్థానాన్ని బిజెపి ఆక్రమిస్తోందని కొన్నేళ్ల బీహార్ రాజకీయ పరిణామాలను బట్టి తెలుస్తుంది. ఈ ఎన్నికల్లో ప్రత్యేకత ఏమిటంటే రెండు కూటముల్లోనూ మెజార్టీ సీట్లు సాధించిన ఏ పార్టీ అయినా తన వంతు రాజకీయం తాను చేస్తుం దని విశ్లేషకుల అభిప్రాయం. ఎవరు గెలుస్తారో ఎవరు ఎవరిని పక్కనపెడతారో వంటి అంశాల్లో ఈసారి బీహారు మార్క్ రాజకీయాలోనే తేలుతుంది. బీహార్‌లో దాదాపు 40 నియో జకవర్గాల్లో ముస్లిం ఓటర్లు నిర్ణాయక శక్తిగా ఉండబట్టే వారినాకట్టుకొనే ప్రయత్నంలో భాగంగా ఆర్జేడి తాము అధికారంలోకి వస్తే 'వక్ఫ్' చట్టాన్ని రద్దు చేస్తామని ప్రకటించింది. యాదవులు, ముస్లింలు, ఆర్థికం గా వెను కబడిన కులాలుండే బీహార్ రాజకీయ నేతలకు బిసిలు ఎటువైపో తెలియక గాభరా పడ్తున్నారు. ఎవరి ఎన్నికల మేనిఫెస్టోలు వారు రచించుకోలేక కులాల ఆకర్షణ కోసం ఏవేవో చెప్పడమే ఈ ఎన్నికల అవగా హన. నిర్దిష్టమైన పథకాలు కూడా ప్రచారం చేసుకోలేక పోవడం విశేషం. ముస్లింలంతా మూకుమ్మడిగా కాంగ్రెస్ కు ఓటు బ్యాంకుగా మారవచ్చునని మహాఘట్బంధన్ భావిస్తున్నారు. వచ్చే యేడాది అన్ని ఎన్నికలకు బీహార్ ఎన్నికలే దిక్సూచి.

వ్యర్థమైన మాటలు వేలాదిగా చెప్పడం కన్నా శాంతిని, కాంతిని ప్రసాదించే ప్రయోజనకరమైన మాట ఒక్కటి చాలు.



గౌతమ బుద్ధుడు

ప్రపంచాన్ని మార్చదలచినవాడు ముందుగా తనను తాను మార్చుకోవడం నేర్చుకోవాలి.



సోక్రటీస్

# ప్రజావాక్కు



## ప్రాణాలు గాలిలో దీపాలేనా..

అదుపులేని ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ప్రయాణీకుల ప్రాణాల్ని గాలిలో దీపాలుగా చేస్తున్నాయి. కర్నూలు దగ్గరలో జరిగిన అగ్నిప్రమాదంలో బస్సులోనే ఆహుతి అయిన 19 మానవ ప్రాణాలు ఈ దుస్థితికి ఉదాహరణ. ఆ ప్రమాద కారణాలు ప్రత్యక్షంగా ఏవైనప్పటికీ, అలాంటి ప్రమాదం ఏర్పడడానికి పరోక్షంగా దోహదపడిన పరిస్థితుల్ని చక్కదిద్దడానికి పూనుకోకపోతే మళ్లీ మళ్లీ అలాంటి దురదృష్టకర సంఘటనలకు పెచ్చరిల్లుతాయి. ఈ దుర్ఘటన జరిగాక ఆంధ్రప్రదేశ్‌లో సంబంధిత అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. రెండు రోజుల్లో 360కి పైగా అతిక్రమణలు గుర్తించారు. నలభై బస్సుల్ని సీజ్ చేశారు. కళ్లెదుట ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణించే బస్సులు ఒక్క రోజు తనిఖీలోనే పదుల సంఖ్యలో ప్రయాణింప వీలుగాని కండిషన్‌లో ఉన్నాయంటే వ్యవస్థ ఏ స్థితిలో ఉందో అర్థమౌతుంది.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## ప్రజలకు న్యాయం చేయాలి

తెలంగాణ రాష్ట్రము లోని 12.769 గ్రామ పంచాయతీలల్లోఎస్సి, ఎస్టీ. కాలనీలలో ఇంటి యజమానులు ప్రజలు నడిచే గ్రామ పంచాయతీ రోడ్డు పై నల్లా నీళ్ల ఓడల ట్యాంక్ ప్రభుత్వ స్థలం రోడ్డు పై నిర్మించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోని అట్టి వాటిని గుర్తించి తొలగించడం అవసరం. రోడ్లు అక్రమంగా వాడుకొంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి. నోటీసులు జారీ చేసి అట్టి వాటిని గ్రామ పంచాయతీ సిబ్బంది చేత తొలగించడం అవసరం. ప్రజలకు న్యాయం చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ,వరంగల్ జిల్లా

## రైతు సమస్యలను పట్టించుకోండి

వ్యవసాయరంగం భారత ఆర్థికవ్యవస్థకు ఆధారస్తంభంగా నిలుస్తోంది. ప్రధానంగా, 2013భూసేకరణ చట్టంప్రకారం, భూమి ని కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పటికీ పూర్తిస్థాయిలోఅందడం లేదు. అలాగే, నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని పునఃసమీక్షి ంచి, రైతు ఉత్పత్తులకు అనుకూల మైనవిధంగా మార్చాలి. రైతుకు వాస్తవ లాభం చేకూరేలా చేయాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

## రోడ్లపైనే పశువుల మందలు

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలు మండలాలు నగరాలు పట్టణ కేంద్రాల్లో రోడ్లపై స్వేచ్ఛగా ఆవులు గేదెలు, సంచరించడంవల్ల నిత్యం రోడ్డు ప్రమాదములు జరుగుతున్నాయి ముఖ్యంగా హన్మకొండ వరంగల్ పరకాల పట్టణం లో ప్రధాన రహదారిలో గుంపులుగా పశువులు ఉండి ప్రమాదాలకు కారకాలుగా నిలుస్తున్నాయి భూపాలపల్లి జిల్లా కేంద్రం లో కాటారం డివిజన్‌లో వివిధ పట్టణాల్లో రోడ్డు మధ్యనే గుంపులు గుంపులుగా ఆవులు సేద తీరడంతో వాహనదారులు నానా యాతన పడుతున్నారు ప్రతిరోజు ఇవి రోడ్లమీద సంచరించడం వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా మారింది ఇకనైనా అధికారులు స్పందించి ప్రధాన నగరాల్లో రోడ్ల వెంబడి తిరుగుతున్నటువంటి పశువులను పశు శాలకు పంపించి ఆ పశువుల యజమానుల మీద కేసులు పెట్టాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## దేశీయ ఉపాధి మీదే ఆధారపడదాం

భారత ఐటీ రంగంఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నా, హెచ్1బీవీసాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచ వలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈ పరిస్థితుల్లో, స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. స్థానిక నియామకాలను పెంచడం, రిమోట్‌డెలివరీ విధానాలను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం ద్వారా సంస్థలు తమ స్వావలంబనను నిర్ధారించుకోవాలి. అదే సమయంలో స్వదేశీ ప్రతిభనుపెంపొందించడం అత్యంతప్రాధాన్యం కలిగిన అంశం. భారతీయ యువత, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులు, తమ ప్రతిభను ప్రదర్శించి స్థానిక స్థాయిలో స్టార్టప్స్‌ను స్థాపిస్తే, దేశీయఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు, గ్లోబల్ టెక్ రంగంలో మన స్థానం మరింత బలపడుతుంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## వ్యవస్థలు బాగా పని చేయాలి

దేశంలోని ముఖ్యమైన వ్యవస్థలు సక్రమంగా పని చేయాలి. పోలీసు, చట్టాలు, చట్ట సభలు, ఇతర రంగాల ఉద్యోగులు, పౌరులు బాగా పని చేయాలి. వ్యవస్థలను నియంత్రించి అణచివేసేది రాజకీయ శక్తులు కాబట్టి వ్యవస్థలు అప్రమత్తంగా ఉంటే సరిపోతుంది. వ్యవస్థలు ఎవరి వత్తిళ్లకు లొంగకూడదు. ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్క పౌరులు నిజాయితీగా పనిచేయాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వాతావరణ సంక్షోభాన్ని అరికట్టలేమా?

**అభివృద్ధి చెందుతున్న దేశంగా, భారతదేశానికి విద్యుత్, పరిశ్రమల కోసం శక్తిచాలా అవసరం. అందుకే మన మొత్తంకాలుష్యం పెరుగుతోంది. దీనిని తగ్గించడానికి మనం 2030 నాటికి 50 శాతం విద్యుత్తును సోలార్, పవన శక్తి వంటి కాలుష్యం లేని వనరుల నుండి పొందాలని అలాగే 2070 నాటికి పూర్తిగా కాలుష్యం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ఈ ప్రయత్నాలు గొప్పవే. కానీ ప్రపంచ స్థాయిలో కాలుష్యం చాలా వేగంగా పెరుగుతోంది. కాబట్టి ధనిక దేశాలు తమ చారిత్రక తప్పులకు పరిహారంగా, మనకు వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి నిధులు, కొత్త టెక్నాలజీ వెంటనే ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేయాల్సిన సమయం ఇది. ఇకపై భారతదేశం వీటిని ఎదుర్కోడానికి చాలా గట్టిగా చేయాలి. కాలుష్యం లేకుండా వేగంగా కొత్త ఇంధన వనరులకు మారాలి. ప్రజలను కాపాడడానికి కరవును తట్టుకునే విత్తనాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు వంటివి నిర్మించాలి. వాతావరణ మార్పులకు ప్రపంచ వేదికపై పోరాడాలి.**

డి జయరాం

ప్రపంచ వాతావరణ సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం, గాలిలో ఉండే కార్బన్ డయాక్సైడ్ పరిమాణం రికార్డు స్థాయిలో పెరిగింది. ఈ పెరుగుదల భూతాపానికి ప్రధాన కారణాలలో ఒకటిగా మారింది. 2024 సంవత్సరానికి సంబంధించిన ఈ నివేదిక చాలా ఆందోళన కలిగించే విషయాలను వెల్లడించింది. 2023 నుండి 2024 మధ్య ప్రపంచ సగటు కార్బన్ డయాక్సైడ్ స్థాయి 3.5 పీపీఎం పెరిగింది. 1957లో కొలవడం మొదలు పెట్టినప్పటి నుంచి ఒకే ఏడాదిలో ఇంత ఎక్కువ పెరుగుదల నమోదు కావడం ఇదే తొలిసారి. ఈ కారణంగా, 2024లో గాలిలోని కార్బన్ డయాక్సైడ్ వాయువు స్థాయి 423.9 పీపీఎంకు చేరుకుంది. గత 8 లక్షల సంవత్సరాలలో మానవుడు ఇంత స్థాయిని ఎప్పుడూచూడలేదు. అంతేకాకుండా 1960ల నుంచి ఈ కాలుష్యం పెరిగే వేగం దాదాపు మూడు రెట్లు ఎక్కువైంది. గతంలో నెమ్మదిగా పెరిగేది కానీ ఇప్పుడు ఒక్కసారిగా 3.5 పీపీఎంకు పెరగడం మరింత భయాన్ని కలిగిస్తోంది. దీనికితోడు, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి ఇతర వేడిని పెంచే వాయువులు కూడా రికార్డు స్థాయికి చేరాయి. ఈ వాయువులన్నీ కలిసి 1990 నుంచి భూమిపై వేడిని నిల్వ చేసే శక్తిని 54 శాతం పెంచాయి. పెరుగుదలకు కారణాలు -మనిషి తప్పులు, ఈ అతిపెద్ద పెరుగుదలకు ముఖ్యంగా రెండు ప్రమాదకరమైన కారణాలు కలిశాయి. ఒకటి మనం చేసే పనుల వల్ల విడుదలయ్యే కాలుష్యం, రెండు ప్రకృతిలో కాలుష్యాన్ని పీల్చుకునే శక్తి తగ్గడం. ఇది భూమిపై ఉన్న కార్బన్ చక్రంలో ఒక పెద్ద సమస్య ఏర్పడిందని సూచిస్తుంది. మొదటిది బొగ్గు, పెట్రోల్, గ్యాస్ వంటి శిలాజ ఇంధనాలను వాడడం తగ్గిస్తామని ప్రపంచ దేశాలు ప్రమాణాలు చేసినప్పటికీ, వాటిని మండించడం ఆగలేదు. కార్బన్ డయాక్సైడ్ వాయువు పెరుగుదలలో ఎక్కువ భాగం ఇంకా ఈ శిలాజ ఇంధనాల నుంచే వస్తుంది. రెండవది సాధారణంగా సముద్రాలు, అడవులు వంటి ప్రకృతి వ్యవస్థల. వీటిని ఖకార్బన్ సింక్‌లుఖ అంటారు. ప్రతి సంవత్సరం మనం విడుదల చేసే కాలుష్యంలో దాదాపు 50 శాతం వరకు పీల్చుకుంటాయి. అయితే, 2024లో వీటి కాలుష్యాన్ని పీల్చుకునే సామర్థం తగ్గిందని ప్రపంచ వాతావరణ సంస్థ చెబుతోంది. వీటికి తోడుగా తీవ్రమైన వాతావరణ మార్పులు ప్రకృతి వైపరీత్యాలు కూడా ఈ పెరుగుదలకు కారణమవుతున్నాయి. 2024రికార్డు స్థాయి వేడి, ఎల్ నినో ప్రభావం వల్ల అమెజాన్, ఆఫ్రికా వంటి ప్రాంతాల్లో భయంకరమైన కరువులు, పెద్ద అటవీ మంటలు వచ్చాయి. ఈ మంటల ద్వారా అడవుల్లో నిల్వఉన్న భారీ మొత్తంలో కార్బన్ డయాక్సైడ్ వాయువు తిరిగి గాలిలోకి విడుదలవ్వడం ఈ పెరుగుదలను మరింత వేగవంతం చేసింది. ఈ రికార్డు పెరుగుదల చూస్తుంటే, వాతావరణ సంక్షోభం నెమ్మదిగా జరగడం లేదు, ఇది తనకు తానుగా వేగాన్ని పెంచే ప్రమాదకరమైన వలయం లోకి మారుతోందనే హెచ్చరిక ఇస్తుంది. ముఖ్యంగా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే కాలుష్యాన్ని పీల్చుకునే కార్బన్ సింక్‌లు బలహీనపడటం. ఉష్ణోగ్రత పెరిగిన సముద్రాలు తక్కువ కార్బన్ డయాక్సైడ్ వాయువును పీల్చుకుంటాయి. అదే సమయంలో అవి ఆమ్లంగా మారి సముద్రంలోని జీవులకు



ప్రమాదంగా మారుతాయి. భూమిపై కూడా, విపరీతమైన వేడి, కరువుల వల్ల మొక్కలు ఒత్తిడికి గురై కాలుష్యాన్ని తక్కువగా పీల్చుకుంటాయి. ఈ ఒత్తిడి తీవ్రమైతే భారీగా చెట్లు చనిపోతాయి. అరణ్యాలు కాలిపోతాయి. దీనివల్లనిల్వ ఉన్న కార్బన్ తిరిగి గాలిలో కలిసి, ఆ అటవీ ప్రాంతం కాలుష్యాన్ని పీల్చుకోవడం మానేసి, కాలుష్యాన్ని విడుదల చేసే ప్రాంతంగా మారుతుంది. ఈ వలయం మనకు ఏం చెబుతోందంటే, మనం కాలుష్యాన్ని తగ్గించినా లేదాఆపినా, ప్రకృతి కూడా తన శక్తిని కోల్పోయి నిల్వ ఉన్న కార్బన్‌ను విడుదల చేయడం మొదలుపెడితే మొత్తం వాతావరణ వ్యవస్థ మరింత వేగంగా వేడెక్కుతుంది. కార్బన్ డయాక్సైడ్ వాయువు చాలాకాలం వాతావరణంలో ఉండే కాలుష్య వాయువు. ఇది గాలిలో శతాబ్దాల పాటు ఉంటుంది. అందుకే 423.9 పీపీఎం స్థాయి అనేది తాత్కాలికం కాదు. ఇది రాబోయే తరాలకు కూడా అధిక ప్రపంచ ఉష్ణోగ్రతలకు దీర్ఘకాలిక కట్టుబాటును సూచిస్తుంది. ఈ వాయువులు పట్టి ఉంచే వేడి, మనం ఉద్గారాలను వెంటనే తగ్గించినా కూడా, భవిష్యత్తులో కరువులు, వరదలు లాంటి వాతావరణ మార్పులను, తీవ్రమైన విపత్తులను పెంచుతూనే ఉంటుంది. ఈ డేటా ప్రకారం పారిస్ ఒప్పందంలో నిర్ణయించిన 1.5డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పరిమితిని చేరుకోవడం మరింత కష్టమని తెలుస్తోంది. ప్రపంచ వాతావరణ సంస్థ నివేదిక అంతర్జాతీయ విధానాలకు 'రెడ్ అలర్ట్' గా పనిచేస్తుంది. కాలుష్యాన్ని కేవలం 'తగ్గిస్తాం' అనే మాటలు చాలవు. శిలాజ ఇంధనాలను తక్షణమే పూర్తిగా విడిచిపెట్టాల్సిన అవసరాన్ని ఈ నివేదిక స్పష్టం చేస్తుంది. ప్రపంచ లక్ష్యాలను పెంచడంతో పాటు, కాలుష్యాన్ని పీల్చుకునే అడవులు, సముద్రాలను కాపాడడానికి కూడా ప్రయత్నాలు చేయాలి. ఈ రికార్డు స్థాయి బొగ్గుపులుసు వాయువు పెరుగుదల మన భారతదేశానికి చాలా పెద్ద ప్రమాద ఘంటిక. ప్రపంచ దేశాలు కలిసి కాలుష్యాన్ని తగ్గించడంలో విఫలం కావడం వల్ల, వాతావరణం మరింత వేడెక్కి, తీవ్రమైన వాతావరణ మార్పులు మొదలయ్యాయి. ఈ మార్పుల వల్ల మన దేశంలోనే ఎక్కువ నష్టం జరుగుతుంది. ఊహించని వరదలు, భరించలేని ఎండలు, రుతుపవనాలలో మార్పులు వంటివి పెరిగి మన వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. ఇది పేద ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. వాతావరణ న్యాయం కోణంలో చూస్తే ఈ పెరుగుదల మనకు అన్యాయం. మన దేశంలో ఒక్కొక్క మనిషి చేసే కాలుష్యం అంటే తలసరి కాలుష్యం ధనిక దేశాల కంటే చాలా తక్కువ. కానీ పాత కాలం నుండి ఎక్కువ కాలుష్యం చేసిన ధనిక దేశాల తప్పుల వల్ల, ఇప్పుడు ఈ మార్పుల కష్టాన్ని మాత్రం మనమే ఎక్కువ భరించాల్సి వస్తోంది. ఈ పరిస్థితి మన ముందు ఒక పెద్ద సవాలును ఉంచుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశంగా, భారతదేశానికి విద్యుత్, పరిశ్రమల కోసం శక్తిచాలా అవసరం. అందుకే మన మొత్తంకాలుష్యం పెరుగుతోంది. దీనిని తగ్గించడానికి మనం 2030 నాటికి 50 శాతం విద్యుత్తును సోలార్, పవన శక్తి వంటి కాలుష్యం లేని వనరుల నుండి పొందాలని అలాగే 2070 నాటికి పూర్తిగా కాలుష్యం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ఈ ప్రయత్నాలు గొప్పవే. కానీ ప్రపంచ స్థాయిలో కాలుష్యం చాలా వేగంగా పెరుగుతోంది. కాబట్టి ధనిక దేశాలు తమ చారిత్రక తప్పులకు పరిహారంగా, మనకు వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి నిధులు, కొత్త టెక్నాలజీ వెంటనే ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేయాల్సిన సమయం ఇది. ఇకపై భారతదేశం వీటిని ఎదుర్కోడానికి చాలా గట్టిగా చేయాలి. కాలుష్యం లేకుండా వేగంగా కొత్త ఇంధన వనరులకు మారాలి. ప్రజలను కాపాడడానికి కరవును తట్టుకునే విత్తనాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు వంటివి నిర్మించాలి. వాతావరణ మార్పులకు ప్రపంచ వేదికపై పోరాడాలి. ధనిక దేశాలను బాధ్యులను చేయాలి. 'కాలుష్యం ఎవరు ఎక్కువ చేశారో, వారే ఎక్కువ తగ్గించాలి' అనే సిద్ధాంతాన్ని గట్టిగా నిలబెట్టాలి. ఈ రికార్డు కాలుష్యం పెరుగుదల అనేది మనమందరం మారాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ●

# ప్రజా సౌకర్యాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి

ఐ.పి.రావు

కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరం. విమానాలు, స్కూల్ బస్సులు ప్రమాదానికి గురైనప్పుడు, ట్రావెల్స్ బస్సులు అగ్నికీలల్లో ఆహుతి అయినప్పుడు, ప్రమాదాల్లో పలువురి ప్రాణాలు కోల్పోయినప్పుడు మాత్రమే ప్రభుత్వాలు, సంబంధించిన శాఖలు ఆగమేఘాలపై విస్తృత తనిఖీలు నిర్వహించడం, పలు కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారిపోయింది. ఇది ఏమాత్రం శ్రేయోష్కరం కాదు అని గ్రహించాలి. ముఖ్యంగా ప్రైవేటు ట్రావెల్స్ పై నిఘా, తనిఖీలు నామమాత్రంగా జరగడం వల్లనే పలువురు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. అసలు ట్రావెల్స్ బస్సులు అన్ని, సంబంధించిన శాఖ ఆడిటింగ్ చేస్తుందా!? ఎన్ని బస్సులు మంచి కండిషన్‌లో ఉన్నాయి. ఎన్ని బస్సుల్లో ఫస్ట్‌ఎయిడ్ బాక్స్, కిట్, హేమర్, అగ్నిమాపక పరికరాలు, నిపుణులైన డ్రైవర్ తదితర రక్షణ పరికరాలు ఉన్నాయో తనిఖీ జరిగిందా? లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని కేసులు నమోదు చేశారు. ఏమి చర్యలు తీసుకున్నారు? శ్వేత పత్రం విడుదల చేయాలి. నిబంధనలు పాటించని బస్సులు వివరాలు, ఏమి చర్యలు తీసుకున్నారు, ఏ సెక్షన్ కింద కేసులు నమోదు చేశారు, స్టేటస్ వంటి అంశాలు ప్రతీ సంవత్సరం ప్రజలకు తెలిసేవిధంగా ప్రభుత్వం, సంబంధించిన శాఖలు 'డాక్యుమెంట్' రిలీజు చేయాలి. 'పబ్లిక్ డొమైన్'లో పెడితే, ప్రయాణికులు అవగాహన చేసుకొని, మంచి ప్రమాణాలు పాటిస్తున్న బస్సులు ఎక్కి తమ గమ్యాలను సురక్షితంగా చేరుకోవడానికి వీలు కలుగుతుంది. ముఖ్యంగా పండుగ సమయాల్లో, పండుగ రద్దీసమయాల్లో రకరకాల బస్సులు ఆ మాటకు వస్తే కండిషన్ లేని బస్సులను కూడా నామమాత్రంగా మరమ్మతులు చేసి రంగులు పూసి, స్లీపర్, సెమీస్లీపర్, లగ్జరీవంటి పేర్లతో నడుపుతూ, అధికారుల కళ్లు గప్పి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నడుపుతూ ప్రైవేటు యాజమాన్యాలు అధిక మొత్తంలో ఆదాయం సంపాదించడం జరుగుతుంది. దీనికి ప్రధాన కారణం ఎక్కువ శాతం ఈ ప్రైవేటు ట్రావెల్స్ రాజకీయ నాయకులకు, వారి



బంధువులకు, ధనికులు భూస్వాములు సంపన్నులు కార్పొరేట్ వర్గాలకు చెందినవారివే. దీంతో నిబంధనలు బేఖాతరు చేస్తూ సంవత్సరాలు తరబడి నడపడం జరుగుతుంది. అదే సమయంలో ప్రజలు, ప్రయాణికులు తమ తమ అవసరార్థం డబ్బులుచెల్లించి ప్రయాణాలు చేస్తున్న పరిస్థితి ప్రజల్లో కూడా అవగాహన పెరగాలి. సీజన్ బట్టి డబుల్ చార్జీలు వసూలు చేయడం జరుగుతుంది. ప్రభుత్వాలు కూడా ప్రజల అవసరతలు తీర్చాలి కదా? విద్యా, వైద్యం, రవాణా సౌకర్యాలు వంటివి ప్రజలకు నాణ్యమైన రీతిలోఅందించే ఏర్పాటు చేయాలి. దురదృష్టవశాత్తూ మన దేశంలో ఇటువంటి పబ్లిక్ ఫెసిలిటీస్ అన్నియు దాదాపు 70డెభై శాతం ప్రైవేటీకరణ జరిగింది. ఇక దీంతో ప్రైవేటు పాఠశాలలు, ప్రైవేటు ఆసుపత్రులు, ప్రైవేటు ట్రావెల్స్ పేద మధ్యతరగతి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. దీనికి తోడు కనీసం నియంత్రించే వ్యవస్థ, తనిఖీ అధికారులు అవసరాలకు అనుగుణంగా లేకపోవడం జరుగుతుంది. ఏ శాఖలో చూసిన ఖాళీ పోస్టులే, సిబ్బంది కొరత, సౌకర్యాలు కొరత ఉన్న సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఇక ఏ రవాణా శాఖ కార్యాలయంలో చూసిన ప్రైవేటు సిబ్బందిదే హవా. ఆయా కార్యాలయాలకు వద్దకు వెళ్ళితే, ఆ చుట్టుపక్కల ఉండే ప్రైవేటు వ్యక్తులు, కార్యాలయాలు హడావుడి అంతా ఇంతా కాదు. దీనికి ప్రధాన కారణం, అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ సిబ్బంది, కార్యాలయాలు లేకపోవడమే. ఇకనైనా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. అవసరత మేరకు రవాణా కార్యాలయాలు, సిబ్బంది, తనిఖీ అధికారులు, ఫైర్ సేఫ్టీ అథారిటీ, నిఘా సంస్థలు, పోలీసు పెట్రోలింగ్ వాహనాలు సమకూర్చాలి. కనీసం ప్రజల కనీస సౌకర్యాలు అవసరతలు తీర్చే వ్యవస్థలపై దృష్టి సారించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.. ప్రభుత్వ నియమనిబంధనలు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. ప్రమాదాలు బారిన పడకుండా చూసుకోవాలి.. ముఖ్యంగా ప్రభుత్వాలు నియమనిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలి. మరణించిన సమయాల్లో క్షతగాత్రులకు నష్టపరిహారం చెల్లించడంతో చేతులు దులుపుకోరాదు. పోయిన ప్రాణాలను తిరిగి తేలేం. ప్రాణం విలువైనది అనే భావనతో అందరి శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వాలు, యంత్రాంగం పనిచేయాలని ఆశిద్దాం. ●

# ఆవిష్కరణ ఆధారిత పరిశోధనలకు గుర్తింపు

డాక్టర్ రామకృష్ణ బండారు

ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డులలో నోబెల్ బహుమతి మొదటిది. ఈ బహుమతిని స్వీడిష్ శాస్త్రవేత్త 'ఆల్ఫ్రెడ్ నోబెల్' జ్ఞాపకార్థం 1901 నుంచి ప్రతీ సంవత్సరం ఇస్తున్నారు. శాంతి, సాహిత్యం, వైద్యశాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం వంటి ఆరు కేటగిరీల్లో ఈ బహుమతిని అందజేస్తారు. ఈ ఆరు రంగాలలో అత్యుత్తమ కృషి చేసిన వారికి నోబెల్ బహుమతిని అందచేస్తారు. నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న వ్యక్తికి బంగారు మెడల్, డిప్లొమాతో పాటు దాదాపు 11 మిలియన్ స్వీడిష్ క్రోనర్ అంటే భారత కరెన్సీలో సుమారురూ. 8.5 కోట్లు నగదును బహుమతిగా ఇస్తారు. ఈ బహుమతి ప్రదానం రెండు ప్రాంతాలలో జరుగుతుంది. నోబెల్ శాంతి బహుమతి నార్వే రాజధాని ఒస్లోలో ప్రదానం చేస్తారు. మిగిలిన నోబెల్ బహుమతులను స్వీడన్లోని స్టాక్‌మ్‌లో ప్రదానం చేస్తారు. నోబెల్ బహుమతి అవార్డులను ప్రకటించడం కోసం రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కమిటీ ఉంటుంది. వచ్చిన నామినేషన్‌లను పూర్తి స్థాయిలో పరిశీలించి విన్నర్స్‌ను ప్రకటిస్తారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సంవత్సరం జాన్‌క్లార్క్, మైఖేల్ డెవోరెట్, జాన్ ఎం.మార్టినిస్‌లకు భౌతికశాస్త్రంలో, సుసుము కిటాగవా, రిచర్డ్ రాబ్సన్ ఒమర్ ఎం.యాఘీలజూ రసాయన శాస్త్రంలో, మేరీ ఇ.బ్రంకో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమోన్ సకాగుచిలకు వైద్య శాస్త్రంలో, సాహిత్యంలో విశేష కృషి చేసినందుకు హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నా హెర్కైకు, నోబెల్ శాంతి బహుమతికి మరియా కొరినా మచాడోకు, జోయెల్ మోకిర్, ఫిలిప్ అగియోన్, పీటర్ హొవిట్‌లకు ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతులు లభించాయి. ముఖ్యంగా, ఆర్థిక శాస్త్రంలో జోయెల్ మోకిర్, ఫిలిప్ అగియోన్, పీటర్ హొవిట్‌లకు నోబెల్ బహుమతి రావడం గర్వించదగ్గ విషయం. ఇన్నోవేషన్ ఆధారిత ఆర్థిక వృద్ధి సిద్ధాంతాలను వివరించినందుకు ఈ ముగ్గురు ఆర్థికవేత్తలకు 2025 సంవత్సరానికి గాను ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పురస్కారం లభించింది. నూతన ఇన్నోవేషన్స్ 'ఆర్థిక వృద్ధి'నిఎలా ముందుకు తీసుకుపోతాయో అనే అంశం మీద వీరి పరిశోధనలు సాగాయి. జోయెల్ మోర్ అమెరికాఇజ్రాయెలీ ఆర్థికవేత్త. నార్వెస్టర్న్ యూనివర్సిటీలో డచ్‌ఇజ్రాయెలీఅమెరికన్ ఆర్థిక చరిత్రకారుడిగా పనిచేస్తున్నాడు. ప్రతిష్టంభన నుంచి స్వీయ సుస్థిర ఆర్థిక వృద్ధి వైపు సొసైటీ ఎలా పయనించిందో చారిత్రక ఆధారాలను తన పరిశోధనలో తెలియచేసాడు. సాంకేతిక ప్రగతి ద్వారా సుస్థిర అభివృద్ధికి కావాల్సిన అవసరాలను గుర్తించినందుకు మోకిర్‌ని ఈ బహుమతికి ఎంపికచేశారు. ఆయన పరిశోధన పారిశ్రామిక విప్లవం ఎలా ప్రారంభమైంది, అది ఎలా నిరంతర వృద్ధికి దారి తీసిందో వివరించింది. సాంకేతిక ఆవిష్కరణల వెనుక ఉన్న శాస్త్రీయ వివరణలే ఆర్థిక వృద్ధిని దీర్ఘకాలం కొనసాగించడానికి సహాయపడతాయి అని పేర్కొన్నాడు. అలాగే, సమాజం కొత్త ఆలోచనలను, మార్పులను స్వీకరించే సంస్కృతి అవసరమని తన పరిశోధనల ద్వారా తెలియ చేసాడు. ఇన్నోవేషన్ విజయానికి జ్ఞానం సామాజిక అంగీకారం రెండూ కీలకమని నిర్ధారించాడు. అదేవిధంగా, ఫిలిప్ అఫియాన్ ఫ్రాన్స్ దేశానికీ, పీటర్ హెవిట్ కెనడాకు చెందిన ఆర్థికవేత్తలు. ఫిలిప్ అగియోన్ పారిస్లోలోని ఇన్సెడ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్లో ప్రొఫెసర్గా పనిచేస్తున్నాడు. పీటర్ హెవిట్ యునైటెడ్ స్టేట్స్ లోని బ్రౌన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్గా ఉన్నారు. 'క్రియేటివ్ డిస్ట్రక్షన్' ద్వారా నిరంతర ప్రగతి పై వీరు చేసిన పరిశోధనలకుగాను నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు. అఫియోన్, హెవిట్ ఇద్దరూ 1992లో ప్రచురించిన తమ ప్రసిద్ధ వ్యాసంలో 'సృజనాత్మక విధ్వంసం' అనే భావనను గణితపరంగా వివరించారు. ఈసిద్ధాంతం ప్రకారం, కొత్త ఆవిష్కరణల ద్వారా నూతన సాంకేతికత ఉద్భవిస్తుంది. ఫలితంగా కొత్త పరిశ్రమలు, కొత్త ఉత్పత్తులు పుట్టుకొస్తాయి. పాతపద్ధతులను కొత్త ఇన్నోవేషన్స్ భర్తీ చేసే ప్రక్రియద్వారా ఆర్థికవ్యవస్థ ఎప్పటికప్పుడు ముందుకు సాగుతుందని వీరి సిద్ధాంతం చెబుతుంది. ఈ ముగ్గురు ఆర్థికవేత్తలుతమ పరిశోధనలవలన నూతన ఆవిష్కరణలు ప్రపంచ పురోగతికి ఎలాదోహదం చేస్తాయో తెలియచేసారు. మానవచరిత్రలో ఎన్నడూలేనివిధంగా ప్రపంచం వృద్ధివైపు పయనిస్తుంది. తద్వారా కోట్ల మంది పేదరికం నుంచి బయటపడటమే కాకుండా ప్రపంచ సంపద పెరుగుదలకు కారణమైనది. ఈప్రపంచ ప్రగతి కారణమైన ఇన్నోవేషన్స్‌ల పాత్ర ను అర్థమయ్యేలా చెప్పడమే వీరి పరిశోధనల సారాంశం. సాంకేతిక పురోగతి, ఇన్నోవేషన్స్ ద్వారా స్థిరమైన వృద్ధిఎలా ఏర్పడుతుందో శాస్త్రీయంగా వీరు నిరూపించారు. వాస్తవానికి, సాంకేతిక పోరోగతి పారిశ్రామికీకరణకే కాకుండా మానవాళి మనుగడకు కూడా దోహదం చేస్తుంది. అలాంటి సాం కేతిక అభివృద్ధితో కూడుకున్న సమాజాలను ఎలా నిర్మించాలో జోయెల్ మోకిర్ తన పరిశోధనతో తెలియ చేసాడు. అంతేకాదు చారిత్రక ఆధారాలతో సాంకేతిక పురోగతికి నిరంతర వృద్ధికి అవసరమైన పరిస్థితులను వివరించాడు. అంతేకాదు, పారిశ్రామిక విప్లవానికి ముందు తరు వాత పరిస్థితులను తన పరిశోధనలతో వివరించడం ద్వారా ప్రస్తుత తరానికి అలాంటి పరిస్థితులను ఎలా అనుకూలం గా మార్చుకోవాలో తెలిసివస్తుంది. మార్కెట్‌లో కొత్త టెక్నాలజీ వచ్చి నప్పుడు పాత టెక్నాలజీ ఉపయోగిస్తున్న కంపెనీలు ఎలా దెబ్బతింటాయో తెలియచేయడం ద్వారా పారిశ్రామిక వర్గా లకు ఎంతో మేలు చేకూరుతుంది. కొత్త ఇన్నోవేషన్స్‌ను సొసైటీ ముందుకు తీసుకెళితే, పాత పద్ధతులు కనుమరు గవడం వల్ల జరిగే నష్టాన్ని 'క్రియేటివ్ విధ్వంసం'గా తెలి యచేయడం ద్వారా పాత పద్ధతుల ప్రాముఖ్యేతను తెలియచ్చేసారు. ఇన్నోవేషన్స్ వలన ఆర్థికవృద్ధి స్థిరత్వం ఎలా నియంత్రించవచ్చో ఈ ఆర్థికశాస్త్రవేత్తలు నిరూపించారు. ●

## జిల్లా ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన నగరంపాలెం సిఐ



గుంటూరు క్రైమ్, అక్టోబర్ 28, ప్రభాతవార్త: నగరం పాలెం పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందల్ ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ, సీఐ సత్యనారాయణకి శుభాకాంక్షలు తెలుపుతూ, శాంతి భద్రతల పరిరక్షణలో కృషి చేయాలని, ప్రజలకు నిష్పాక్షికంగా మరియు సమర్థవంతంగా, ఉత్తమమైన పోలీస్ సేవలు అందించాలనీ సూచించారు. సీఐ సత్యనారాయణ 2009 బ్యాచ్ ఎస్సైగా పోలీస్ శాఖలో చేరి, గుంటూరు జిల్లాలోని చేబ్రోలు, నల్లపాడు, అరండల్‌పేట, తాడికొండ తదితర పోలీస్ స్టేషన్లలో ఎస్సైగా విధులు నిర్వహించి, సీఐగా ఉద్యోగోన్నతి పొందారు.

# అధైర్యపడొద్దు.. మేమున్నాం ..

**జోరువానలో ప్రజలకు తోడుగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**
**ఉదయం నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటన.. లోతట్టు ప్రాంతాల ప్రజలకు అభయం**
**ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని భరోసా**
**పునరావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం**

గుంటూరు–ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 28: జోరువానలోనూ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మంగళవారం ఉదయాన్నే వార్డుల పర్యటనకు వెళ్లారు. మొథాన్ తుపాను నేపథ్యంలో భయపడాల్సిన పని లేదని, 24/7 మీ వెంటనే ఉంటామని ప్రజలకు అభయం కలిగించారు. బొంగరాల బీడు, గడ్డిపాడు, బసవతారక రామ నగర్, మద్దిరాల కాలనీ, నెహ్రూ నగర్, రామిరెడ్డి తోట, వినోభా నగర్, ఇస్రాయెల్ పేట, జున్నుసైదా నగర్ ప్రాంతాలకు వెళ్లి స్థానిక ప్రజలతో మాట్లాడారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, అత్యవసరమైతే బయటికి రావాలని సూచించారు. కాలువలను పరిశీలించి ఎప్పటికప్పుడు షిల్టు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వరద ప్రభావిత ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. చిన్న పిల్లలను బయటికి పంపించవద్దని సూచించారు. ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చని చెప్పారు. మంచినీరు కాచి తాగాలని, చెట్ల కింద ఉండకూడదని సూచించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. అక్కడ భోజన వసతి వంటి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. విద్యుత్ వ్యవస్థపై అప్రమత్తంగా ఉండాలని, స్తంభాలు, వైర్లను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నట్లు చెప్పారు. ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.





## శానిటేషన్ ప్రత్యేక టీములు ఏర్పాటు చేయండి

**గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ .. కార్పొరేషన్ ఏసీతో కలిసి టెలీ కాన్ఫరెన్స్**

గుంటూరు–ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 28: గుంటూరు తూర్పు నియోజకవర్గంలో శానిటేషన్ పై అప్రమత్తంగా ఉండండి. ఉదయం నుంచి నేను వార్డుల్లో పర్యటిస్తూనే ఉన్నాను. కొన్ని ప్రాంతాల్లో శానిటేషన్ పరిస్థితి సరిగా లేదు. వెంటనే వాటిపై చర్యలు తీసుకోండి. రాత్రికి ప్రత్యేకంగా శానిటేషన్ టీములును ఏర్పాటు చేయండి. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకూడదు అని గుంటూరు మునిసిపల్ ఉద్యోగులకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. మంగళవారం సాయంత్రం గుంటూరు కార్పొరేషన్ లో అదనపు కమిషనర్ ఏబులేశుతో కలిసి ఎమ్మెల్యే నసీర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికార యంత్రాంగంతో మాట్లాడారు. ఉదయం నుంచి పర్యటించిన ప్రాంతాల్లో శానిటేషన్ సమస్యల గురించి అధికారులకు వివరించారు. ఆయా ప్రాంతాల్లో మురుగు పారుదల, వర్షపు నీరు నిల్వ లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై సూచనలిచ్చారు. బొంగరాలబీడు, సాంబయ్య కాలనీ, బాలాజీ నగర్ వంటి ప్రాంతాల్లో వర్షాల కారణంగా నీరు ముందుకు కదలడం లేదని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో క్రేన్లు, ఇతర యంత్ర పరికరాలను ఉపయోగించుకోవాలన్నారు. పునవారాస కేంద్రాల్లో ప్రజలకు ప్రతి నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. భోజన వసతి వంటి సదుపాయాల విషయంలో రాజీపడొద్దని స్పష్టం చేశారు.




## దూరవిద్య ఎంఎస్సీ కోర్సుల ఫలితాలు వెల్లడి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, అక్టోబరు28, ప్రభాతవార్త: ఏఎన్‌యు దూరవిద్యా కేంద్రం జూలై/ఆగస్ట్ నెలల్లో నిర్వహించిన ఎంఎస్సీ కోర్సుల ఫలితాలను దూరవిద్య డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు మంగళవారం విడుదల చేశారు. ఎంఎస్సీలో కంప్యూటర్ సైన్స్, సైకాలజీ, మాథమాటిక్స్, కెమిస్ట్రీ, ఎంసిఏ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పరీక్షల అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.కోదండపాణి మాట్లాడుతూ రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకునేవారు ఒక్కో పేపర్‌కు రూ.960లను నవంబరు 11వ తేదీలోగా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫలితాలను వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని సూచించారు. ఈ సందర్భంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.కృష్ణవేణి, సూపరింటెండెంట్ టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


## జాతీయ మెడికల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు

గుంటూరు విద్య, అక్టోబర్ 28, ప్రభాతవార్త : జాతీయ మెడికల్ ఆర్గనైజేషన్ వారి సౌజన్యంతో ఎన్నారై మెడికల్ కాలేజి, కాటూరి మెడికల్ కాలేజ్ విద్యార్థిని, విద్యార్థులతో ఉచిత మెడికల్ క్యాంపు సెయింట్ లారెన్స్ ఇంగ్లీషు మీడియంలో జరిగింది. వైద్య శిబిరాన్ని డాక్టర్ శనక్కాయల రాధామాధవి ప్రారంభించారు. ఆర్టీసీకాలనీ తదితర ప్రాంతవాసులు, సెయింట్ లారెన్స్ విద్యాసంస్థ విద్యార్థులు వారి తల్లిదండ్రులు మెడికల్ క్యాంపులో జనరల్ చెకప్ చేయించుకున్నారు. క్యాంపులో ప్రతి విద్యార్థికి బిపి, వివిధ రక్తపరీక్షలు ఉచితంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ముఖ్యంగా జ్వరాలు, ఆకలి లేకపోవడం, రక్తహీనత, తలనొప్పి సమస్యలు వైద్యులు గుర్తించి వారికి తగిన సలహాలు, సూచనలతోపాటు మందులు కూడా ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ శనక్కాయల రాధామాధవి, స్కూల్ కరస్పాండెంట్ మేకల రవీంద్ర బాబు, డైరెక్టర్ సాయి శ్రీకర్, స్కూల్ ప్రిన్సిపాల్ హెచ్‌ఎంలు కళ్యాణి, కె.మీనాక్షి, ఉపాధ్యాయులు ఎం.లక్ష్మి భారతి, జి.శ్రీదేవి, ప్రధానోపాధ్యాయిని ఏ.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఎన్నారై కాటూరి మెడికల్ కాలేజ్, ఎంబిబిఎస్ స్టూడెంట్స్, డాక్టర్ వంశీప్రియ, గుంటూరు మెడికల్ కాలేజ్ మరియు కీర్తి, అభిషేక్, చిటి శ్రీ, దేదివ్య, మంజరి, హాసినిశ్రీ, అక్షయ సుమారుగా 175నుంచి 200మంది విద్యార్థులు పాల్గొన్నారు. తల్లిదండ్రులతో కలసి 225మంది పాల్గొని వైద్య సలహాలు, సూచనలు తీసుకున్నారు. షేక్ బాజీ హుల్సేన్, వాసంతి, ప్రత్యూష శ్రీనివాస్ అనిత మురళీ ప్రియాంక మాధవరావు పాల్గొన్నారు.



## టెట్ పై సుప్రీంకోర్టు తీర్పుపై ఏపి ప్రభుత్వం త్వరలోనే రిట్ పిటిషన్

గుంటూరు విద్య, అక్టోబర్ 28, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు బి.రాంభూపాల్‌రెడ్డి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణలతో కలసి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు రాష్ట్ర విద్యశాఖ మంత్రి నారా లోకేష్ ని కలసి వివిధ ఉపాధ్యాయ సమస్యలపై ప్రాతినిధ్యం చేయడం జరిగింది. 2011కు ముందు సర్వీసులో జాయిన్ అయిన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పుపై వెంటనే ఏపి ప్రభుత్వం రిట్ పిటిషన్ వేయాలని, ఎంఈవో 1 ఎమ్ఈవో 2 బదిలీలు చేపట్టాలని, మున్సిపల్ మరియు మున్సిపల్ కార్పొరేషన్ ఉపాధ్యాయులకు వెంటనే జీపిఎఫ్ అకౌంట్లు ఏర్పాటు చేయాలని డిఎస్సీ 2003ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విదానాన్ని పునరుద్ధరించాలని, డిఎస్సీ 2025ద్వారా ఈ మధ్యకాలంలో ఏలూరు, విశాఖపట్నం, కడప జిల్లాలో బాల నేరస్థుల పాఠశాల్లో జాయిన్ ఐన నూతన ఉపాధ్యాయులకు బేసిక్ పే 32670స్కేలు కాకుండా బెసిక్ పే 28280 స్కేలు ఇవ్వడాన్ని సవరించాలని, డైట్ కాలేజీలో ని పదోన్నతుల ద్వారా భర్తి చేయాలని ప్రాతినిధ్యం చేయడం జరిగింది. దీనికి స్పందించిన విద్యాశాఖ మంత్రి టెట్ సమస్యపై లోతుగా చర్చించి వెంటనే సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్ వేయాలని నిర్ణయించడం జరిగింది. అలాగే రాష్ట్రంలోనీ ప్రధానోపాధ్యాయులకు త్వరలో రాష్ట్రస్థాయిలో విద్యా సదస్సు నిర్వహించాలని తెలిపారు.



# గుంటూరు వార్త



## మొంథా తుఫాన్ దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

**వార్డెన్లు, 24 గంటలు హాస్టళ్లలో ఉండాల్సిందే**
**విద్యార్థులకు కాచి చల్లార్చిన నీరు, తాజా ఆహారం మాత్రమే ఇవ్వాలి**
**హాస్టళ్ల విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి**
**విద్యార్థుల్లో అనారోగ్య లక్షణాలుంటే తక్షణమే వైద్యసాయం: మంత్రి సవిత**

రాజుపాలెం, ముప్పాళ్ల, అక్టోబర్ 28, ప్రభాతవార్త: సత్తెనపల్లి నియోజకవర్గంలోని రాజుపాలెం కేంద్రంగా బిసి బాలుర వసతి గృహం, మహాత్మ జ్యోతిబా పూలే బీసీ బాలికల వసతి గృహాలకు శాశ్వత భవన నిర్మాణాలకు కృషి చేస్తానని బీసీ వెల్ఫేర్ మంత్రి సవిత చెప్పారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలో శిథిలావస్థకు గురైన బీసీ బాలుర వసతి గృహాన్ని ఆమె పరిశీలించారు ఈ సందర్భంగా మంత్రి సవిత వసతి గృహంలోని గదులు లోపలికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు.



అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ వసతి గృహంలో ఎంతమంది పిల్లలు ఉన్నారని అధికారులను అడిగారు 120 మంది పిల్లలు ఉన్నారని సమాధానం చెప్పడంతో ఎక్కువ మందే ఉన్నారు, వారందరిని సురక్షిత భవనంలోకి తరలించాలని ఆదేశించారు. సురక్షిత భవనమును తీసుకొని పిల్లలందరినీ అందులోకి తరలించాలని చెప్పారు. సంబంధిత శాఖ అధికారి ఈ భవన మరమ్మత్తుల నిమిత్తం రూ 4 లక్షలు పైన నిధులు మంజూరయ్యా అని చెప్పగా ఈ వసతి గృహానికి రూపాయి



ఖర్చుపెట్టిన వేస్ట్ అని అన్నారు వెంటనే భవనమును అద్దెకు తీసుకొని పిల్లలను అందులోకి మార్చాలని చెప్పారు నూతన భవన నిర్మాణానికి ఇక్కడ ఎంత స్థలం ఉందని వివరాలను అడిగి తెలుసుకున్నారు ఈ భవనం నిర్మాణం తో పాటు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సమీపంలో



కేటాయించిన స్థలంలో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల వసతి గృహాన్ని కూడా నిర్మించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**చదువుపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి....**

చదువుపైకూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలో శిథిలవస్థలో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని మంత్రి సవిత గారు, స్థానిక శాసన సభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ తో కలిసి ఆయన పరిశీలించారు అనంతరం ఆయన మాట్లాడుతూ మనిషికి ఆహారం తర్వాత చదువు ఎంతో అవసరమని చెప్పారు. శాసన సభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ గారు కోరిన విధంగా బీసీ బాలుర వసతి గృహం మహాత్మ జ్యోతిబా పూలే బాలికల వసతి గృహ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

**వసతి గృహాన్ని పరిశీలించడానికి రావడం అభినందనీయం: ఎమ్మెల్యే కన్నా**

ప్రస్తుతం నెలకొన్న వాతావరణ దృష్ట్యా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బిసి వసతి గృహాల్లో పరిస్థితి ఎలా ఉందో చూడమని మంత్రి సవితకి చెప్పడంతోనే ఆమె స్వయంగా వచ్చి రాజుపాలెం లో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించటం అభినందనీయమన్నారు. బీసీ బాలుర వసతి గృహంతో పాటు మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల వసతి గృహ నిర్మించేందుకు హామీ ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## లోతట్టు ప్రాంత వాసులను పునరావాస కేంద్రాలకు తరలింపు

గుంటూరు నగరపాలక సంస్థ, అక్టోబర్ 28, ప్రభాతవార్త : మొంథా తుఫాన్ ప్రభావం వలననగర ప్రజలు ఇబ్బంది పడకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తెస్తే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. మంగళవారం కమీషనర్ తో కలసి బొంగరాలబీడులోని వెంగమాంబ సత్రం, మిర్చియార్డు రైతు విశ్రాంతి భవనంలో నగరపాలక సంస్థ ఏరాపటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించి, వసతుల ఏర్పాట్లపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. మేయర్ మాట్లాడుతూ



తుఫాన్‌ను ఎదుర్కోవడానికి జిఎంసి ఆధ్వర్యంలో విస్తృత చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యమంత్రి పిలుపు మేరకు ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో కూటమి నాయకులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కమీషనర్ మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో జిఎంసి పరిధిలో 74పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటిలో ప్రస్తుతం 1700మంది ఉన్నారని మంగళవారం రాత్రికి సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తమ సమీప కేంద్రాలకు వెళ్ళాలని కోరారు. జిఎంసీ పరిధిలోని 3నియోజకవర్గాలకు ప్రత్యేక అధికారులను నియమించామని, మేజర్ డ్రైన్లలో పూడికతీత పనులు చేపట్టామన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తుఫాన్ రక్షణచర్యలో ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో కృషిచేస్తుందన్నారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీనివాస్, నోడల్ అధికారులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

గుంటూరు–క్రైమ్, అక్టోబర్ 28, ప్రభాతవార్త : మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించిన గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ .// గౌరవ ఎస్పీ పునరావాస కేంద్రాలను సందర్శించి ప్రజలకు అందుతున్న వసతులపై ఆరాతీసి, అవసరమైన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు






సూచించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, పొన్నూరు రూరల్ , పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాగులు, రహదారులు మరియు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశించారు. ప్రత్తిపాడు గ్రామంలోని తీజుళి శ్రీ ఉన్నత పాఠశాల, పెదనందిపాడు గ్రామంలోని శీది బాయ్స్ హాస్టల్, కాకుమాను మండలం






గరికపాడు గ్రామంలోని కమ్యూనిటీ హాల్, పొన్నూరు రూరల్ మండలం వల్లభరావు పాలెం గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి ప్రజలతో మాట్లాడి, సమస్యలు ఉంటే వెంటనే స్థానిక అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అక్కడ పిల్లలకు, ప్రజలకు స్వయంగా భోజనం వడ్డించి, పండ్లు, బ్రెడ్‌లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

## పునరావాస కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే మాధవి

గుంటూరు వెస్ట్, అక్టోబర్ 28, ప్రభాతవార్త : మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా పశ్చిమ నియోజకవర్గంలోని పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే సందర్శించారు. మిర్చియార్డు, స్థంభాల గరువు పుల్లయ్య మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. అక్కడి ప్రజలను పరామర్శించి, వారికి అందిస్తున్న ఆహారం, వైద్య సదుపాయాలు, శానిటేషన్ పద్ధతులు త్రాగునీటి వసతులు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో దాదాపు 23పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దాదాపు



మిర్చియార్డు, పుల్లయ్య స్కూల్, చిన్మయ స్కూల్ కేంద్రాలు పూర్తిగా నిండిపోయాయి. ఒక్క పుల్లయ్య హైస్కూల్లోనే దాదాపు 180మంది ఉండగా, రాత్రి నుంచే అధికారులు వారికి ఆహారం, టిఫిన్, నీరు వంటి అవసరమైన సదుపాయాలను అందించారు. ప్రధానంగా 36వ డివిజన్ రైలు కట్ట ప్రాంత నివాసితులు పెద్దసంఖ్యలో ఈ పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారని, ప్రజలందరికి అవసరమైన సహాయ సహకారాలు అందించడానికిసచివాలయ సిబ్బంది, పార్టీ కేడర్, అధికారులందరూ అందుబాటులో ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వర్షాలు ఉన్నంతవరకు ప్రజలు నీటిని కాచుకొని వడపోసి తాగాలని ఎమ్మెల్యే సూచించారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్ కళ్యాణ్, రాష్ట్రమంత్రి లోకేష్‌లు స్వయంగా తుఫాన్ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని, ప్రభుత్వం, అధికారులు, ఎన్డీఏ కూటమి నేతలు ప్రజల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్నారన్నారు. పశ్చిమ నియోజకవర్గ ప్రజలు ధైర్యంగా ఉండాలని, ప్రతి ఒక్కరి భద్రతే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యం అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి భరోసా ఇచ్చారు.

## విపత్కర పరిస్థితుల్లో కమాండ్ కంట్రోల్‌రూమ్ సిబ్బంది పనితీరు కీలకం

గుంటూరు నగరపాలక సంస్థ, అక్టోబర్ 28, ప్రభాతవార్త : తుఫాన్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అధికారులకు సమన్వయం చేయడంలో కమాండ్ కంట్రోల్ రూమ్ లు ఎంతోకీలక పాత్ర పోషిస్తాయని, కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది షిఫ్టుల వారీగా ఓర్పుతో ప్రజల నుండి అందే




ఫిర్యాదులను స్వీకరించాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమీషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. జిఎంసి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కమాండ్ కంట్రోల్ రూమ్‌కి అందే ఫిర్యాదులను క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదు తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. తుఫాన్ కారణంగా అధికవర్షాలు కురిసే అవకాశం ఉందని, వర్షాల వల్ల ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే నగర పాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్లకు 0863-2345103, 98499 08391 ఫోన్ చేయాలన్నారు. సదరు కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఇన్‌చార్జ్ ఎస్.ఈ.సుందరరామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాషా, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా భావించడం హేయం రాజ్యాంగ విరుద్ధం

గుంటూరు కల్చరల్, అక్టోబర్ 28, ప్రభాతవార్త : తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా ఎలాంటి అమానుష నేరాలుచోటు చేసుకున్నా వాటి మూలాలు మద్యం మహమ్మారి స్వైర విహారంలోనే ఉంటున్నాయని మధ్యాన్ని ప్రధాన ఆధాయవనరుగా భావించి జనం జేబులను ఖాళీ చేస్తున్న ప్రభుత్వాలే ఈ నేరాలు, దారుణాలకు బాధ్యత వహించాలని అవగాహన సంస్థ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వక్తలు విమర్శించారు. అవగాహన సంస్థ కార్యాలయంలో మద్యపానం నిషేదం సాధ్యమేనా అన్న అంశంపై చర్చ జరిగింది. చర్చలో మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ తాగిన మత్తులో ఒళ్ళు తెలియకుండా ప్రవర్తిస్తున్న వారి వీరంగాలు ఎన్నో కుటుంబాలను కష్టాల కాష్టంలోనికి నెట్టేస్తున్నాయన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ మద్యం కోసం డబ్బెక్కువగా ఖర్చు పెడుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ, ఏపి మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చేదాంటోల సగానికిపైగా మద్యంకే ఖర్చు పెడుతున్నారని మద్యనిషేదం కోసం ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఈ.సుబ్బారావు, హరి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ నేపథ్యంలో పట్టణంలో ముందస్తు జాగ్రత్తలు

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 28 (ప్రభాతవార్త): మొంథా తుఫాన్ తీవ్రత క్రమంగా పెరుగుతుడడంతో, పట్టణంలో ఈదురు గాలులు మొదలయ్యాయి.దీంతో మున్సిపల్ అధికారులు అప్రమత్తమయి,ఈదురు గాలులకు చెట్లకొమ్మలు విరిగిపడకుండా,ముందస్తు జాగ్రత్తచర్యలు చేపట్టారు. రోడ్డు మీదకు వచ్చి కరెంటు తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించారు. ప్రధానంగా సుల్తానాబాద్ మార్కెట్.యార్డ్ వద్ద,ఉదయం నుండి ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే



కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ భారీగా వీచే ఈదురు గాలులకు పలుచోట్ల విద్యుత్ లో అంతరాయం ఏర్పడవచ్చు అని విద్యుత్ స్తంభాల వద్ద ఎవరు ఉండవద్దని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు వర్షం తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున అవసరమైతే తప్ప బయటికి రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## లోతట్టు ప్రాంతాలు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 28 (ప్రభాతవార్త): పురపాలక సంఘ పరిధి లోని 11,23,24,వ వార్డుల్లో పర్యటించి ప్రజలకు మొంధా తుఫాను తీవ్రత ఎక్కువగా ఉందనిప్రజల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రజలు ఇబ్బంది కలుగకుండా ఉండేటట్టు పునరావాస కేంద్రాలలో కరెంట్,వాటర్ సప్లై, ఫుడ్ అన్ని సమకూర్చాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీచేసిన మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి తాడిబోయిన రాధిక.ఈ కార్యక్రమంలో11వ



వార్డు వైసిపి నాయకుడు,కఠారి వెంకటేశ్వరరావు (హరీష్),24వ వార్డు కౌన్సిలర్ పెదలంక లక్ష్మీ త్రి లావణ్య,మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు,మున్సిపల్ ఇంజనీర్ పి శ్రీకాంత్, అసిస్టెంట్ సిటీ ప్లానర్స్ శ్రీమన్నారాయణ, వాణి, డిప్యూటీ ఇంజనీర్స్,అసిస్టెంట్ ఇంజనీర్స్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలభద్రతకే ప్రాధాన్యం: మున్సిపల్ కమీషనర్

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 28 (ప్రభాతవార్త): భారీవర్షాల నేపథ్యంలో పట్టణ ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తామని మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొంథా తుఫాన్ వేగంగా తీరం వైపు దూసుకొస్తోందని, దాని ప్రభావంతో పట్టణ పరిధిలో



బలమైన గాలులు వీస్తున్నాయని,అందువల్ల పట్టణ ప్రజలందరూ తమ ఇళ్లలోనే సురక్షితంగా ఉండి, అవసరమైతే తప్ప బయటకు రావొద్దని కమిషనర్ సూచించారు.ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ కోసం మున్సిపల్ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని,ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే మీ వార్డు సచివాలయం లేదా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.ఎటువంటి అత్యవసర పరిస్థితి వచ్చిన వెంటనే 9849981611 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలు అందరికీ తెలియచేయవలసినదిగా అందరూ సిబ్బందికి ఆదేశించడమైనదన్నారు.

## అమ్మవారి నగలకే ఎసరుపెట్టిన పూజారి అరెస్ట్

తెనాలి టౌన్ అక్టోబర్ 28 (ప్రభాతవార్త): ప్రతిరోజూ తనచే నిత్యపూజలు అందుకునే అమ్మవారి నగలకే ఎసరుపెట్టి, వాటిని మాయంచేసిన పూజారిని అరెస్ట్ చేసినవైనం. పోలీసుల కథనం ప్రకారం,కొల్లిపర మండల పరిధిలోని హనుమాన్ పాలెం గ్రామంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ కాశి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో సుమారు 2 1/2 సం.ల నుండి పన్నాల దుర్గ జయరాం !! జయరాం శర్మ, పూజారిగా పనిచేస్తున్నాడని, కొంత కాలం నుండి అతను గుడికి రాకుండా ఉండటం వలన ఆ ఊరి పెద్దలు కార్తీక మాసం నేపథ్యంలో అమ్మవారి ఆలయాన్ని శుభ్రపరచి, అలంకరించుదామనే ఉద్దేశంతో ఆలయాన్ని తెరిచి చూడగా అమ్మవారి ఒంటిపై ఉన్న బంగారు నగల స్థానంలో నకిలీ నగలు అలంకరించబడి ఉండటంతో అనుమానం వచ్చి పూజారికి ఫోన్ చేయగా అతను అందుబాటులోకి రాకపోవడంతో అనుమానం వచ్చి కొల్లిపర పోలీస్ వారికి ఫిర్యాదు చేయగా, వారు క్రైమ్ నెంబర్ 130/2025 యు/ఎస్ 306,316(2) బీఎన్ఎస్ గా కేసు నమోదు చేసి,జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు తెనాలి డిఎస్పీ జనార్ధన్ పర్యవేక్షణలో తెనాలి రూరల్ సీఐ ఉమేష్ ఆధ్వర్యంలో



కొల్లిపర ఎస్సై కోటేశ్వరరావు,తమ సిబ్బందితో దర్యాప్తు చేపట్టగా,అమ్మవారి గుడి పూజారి అయిన పన్నాల. దుర్గ జయరాం !! జయరాం శర్మ విలాసవంతంగా జీవితం గడపాలనే కోరికతో ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశ్యముతో సుమారు 10 నెలలు క్రితం నుండి అమ్మవారికి అలంకరించబడిన బంగారపు ఆభరణాలు బంగారు వడ్డాణం,బంగారపు రాళ్ల గాజులు రెండు,బంగారపు రాళ్లపోగులు రెండు,బంగారపు అరవంకిఒకటి,బంగారు నల్లపూసల గొలుసు ఒకటి,బంగారపు తాడుఒకటి,బంగారపు సూత్రాలు పెద్దవిరెండు,చిన్నవిరెండు,బంగారపు గొలుసుతో ఉన్న బంగారపు పాపిట బిళ్ళఒకటి,బంగారపు కాసులపేరుఒకటి,బంగారపు మ్యాటీలుఒక జత,బంగారపు బొట్టు బిళ్ళఒకటి,బంగారపు ముక్కెరఒకటి,మొత్తం 190 గ్రాముల బంగార ఆభరణాలు, షుమారు రూ.20,00,000/ లు విలువైనవిగా తేలిందని, బంగారు ఆభరణాలను ఒక్కొక్కటిగా తీసుకొనివెళ్ళి వాటి స్థానంలో నకిలీ బంగారపు వస్తువులు తయారు చేయించి, గ్రామస్తులకి అనుమానం రాకుండా వాటిని అమ్మవారికి అలంకరిస్తూ పైన తెలిపిన అసలు బంగారపు ఆభరణాలను దొంగతనంగా తీసుకెళ్లి అమ్ముకోవడం చేసాడని,నిందితుని కోసం ముమ్మర గాలింపు చేపట్టి, సాంకేతిక పరిజ్ఞానం మరియు పోలీస్ వారికి రాబడిన విశ్వసనీయ సమాచారం మేరకు ఫిర్యాదు అందిన వారం రోజుల్లోపే పట్టుకుని నిందితుని వద్ద నుండి అసలైన బంగారపు ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేయడం జరిగినదని,నిందితుడుని జుడీష్యల్ రిమాండ్ నిమిత్తం గాను తెనాలి 2 వ మెజిస్ట్రేట్ గారి ముందు హాజరు పరచనున్నట్టు,సిఐ ఉపేంద్ర తెలిపారు.అమ్మవారి నగలు రికవరీ చేసి,నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన తెనాలి డిఎస్పీ బి.జనార్ధన్ రావు,తెనాలి రూరల్ సిఐ ఆర్.ఉమేష్,కొల్లిపర ఎస్ఐ పి.కోటేశ్వరరావు,సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ రామ కోటేశ్వరరావు,కానిస్టేబుల్ శివ రామక్రిష్ణను, జిల్లా ఎస్పి అభినందించి రివార్డ్ లు ప్రకటించారు.

## రైతుబజార్లలో ఆకస్మిక తనిఖీలు చేసిన తహసీల్దార్:

తెనాలి టౌన్ అక్టోబర్ 28 (ప్రభాతవార్త): తుఫాన్ నేపథ్యంలో పట్టణంలోని రైతు బజార్లలో అధికధరలకు కూరగాయలు విక్రయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై తహసిల్దార్ కెవి గోపాలకృష్ణ ఆకస్మికతనిఖీలు నిర్వహించారు.తహసీల్దార్ స్వయంగా రంగంలోకి దిగి,పలురైతుబజార్లను, సరుకుల షాపులను, ఆకస్మికంగా సందర్శించారు.మాస్క్ పెట్టుకుని సాధారణ పౌరుడిలా రైతు బజార్లకు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేశారు. అక్కడి పరిస్థితులు బోర్డుపై సూచించిన ధరల మధ్య వ్యత్యాసాన్ని గమనించిన ఆయన రైతుబజార్ అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.వినియోగదారులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు.కొన్నిచోట్ల లోపాలు గుర్తించి వ్యాపారులకు హెచ్చరికలు చేశారు.తుఫాన్ నేపథ్యంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేయటం సరైన పద్ధతి కాదన్నారు. తుఫాన్ సాకుతో నిత్యవసర సరుకులు,కూరగాయలు అధిక ధరలకు అమ్మి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.

## బిసి వెల్ఫేర్ వసతి గృహాలను పరిశీలించిన మంత్రి, ఎం.పి, ఎమ్మెల్యే

రాజుపాలెం, అక్టోబర్ 28 ప్రభాతవార్త : రాజుపాలెం మండల కేంద్రంలోని బిసి బాలుర వసతి గృహం, మహాత్మ జ్యోతిరావుపూలే బిసి బాలికల వసతి గృహాలను మంగళవారం మంత్రి సవిత, పార్లమెంట్‌సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు వసతి గృహంలోని గదులను, వంటశాలలను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు



అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించడంతో పాటు విద్యార్థులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వసతి గృహంలో ఎంతమంది పిల్లలు ఉన్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాలకు శాశ్వత భవనాల నిర్మాణాలకు కృషి చేస్తానని బిసి వెల్ఫేర్ మంత్రి సవిత తెలియజేశారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ప్రస్తుతం ఉంటున్న వసతి గృహం నుండి అద్దె భవనంలోకి మార్చాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి వారు భోజనం చేశారు. ప్రస్తుత తుఫాన్ ప్రభావం అధికంగా ఉన్నందున విద్యార్థులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 75 తాళ్ళూరు పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఓ అరుణ్‌కుమార్

పెదకూరపాడు, అక్టోబర్ 28 ప్రభాతవార్త : మండలంలోని 75 తాళ్ళూరు పిహెచ్‌సి సెంటర్‌ను మంగళవారం డిఎంహెచ్ఓ డాక్టర్ హనుమకుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ వలన ఎలాంటి ఇబ్బందులు ప్రజలకు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా వైద్యశాల సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. తప్పకుండా హెడ్‌క్వార్టర్‌లో ఉండాలని డాక్టర్ ఆదిత్యను ఆదేశించారు. పిహెచ్‌సిలో వ్యాక్సిన్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వారి వెంట ఫార్మసిస్ట్ ధనలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాలను పరిశీలించిన తహశీల్దార్, సి.ఐ.లు

అమరావతి, అక్టోబర్ 28 ప్రభాతవార్త : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను అమరావతి తహశీల్దార్ డానియేల్, సి.ఐ.అచ్చయ్యలు మంగళవారం పరిశీలించారు. సౌకర్యాలు, ఏర్పాటు చేసిన వసతులను గమనించారు. తుఫాన్ ప్రభావం దృష్ట్యా లోతట్టు ప్రాంతంలో ఉన్నవారిని పునరావాస కేంద్రాలకు తరలించామని తహశీల్దార్ డానియేల్ అన్నారు. మౌలిక సదుపాయాలు వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్న తహశీల్దార్‌కు తెలియజేయాలన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణ కమిటీలు పటిష్టం చేయాలి

అమరావతి, అక్టోబర్ 28 ప్రభాతవార్త : గుడ్‌షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గిడుగు గ్రామ సచివాలయంలో బాలలహక్కుల పరిరక్షణ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సంస్థ సిబ్బంది త్రివేణి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి రీసోర్స్‌పర్సన్‌గా తండు లక్ష్మణ్ విచ్చేసి మాట్లాడుతూ మానవ హక్కులే బాలల హక్కులు అంటే పెద్దవాళ్ళకు ఉండే హక్కులన్నీ బాలలకు కూడా రాజ్యాంగబద్ధంగా వరిస్తాయన్నారు. అలాగే బాలలకు ప్రత్యేకంగా ఐక్యరాజ్యసమితి 1989లో బాలల హక్కుల వడంబడిక ద్వారా ప్రపంచంలోని బాలలందరికీ హక్కులందించారు. భారతదేశం కూడా వాటిని 1992లో ఆమోదించి ఒడంబడిక మీద సంతకం చేసి, మన బాలలకు కూడా హక్కులు వర్తించేలా చేశారు. గుడ్‌షెఫర్డ్ సంస్థ కోఆర్డినేటర్ సిస్టర్ యాంటో మాట్లాడుతూ పిల్లలు మన జాతి సంపద అన్నారు. వాళ్ళను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సమావేశం అనంతరం బాలల హక్కుల వాల్ పోస్టర్స్‌ను బాలల హక్కుల కమిటీ సభ్యులు విడుదల చేశారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండండి : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, అక్టోబర్ 28 ప్రభాతవార్త : మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాన్ పరిస్థితులను సమీక్షించేందుకు ఎమ్మెల్యే ప్రవీణ్ తన కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని



నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అధికారులు, నాయకులు, ప్రజల మధ్య వారధిగా వ్యవహరించి సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సంబంధిత హెల్ప్‌లైన్ నెంబర్లను అమరావతి 9505857419, 9949098618, 9959714218, 8500513410, 9652344366 ను సంప్రదించాలన్నారు.

## మొంథా తుపాను ప్రభావంపై కాకుమాను మండలంలో ఎమ్మెల్యే పర్యటన

కాకుమాను అక్టోబర్ 28 (ప్రభాత వార్త): మండలంలో స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మంగళవారం పర్యటన చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారూ.వరి, పత్తి పైరులు పై అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే .పునరావాస కేంద్రాలను కూడా సందర్శించారు. మంగళవారం సాయంత్రం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం వుంది కావున అధికారులు అప్రమత్తంగా ఉండి గ్రామాల పరిస్థితి పై సమన్వయం చేసుకోవాలి అన్నారు.నల్లమడ వాగు పరిస్థితి పై అధికారులతో ఆరా తీసారు.యూరియా అవసరం ఉన్న ప్రాంతంలో అందిస్తాం అన్నారు. 2 వేల టన్నులు ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారులకు సూచన చేశారు.నల్లమడ వాగు , కొమ్మమూరు కాల్వ కలిసే ప్రాంతంలో ఇసుక మేటలు వేశాయి. కాబట్టి వాగు వద్ద పూడిక పనులు వెంటనే చేయాలని ఆదేశించిన ఎమ్మెల్యే రామాంజనేయులు .వెంటనే పనులు చేయకపోతే వరద ముంపు తో పొలాలు మునిగే ప్రమాదం వుంది అని హెచ్చరించారు. అత్యవసర విభాగంలో పనులు చేయాలి. అనంతరం కాకుమాను ఎస్సీ హాస్టల్ లో ఉన్న ఎస్టీ కాలనీ వాసులకు ఎమ్మెల్యే దగ్గర ఉండి భోజనం వడ్డించారు,మరియు వాళ్ళకి కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించి కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

## ముంపు ప్రాంతాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

పెదనందిపాడు అక్టోబర్ 28 (ప్రభాతవార్త)పెదనందిపాడు మండలంలో మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం పరిశీలించారు. నల్లమడ వాగు ఉధృతిని పరిశీలించారు. పెదనందిపాడు ఎస్సీ హాస్టల్లో ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస కేంద్రాన్ని పరిశీలించి అక్కడ ఉన్నవారికి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రంలో ఉన్నవారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. వారి వెంట ప్రత్తిపాడు సిఐ జి శ్రీనివాసరావు, పెదనందిపాడు ఎస్ఐ ఏ మధు పవన్ ఉన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ ప్రసూనాంబ.తహశీల్దార్ ఎస్ హేనా ప్రియ, ఎంపీడీవో స్వామి రెడ్డి మండలంలో చేపట్టిన ఏర్పాట్లను ఎస్పీకు వివరించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి రామాంజనేయులు పెదనందిపాడు ఎస్సీ బాలుర హాస్టల్లో ఏర్పాటు చేసిన తుఫాన్ పునరావా కేంద్రంలో ఉన్న వారికి దుప్పట్లు పంపిణీ చేసి. మండల్ స్పెషల్ ఆఫీసర్. తహసిల్దార్. ఎంపీడీవో లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పెదనందిపాడు మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ నాయకులతో పాటు మండల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమాలలో డిప్యూటీ తహసిల్దార్ షేక్ కరిముల్లా .మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ అబిడ్ అలీ. మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియంవద. పెదనందిపాడు ఎస్ఐ మధు పవన్.తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు జంపని హనుమంతరావు.మండల అధ్యక్షులు కోడూరి రాంబాబు, రావి శివరామకృష్ణయ్య. దివి నాగరాజు. జనసేన మండల అధ్యక్షులు ఆముదాలపల్లి నరేంద్ర. సంఘం డైరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, నిమ్మగడ్డ గోపి. రైతు సంఘం నాయకులు బండి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన జె.వి.కీర్తన శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి

గుంటూరు కల్చరల్,అక్టోబర్ 28,ప్రభాతవార్త : స్థానికలక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో శ్రీత్యాగరాజ కళావేదికగా సంస్థ కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో అక్టోబర్ 25నుంచి 29వరకు 47వ వార్షిక వాగ్గేయకార మహోత్సవాలు నిర్వహిసు_న్న కార్యక్రమాల్లో సోమారం సాయంత్రం జరిగిన విదా ్వన్ జె.వి.కీర్తన శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి వీనులవిందుగా సాగింది.వీరికి వాయులీనంపై విద్వాన్ విశేష్ చంద్రశేఖర్ ,మృదంగం పై బుర్రాశ్రీరామ్ వారి వాయిద్య సహాకారం అందించారు.తొలుత లఘు కచేరీలో బాగంగా మైసూరు వాసుదేవా చార్యర్,హెచ్ఎన్ ముత్తయ భాగవతార్ వీణా కుప్పయార్,పచ్చి మిరియమ్ ఆది అప్పయ్య రచనలను ఎం.సరయు శ్రీమాల్ కౌన్స్,ఇ.ప్రియలలిత,పి.హర్షిణి,ఎన్,సోఫియా గ్లోరి,వైఎల్‌విపిఎస్ ఐశ్వర్య,ఆర్ నవ్యపావని లు తమ గాత్రధారణలో వాగ్గేయ కారుల కీర్తనలను శ్రావ్యంగా ఆలాపించి సంగీత అభిమానులను అలరించారు.కళాకారులను సంస్థ ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్,సలహాదారు నేతి విశ్వేశ్వరరావు సత్కరించారు.




## శ్రావ్యంగా సాకేతరమన్ శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి

గుంటూరు కల్చరల్,అక్టోబర్ 28,ప్రభాతవార్త : స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలోశ్రీత్యాగరాజ కళావేదికగా సంస్థ కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో అక్టోబర్ 25నుంచి 29వరకు 47వ వార్షిక వాగ్గేయకార మహోత్సవాలు నిర్వహిస్తున్న కార్యక్రమంలో విద్వాన్ సాకేతరమన్,చెన్నై వారి శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి సంగీతాభిమానులను అలరించింది.వాయులీనం పై డాక్టర్ కె.వి.కృష్ణ,మృదంగం పై బుర్రా శ్రీరామ్,ఘటంపై ఎమ్.హరిబాబు లు చక్కటి వాయిద్య సహకారం అందించి కచేరీని రక్తి కట్టించారు.తొలుత సాయంత్రం 4గంటల నుండి స్థానిక,స్థానికేతర కళాకారుల లఘు కచేరిలల్లో పట్నం సుబ్రహ్మణ్యం అయ్యర్,పురందరదాసు, జి.ఎన్.బాలసుబ్రహ్మణ్యన్,డాక్టర్ మంగళంపలి బాలమురళీ రచనలను వై.సంపూర్ణ రాజ్యలక్ష్మీ గాత్రంతో ఆర్.ఫణితేజ వేణువుతో,డాక్టర్ ఆకెళ్ళ రమణ సాయి వీణపై శ్రావ్యంగా పలికించారు.కళాకారులను సంస్థ ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్,సలహాదారు నేతి విశే ్వశ్వరరావు సత్కరించారు.ఈ సందర్భంగా కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ మాట్లాడుతూ అనేకమంది ప్రముఖ వాగ్గేయకారులను స్మరించుకుంటూ వారి కృతులను గానం చేస్తున్న యువ కళాకారులను ప్రోత్సహించడం,వారితో వినూత్న కార్యక్రమాలను నిర్వహించడం ఒక లక్ష్యంగా ఈ 47వ వాగ్గేయకార ఉత్సవాల ప్రత్యేకత అన్నారు.

## విద్యార్థి సమాజంలో బాధ్యత గల పౌరులుగా ఎదగాలి

మంగళగిరి, అక్టోబరు 28, ప్రభాతవార్త: ఉన్నత ఉద్యను పూర్తి చేసిన ప్రతి విద్యార్థి సమాజంలో బాధ్యత గల పౌరులుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ముధుమూర్తి పిలుపునిచ్చారు. జాతి నిర్మాణం, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం పెరగాలని కోరారు. ప్రపంచస్థాయి సంస్థల్లో కీలక పాత్ర పోషించేందుకు అవసరమైన జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు. మంగళవారం ఉదయం నీరుకొండలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 5 వ స్నాతకోత్సవానికి డాక్టర్ మధు మూర్తి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. యూనివర్సిటీ కులపతి డాక్టర్ టి ఆర్ పారివేందర్ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవంలో మధు మూర్తి విద్యార్థులకు పలు సూచనలు చేశారు ఎస్ఆర్ఎం వంటి అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలో బీటెక్



చదువులు పూర్తి చేసిన విద్యార్థులకు టిసిఎస్, కాగ్నిజెంట్,గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విజనరీ ఖిరోడ్ మ్యాప్ తో ముందుకు సాగుతుందన్నారు. ఎంతో శక్తివంతమైన గూగుల్ ఏఐ డేటా సెంటర్ విశాఖకు మంజూరు కావడము ఎంతో గొప్ప విషయం అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తరఫున స్నాతకోత్సవానికి తాను హాజరయ్యానని మంత్రి లోకేష్ విద్యార్థులకు తన అభినందనలను మెసేజ్ ద్వారా పంపారని వివరించారు. యూనివర్సిటీ ఫౌండర్ ఛాన్సలర్ డాక్టర్ టి ఆర్ పారివేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంచి విజనరీ లీడర్ అన్నారు చంద్రబాబు నాయుడు కోరిక మేరకే ఏపీలో యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు విశ్వవ్యాప్తంగా ఎక్కడైనా మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ డిగ్రీలు అందుకున్న విద్యార్థులు వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు శాంతి సహనంతో విజయ సోపానాలు అధిరోహించవచ్చని తెలియజేశారు ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్ వార్షిక నివేదికను సమర్పించారు

**విద్యార్థులకు డిగ్రీలతో పాటు బంగారు, వెండి పతకాలు**

ఈ సందర్భంగా 202025 విద్యా సంవత్సరంలో బిటెక్, పిహెచ్డి, బిఏ, బీకాం చదువులు పూర్తి చేసుకున్న 1877 మంది విద్యార్థులకు డిగ్రీలు, ఇందులో ప్రతిభ గల విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రధానం చేశారు అనంతరం విద్యార్థులతో కులపతి పారివేందర్ ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం ట్రస్ట్ సభ్యురాలు మణిమంగై, ఎస్ఆర్ఎం గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి నారాయణరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్ డీన్ లు డాక్టర్ విష్ణుపత్, వినాయక కల్లూరి, డాక్టర్ ఎన్వి రమణ రావు, డాక్టర్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు

నోట్ :ఈ వార్తకు 7పిని వాడగలరు. రైటప్:7పి)లాస్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శీర్షిక: రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో పిటిపర్రు జడ్పీ విద్యార్థి ప్రతిభ

పొన్నూరు, అక్టోబరు 28,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలం, రేవేంద్రపాడులో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.లాస్య ప్రతిభ కనబరచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకొన్నారు. బాలికల విభాగంలో 69కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించిందన్నారు. కోచ్‌గా వ్యవహరించిన డి.సరళాదేవి, ప్రధానోపాధ్యాయుడు జిబిఎస్ బసవయ్య, ఉపాధ్యాయులు తదితరులు లాస్యను అభినందించారు.

## బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

పొన్నూరు, అక్టోబరు 28,ప్రభాతవార్త: మొంథా తుఫాన్ సందర్భంగా పునరావాస కేంద్రాల్లో ఉంటున్న బాధితులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళలు అండగా ఉంటామని క్లబ్ అధ్యక్షురాలు బేతాళ ఝాన్సీ రాణి



చెప్పారు. స్థానిక నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న బాధితులకు మహిళాక్లబ్ ఆధ్వర్యంలో పండ్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. బాధితులకు ఏవైనా అవసరమైతే లయన్స్‌క్లబ్‌ను ఆశ్రయించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పి.నిర్మలాదేవి, సభ్యులు నాగమంజరి, ఎం.అమరేశ్వరి, రామకోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

పొన్నూరు, అక్టోబరు 28,ప్రభాతవార్త: రైతుల వ్యవసాయాధికారుల సూచనలు పాటించి పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నం చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకురాలు వి.రామకోటేశ్వరి సూచించారు. మొంథా తుఫాను కారణంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి



వివరించారు. మండల పరిధిలోని వెల్లలూరు, పచ్చలతాడిపర్రు, దండమూడి, వల్లభరావుపాలెం, సీతారామపురం తదితర గ్రామాల్లో పర్యటించారు. మండలంలో ఎక్కువగా బిపిటి-5204రకం సాగు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి నిద్రావస్థ లేదన్నారు. వెంటనే మొలక వస్తుందన్నారు. రైతులు వర్షము తగ్గిన వెంటనే ఐదుశాతం ఉప్పు ద్రావణము పిచికారి చేయాలన్నారు. రాతి ఉప్పు ఎకరాకు రెండు కిలోలు పైరు మీద చల్లాలన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా గింజ రంగు మారకుండా ఉంటుందన్నారు. మొలకశాతం రాకుండా ఉంటుందన్నారు. పొలాల్లో నీటిని బయటకు వెళ్ళే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నీరు బయటకు వెళ్ళిన వరిలో పైపాటుగా 20కిలోలు యూరియా, 20కిలోలు పొటాష్ వేయాలన్నారు. పొడ తెగులు నివారణకు ప్రాపికొనొజోల్(టిల్ట్) ఎకరాకు 200ఎంఎల్ పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు ఎ.భావన, వి.వాసవి, సిహెచ్ రూప, ఎంపీఈవో ఎ.సురేష్‌బాబు తదితరులున్నారు.

## రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో పిటిపర్రు జడ్పీ విద్యార్థి ప్రతిభ

పొన్నూరు, అక్టోబరు 28,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలం, రేవేంద్రపాడులో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.లాస్య ప్రతిభ కనబరచి కాంస్య పతకాన్ని సొంతం




చేసుకొన్నారు. బాలికల విభాగంలో 69కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించిందన్నారు. కోచ్‌గా వ్యవహరించిన డి.సరళాదేవి, ప్రధానోపాధ్యాయుడు జిబిఎస్ బసవయ్య, ఉపాధ్యాయులు తదితరులు లాస్యను అభినందించారు.

## పునరావాస కేంద్రాలను పరిశీలించిన 3టౌన్ సిఐ సాంబశివరావు,ఓఎస్డి ఏసురత్నం



తెనాలి టౌన్ అక్టోబర్ 28 (ప్రభాతవార్త): తుఫాన్ బాధితుల కోసం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను,మంగళవారం, త్రీటౌన్ సీఐ ఎస్.సాంబశివరావు,స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఓఎస్డి ఏసురత్నం పరిశీలించారు. పట్టణ పరిధిలో మొత్తం 10 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయగా,ఆయా కాలనీలకు సంబంధించిన ప్రజలను,ప్రత్యేక బస్సుల ద్వారా ఆయా కేంద్రాలకు తరలించి,వారికి వసతి,భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాలను సందర్శించిన త్రీ టౌన్ సీఐ సాంబశివరావు,మంత్రి నాదెండ్ల మనోహర్ ఓఎస్డి ఏసురత్నం అక్కడి బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.ఆయా పునరావాస కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామని వారు తెలిపారు.

## లోతట్టుప్రాంతాల్లో పర్యటించిన:ఎండిఓ అత్తోట దీప్తి

తెనాలి టౌన్ అక్టోబర్ 28 (ప్రభాతవార్త): భారీ వర్షాల కారణంగా, మండల పరిధిలోని పలు గ్రామాల్లో, లోతట్టు ప్రాంతాల్లో,ఎండిఓ అత్తోట దీప్తి పర్యటించారు. పెదరావూరు లోని ఎస్టి కాలనీలో పలు ఇళ్లను పరిశీలించి, బాధితులతో మాట్లాడి వారిని పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేశారు.



అనంతరం కొలకలూరులో వరద బాధితుల కోసం పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. సరైన వసతులు లేని 60 మంది కుటుంబాలను గుర్తించి,వారికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అల్పాహారం, భోజన సౌకర్యం కలుగజేసామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు ఉపాధ్యాయురాలు నాగవేణి పర్యవేక్షణలో ఈ పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్టు ఎండిఓ అత్తోట దీప్తి తెలిపారు. ఈ కేంద్రాల్లో మెడికల్ క్యాంప్ లు కూడా సిద్ధంచేసి,వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచామని ఆమె తెలిపారు.

## తుఫాన్ ప్రభావం తీరప్రాంతాలపై తీవ్ర ప్రభావం



బాపట్ల,అక్టోబర్28,ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో బాపట్ల జిల్లాలో తీర ప్రాంతాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ డా. వి. వినోద్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ అధిక వేగంతో గాలులు వీసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి 9 గంటల నుంచి రాత్రి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది ప్రజలు ముందుగానే క్యాండిల్స్, ల్యాంపులు, అత్యవసర అవసరాల వస్తువులు సిద్ధం చేసుకోవాలన్నారు. తుఫాన్ సమయంలో ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుఫాన్ సమయంలో అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా మద్యం దుకాణాలను మూసివేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.

## గజ..గజ వణికిస్తున్న మొంథా తుఫాన్
### ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు
### 500 మందిని పునరావాస కేంద్రాలకు తరలింపు..

కొల్లిపర,అక్టోబరు 28 ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావంతో మండల ప్రజలు గజ..గజ వణికిపోతున్నారు.ఇప్పటికే గత సోమవారం ముందుగానే తుఫాన్ ప్రకటనతో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా కొల్లిపర మండలంలోని వివిధ గ్రామాలు వచ్చి తిరిగి అధికారులకు..గ్రామస్తులకు అప్రమత్తంగా ఉండాలని తగిన సూచనలు చేసారు.కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి కిరణ్కుమార్,తహాశీల్థార్ గుమ్మడి సిద్దార్ధ,ఎంపీడీఓ విజయలక్ష్మీ,డిప్యూటి తహాశీల్థార్ రాజేష్,డిప్యూటి ఎంపీడీఓ బార్గవ్ మండలంలోని అన్ని గ్రామాల్లో తిరుగుతూ అధికారులను..ప్రజలను అప్రమత్తం






చేస్తూ లోతట్టు ప్రాంతాలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.ప్రజలు నిత్యావసర సరుకులు తెచ్చిపెట్టుకోవాలని..తుపాన్ పట్ల అప్రత్తంగా ఉండాలని చెబుతున్నారు.బాధితులకు సహాయ సహకారాలు అందించేందుకు అధికారులు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసామన్నారు.తుఫాన్ తీరం దాటే సమయంలో ఈదురు గాలులు మరింత పెరగవచ్చని మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.వల్లభాపురంలో టీడీపీ నేత వంగా సాంబిరెడ్డి స్థానిక నాయకులను కలుపుకుని బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించే విషయంలో అధికారులకు సహయపడుతున్నారు. మంగళవారం రాత్రి వరకు మండలంలోని అత్తోట,తూములూరు,వల్లభాపురం,కొల్లిపరలోని పునరావాస కేంద్రాలకు సుమారు 500 మందిని తరలించి వారికి మెరుగైన భోజన వసతితోపాటు సౌకర్యాలు కల్పిస్తున్నారని అందుతున్న సమాచారం...ఇదిలా ఉంటే మండలంలో మరో 20 రోజుల్లో కోతకు సిద్దమైన వరి పంట అక్కడక్కడ నేలవాలింది.ఆరుగాలం కష్టపడి పండించిన మెట్ట పంటలు..మాగాణి పంటలు తుఫాన్ ప్రభావంతో చేతికి అందకుండా పోతాయోమోనని రైతాంగం ఆందోళనలో ఉన్నారు.

## పేకాటరాయుళ్ళు అరెస్టు

కొల్లిపర,అక్టోబరు 28 ప్రభాతవార్త: మండల పరిధిలోని దావులూరులో పేకాట ఆడుతున్న 7 గురుని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.7,400 లను 5 సెల్‌పోన్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

## ఆందోళన వద్దు: ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు అక్టోబరు 28 (ప్రభాతవార్త) : మొంథా తుఫాను ప్రభావం నేపథ్యంలో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని, అప్రమత్తంగ ఉండాలని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నియోజకవర్గంలోని జంపని వేమూరు గ్రామాల్లో తుఫాన్ కారణంగా పునరావాస కేంద్రాల్లో బాధితులను



పరామర్శించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని జంపని గ్రామంలోని హైస్కూల్లో ఏర్పాటు చేసిన రిహాబిలిటేషన్ సెంటర్ను సందర్శించి



అక్కడ ఆశ్రయం పొందిన వారిని పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రత కోసం ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని, ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావం రాష్ట్రంపై అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారని మన ప్రాంతంలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి నాగిరెడ్డి, తహశీల్దార్ సుశీల, ఎంపీడీవో రవికుమార్, టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ అమ్మిశెట్టి కిషోర్, మండల పార్టీ అధ్యక్షులు గాజుల వెంకటసుబ్బయ్య, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీట మునిగిన వరి పంట

కొల్లూరు, అక్టోబరు 28 (ప్రభాతవార్త) : మండల పరిధిలోని క్రాప గ్రామంలో భారీ వర్షంకు నీట మునిగిన వరిపంటను మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు క్షేత్రస్థాయిలో సందర్శించి సుమారు 450ఎకరాలు వరి పంట పడినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు ఆయన మంగళవారం తెలియజేశారు. కాలువ ద్వారా వరి పంటలో నిల్వ ఉన్న నీటిని బయటికి పంపించుకోవాలని రైతులకు తగు సూచనలు తెలియజేశారు. అధిక వర్షాలకు వరి పంటలో నష్టనివారణ చర్యలు గురించి వివరించారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.



## తుఫాన్ హెచ్చరికలను పాటించాలి

పొన్నూరు, అక్టోబరు 28,ప్రభాతవార్త: ప్రజలందరూ మొంథా తుఫాన్కు సంబంధించి అధికారుల హెచ్చరికలను, సూచనలను తప్పని సరిగా పాటించాలని, తద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూసుకోవచ్చని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. మండల పరిధిలోని వల్లభరావుపాలెంలోని పునరావాస కేంద్రాన్ని మంగళవారం సందర్శించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలోని వారికి పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ప్రజలెవరూ బయటకు రావద్దని ఇంట్లోనే ఉండాలని సూచించారు. ఎవరికైనా తుఫాను తాకిడికి తట్టుకోలేకున్నవారు తప్పని సరిగా పునరావాస కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్పీ వెంట తెనాలి డిఎస్పీ జనార్దనరావు, అర్బన్, రూరల్ సిఐలు లావూరి వీరానాయక్, యాదల కోటేశ్వరరావు, రూరల్ ఎస్సై గండు కిరణ్బాబు తదితరులున్నారు.



# బాపట్ల జిల్లా వార్త



## మొంథా తుపాను దాటికి జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి

బాపట్ల,అక్టోబర్28,ప్రభాతవార్త: మొంథా తుపాను దాటికి బాపట్ల జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని తుపాను దక్షిణ కోస్తాంధ్ర ప్రత్యేక అధికారి, ఏపీ చేనేత జోలి శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియ అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లాలో మంగళవారం ఆయన పర్యటించారు. భారీ వర్షాలకుఉధృతంగా ప్రవహిస్తున్న హైదరిపేటలోని నల్లమడ కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వ పరివాహక ప్రాంతం వాసులను సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. తుపాను తాకిడికి ప్రజలు, పశువుల ప్రాణాలకు ఎలాంటి నష్టం జరగరాదని, ఆస్తి నష్టాన్ని తగ్గించాలన్నారు. పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న



ప్రజలకు సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులంతా చక్కని ప్రణాళికతో ముందుకు సాగడంపై అభినందించారు. పంట కాల్వల ప్రవాహంతో ప్రజలకు ఎలాంటి నష్టం లేకుండా చూడాలన్నారు. తుపానును ఎదురుకోవడానికి సమగ్ర ప్రణాళికతో ముందస్తుగా అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. జిల్లాలో చేపడుతున్న సహాయక కార్యక్రమాల గురించి వివరించారు. 30 ప్రధాన కాల్వలు, 42 మధ్యస్థ కాల్వలు జిల్లాలో ఉండగా, 103 గ్రామాలను తాకుతూ ఆ కాల్వలు వెళ్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. జిల్లాలో 440 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 6,664 మందికి ఆశ్రయం కల్పించామన్నారు. ఆశ్రయం పొందుతున్న వారికి అలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. నల్లమడ, తుంగభద్ర కాల్వల పరివాహక ప్రాంతాల గురించి వివరించారు. జిల్లాలో పరిస్థితులు, సహాయక చర్యలపై సిసోడియాకు జిల్లా కలెక్టర్ సమగ్ర నివేదికను అందించారు.ఆయన వెంట జల వనరుల శాఖ జిల్లా అధికారి అబూతలీమ్, జెఈ సునీత, తదితరులు ఉన్నారు.

## పంట కాల్వల పరివాహక ప్రాంతాల్లో నివాసముండే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

బాపట్ల,అక్టోబర్28,ప్రభాతవార్త: పంట కాల్వల పరివాహక ప్రాంతాల్లో నివాసముండే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. బాపట్లలోని నల్లమడ(నాగరాజు కాల్వ),తూర్పు తుంగభద్ర కాల్వలు, పరివాహక ప్రాంతాలను జిల్లా ప్రత్యేక అధికారి



వేణుగోపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కలిసి మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున పంట కాల్వలకు భారీగా వరద నీరు వచ్చే అవకాశం ఉందన్నారు.. నీటి ప్రవాహంతో పరివాహక ప్రాంతాలలో నివాసముంటున్న గృహాలలోకి వరద నీరు రాకముందే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అత్యంత వేగంగా వారిని తరలించడం ద్వారా పొంచిఉన్న ప్రమాదాన్ని ముందస్తుగా అరికట్టవచ్చన్నారు. నల్లమడ కాల్వలో ప్రస్తుతం 12 వేల క్యూసెక్కుల వరద నీరు సముద్రంలోకి చేరుతుందన్నారు. ఈ ప్రవాహం మరింత పెరగనుందన్నారు. ఆ కాల్వ గట్లు బలహీనంగా ఉన్న జిల్లెలమూడి గ్రామం, జమ్ములపాలెంలోని వెస్ట్ సైడ్ డ్రైన్, హైదరిపేటలోని నల్లమడ కాల్వలను పరిశీలించారు. కర్లపాలెంలోని ఈస్ట్ తుంగభద్ర కాల్వ పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. ఆవాస ప్రాంతాలలో ప్రజలను తరలించడానికి వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగడానికి వీలు లేదన్నారు. ప్రజలు సురక్షితంగా ఉండడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ అధికారి అబూతలీమ్, ఉపకార్య నిర్వాహక ఇంజినీర్ ఇంకొల్లు ధనలక్ష్మి, జేఈ సునీత, తదితరులు పాల్గొన్నారు.

## తుపాను ప్రభావంతో నిరాశ్రయులైన వారిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించాలి

బాపట్ల,అక్టోబర్28,ప్రభాతవార్త: లోతట్టు ప్రాంతాలలోని గర్భిణులను యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వ వైద్యశాలలకు తరలించాలని జిల్లా ప్రత్యేక అధికారి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ లో అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలకు ఎటువంటి సమస్యలు రాకుండా అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 15 రోజుల్లో కాన్పు జరిగే 47 మంది గర్భిణులను ప్రభుత్వ వైద్యశాలలకు తరలించగా, మరో 87 మంది గర్భిణీలను ప్రైవేట్ వైద్యశాలలకు తరలించామన్నారు. లో తట్టు ప్రాంతాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరాకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. విద్యుత్ నిలిస్తే ఆయా ప్రాంతాలలో పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. కండక్టర్లు సిద్ధంగా ఉంచామని, 152 విద్యుత్ పరివర్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 803 స్తంభాలు, 630 మంది విద్యుత్ సిబ్బంది ఆయా ప్రాంతాలలో సిద్ధంగా ఉంచామన్నారు.

మొంథా తుపాను ప్రభావంతో నిరాశ్రయులైన వారిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. 119 పునరావాస కేంద్రాలకు 5,407 మంది నిరాశ్రయులను తరలించామన్నారు. పునరావాస కేంద్రాలలో అన్ని వసతులు కల్పించామన్నారు. ఆశ్రయం పొందుతున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అల్పాహారం, భోజనం సకాలంలో అందజేస్తున్నామన్నారు. వైద్య సదుపాయాలకు అన్ని సిద్ధంగా ఉంచామన్నారు. ఎక్కడైనా ఏదైనా ఇబ్బందులు జరిగితే తక్షణమే సమాచారం ఇవ్వాలని అధికారులకు సూచించారు. మొంథా తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు రెండు గ్రామాలలో రహదారులు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. బల్లికురవ మండలంలోని కొమ్మినేనివారి పాలెం గ్రామాల మధ్య రహదారిలో కల్వర్టు కుంగిందన్నారు. కారంచేడు మండలం కేశవరపాడుతిమిడిపాడు ఆర్ అండ్ బి రహదారి 50 అడుగుల మేర ధ్వంసం అయిందన్నారు. ఆ మార్గంలో వాహనాలను దారి మళ్లించామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాల్లో సకల సౌకర్యాలు

కర్లపాలెం,అక్టోబర్28,ప్రభాతవార్త: తుఫాన్ నేపథ్యంలో అన్ని పునరావాస కేంద్రాలలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని శాసన సభ్యులు నరేంద్రవర్మ తెలిపారు. మంగళ వారం బాపట్ల నియోజకవర్గం, కర్లపాలెం మండలం తుమ్మల పల్లి గ్రామం లో మొంథా తుఫాన్ నేపథ్యంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించి ప్రజలతో మాటా దారు. తుఫాన్ ను ఎదుర్కో వటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది అన్నారు ఆయన కూటమి నేతలు,తదితరులు ఉన్నారు



## పునరావాస కేంద్రాలను పరిశీలించిన జనసేన నాయకులు విన్నకోట సురేష్



కర్లపాలెం,అక్టోబర్28,ప్రభాతవార్త: తుఫాన్ కారణంగ బాపట్ల నియోజకవర్గ గణపవరం గ్రామంలో పునరావాస కేంద్రాలను స్వయంగా సందర్శించిన బాపట్ల నియోజకవర్గ జనసేన నాయకులు విన్నకోట సురేష్ అనంతరం బ్రెడ్, బిస్కెట్లు, వాటర్ బాటిల్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి గారు, కర్లపాలెం మండల అధ్యక్షుడు మరియు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గొట్టిపాటి శ్రీకృష్ణ, బాపట్ల మండల అధ్యక్షుడు దాసరి యేసుబాబు, బాపట్ల నియోజకవర్గ నాయకులు కారుమూరి అంజేనేష్, పసుపులేటి మహేష్, కూచిపూడి సింగ్,తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దు

బాపట్ల,అక్టోబర్28,ప్రభాతవార్త:తుఫాన్ గురించి సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దనిజిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ప్రధాన కార్యాలయంలో మొంథా తుఫాను గురించి సోషల్ మీడియాలలో వచ్చే అసత్య ప్రచారాలపై మంగళివారం ఎస్పీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా అసత్య ప్రచారాలు చేయవద్దన్నారు.పోలీస్ శాఖ లేదా ఇతర ప్రభుత్వ అధికారుల అధికారిక ప్రకటనలు మాత్రమే పరిగణలోకి తీసుకోవాలన్నారు.మొంథా తుఫాన్ గురించి సోషల్ మీడియా వేదికలలో వచ్చే అసత్య ప్రచారాలను, రూమర్లు లేదా భయాందోళన కలిగించే పోస్టులు నమ్మవద్దని, అటువంటివి ఎవరైనా సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసినా, ఫార్వర్డ్ చేయవద్దని చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మొంథా తుఫాన్ లాంటి విపత్కర పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొని ప్రజలకు భద్రత కల్పించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన ముందస్తు చర్యలు



తీసుకోవడం జరిగిందన్నారు. అయితే కొంతమంది వ్యక్తులు దురుద్దేశపూర్వకంగా సోషల్ మీడియా వేదికగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధమైన తప్పుడు వార్త కథనాలను, అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్నారు. అటువంటి అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన తెలిపారు. ప్రభుత్వం నుండి వాతావరణ శాఖ నుండి లేదా పోలీస్ శాఖ నుండి అధికారికంగా వచ్చే ప్రకటనలు మాత్రమే విశ్వసించాలన్నారు. ఎవరైనా ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా అసత్య ప్రచారాలను, వదంతులను వ్యాపింప చేయవద్దని సూచించారు. ఏదైనా సమాచారాన్ని సోషల్ మీడియా వేదికలలో పోస్ట్ చేసే ముందు, ఫార్వర్డ్ చేసే ముందు దాని గురించి పూర్తి వాస్తవ సమాచారాన్ని సంబంధిత అధికారుల నుండి నిర్ధారించుకున్న తర్వాతనే సోషల్ మీడియా వేదికలో పంచుకోవాలని తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావం తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు సహాయం అందించడానికి పోలీస్ యంత్రాంగం సంసిద్ధంగా ఉందన్నారు. ఏదైనా పోలీస్ సహాయం అవసరమైతే తక్షణం టోల్ ఫ్రీ నెంబర్ 112 కు లేదా బాపట్ల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ నెంబర్ 8333813228 కు ఫోన్ చెయ్యాలన్నారు.

## సబ్ డివిజన్ పరిధిలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

బాపట్ల,అక్టోబర్28,ప్రభాతవార్త: ఎటువంటి విపత్కర పరిస్థితులలోనైన ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం అన్ని విధాల సంసిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ తెలిపారు. మొంథా తుఫాను మరింత బలపడి, బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ నుండి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తం అయింది. ఈ సందర్భంగా ఎస్పీమాట్లాడుతూ ఎటువంటి ప్రాణ నష్టం సంభవించకూడదనే ముఖ్య ఉద్దేశంతో తగిన ముందస్తు చర్యలు తీసుకుంటు న్నామన్నారు. లోతట్టు ప్రాంతాలలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు



తెలుసుకుంటూ, అక్కడ నివాసముంటున్న ప్రజలకు అవగాహన కల్పించి ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామన్నారు. తుఫాను ఎక్కువగా ప్రభావం చూపడానికి అవకాశం ఉన్న ప్రదేశాలలో ఎస్.డి.ఆర్.ఎఫ్, క్విక్ రియాక్షన్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. చీరాల, రేపల్లె, నిజాంపట్నం ప్రాంతాలలో ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను , 8 క్విక్ రియాక్షన్ బృందాలను సబ్ డివిజన్ పరిధిలో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. మరో 4 క్విక్ రియాక్షన్ బృందాలను, 4 స్పెషల్ రెస్పాన్స్ బృందాలను హెడ్ క్వార్టర్లో సిద్ధంగా ఉంచమని తెలిపారు.ప్రజలకు అత్యవసర సమయంలో వేగవంతంగా పోలీస్ శాఖ సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. 24 7 పోలీస్ అధికారులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలకు ఏదైనా ఇబ్బంది ఎదురైనా లేదా పోలీస్ శాఖ సహాయం అవసరమైనపుడు 8333813228 నంబర్‌కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందవచ్చనన్నారు. అదేవిధంగా చీరాల, బాపట్ల, రేపల్లె సబ్‌డివిజన్‌ల పరిధిలో కూడా నోడల్ అధికారులను నియమించి కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

## మొంథా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పొన్నూరు, అక్టోబరు 28,ప్రభాతవార్త: మొంథా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, మునిసిపల్ ప్రత్యేకాధికారి యు.చెన్నయ్య సూచించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన రెండు పునరావాస కేంద్రాలను సందర్శించిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. మొంథా తుఫాన్ తీరం దాటే సమయంలో బలమైన గాలులు, భారీ వర్షాలకు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖాధికారులు తెలిపారన్నారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డివిసీ కాలనీలోని మునిసిపల్ పాఠశాలలో రెండు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. 17సచివాలయాల పరిధిలో ఈ రెండు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంకేమైనా అవసరమైతే కూడా మరికొన్ని పునరావాస కేంద్రాలు ఏర్పాటుకు కూడా ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. పునరావాస కేంద్రాల్లోని వారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, మధ్యలో పండ్లు, బిస్కట్లు, రాత్రికి భోజనం తదితర ఏర్పాట్లు చేశామన్నారు. పునరావాస కేంద్రంలోని వారికి




అసౌకర్యం కలుగకుండా అన్నీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పునరావాస కేంద్రాల్లోని వారి కోసం మెడికల్ క్యాంపును కూడా 24గంటలు ఉండే విధంగా ఏర్పాటు చేశామన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని వారు, పూరి గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివశిస్తున్నవారు పునరావాస కేంద్రాలకు రావాలని కోరారు. మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు అన్నీ రకాల ఏర్పాట్లు చేశారని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో ఇద్దరు కానిస్టేబుళ్ళు కూడా విధులు నిర్వహిస్తున్నారన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు పంపిణీ జరిగిందన్నారు. పునరావాస కేంద్రాల్లోని వారికి సహాయ సహకారాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ముందుకు రావాలని కోరారు. పునరావాస కేంద్రంలోని బాధితులను ఏర్పాట్లకు సంబందించిన వివరాలను ప్రత్యేకాధికారి చెన్నయ్య అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి, పొన్నూరు మండల ప్రత్యేకాధికారి కెవివి సత్యనారాయ, తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్, ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, అర్బన్, రూరల్ సిఐలు లావూరి వీరానాయక్, యాదల కోటేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారి దూపం రాజు, నాయకులు ఆకుల సాంబశివరావు, పఠాన్ పిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నన్నపనేని రఘునాథ్ తదితరులున్నారు.

## సమన్వయంతో పనిచేస్తాం.....బాధితులకు అండగా ఉంటాం



పొన్నూరు, అక్టోబరు 28,ప్రభాతవార్త: మండలంలోని అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ....బాధితులకు అండగా ఉండి సేవలందిస్తున్నామని జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి కెవివి సత్యనారాయణ చెప్పారు. మొంథా తుఫాను సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామాల్లోని ప్రజలకు వివరించారు. మొంథా తుఫాను సందర్భంగా ప్రజలెవరూ అధైర్యపడవద్దని, జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలోని 29గ్రామాల్లో సుమారు 60పునరావాస కేంద్రాలను గుర్తించామన్నారు. వాటిలో ప్రస్తుతం మూడింటిలో మాత్రమే బాధితులున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పెద ఇటికంపాడులో 12మంది, వల్లభరావుపాలెంలో 82మంది, ఉప్పరపాలెంలో 58మంది మొత్తం 152మంది ఉన్నట్లు చెప్పారు. ప్రత్యేకాధికారి వెంట మునిసిపల్ ప్రత్యేకాధికారి యు.చెన్నయ్య, తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్, ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, రూరల్ సిఐ యాదల కోటేశ్వరరావు, రూరల్ ఎస్సై గండు కిరణ్‌బాబు తదితరులున్నారు.

## తుఫాన్ ప్రభావం కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలి : ఏడి

యడ్లపాడు, అక్టోబర్ 28, ప్రభాతవార్త : మోంథా తుఫాన్ ప్రభావం కారణంగా మండలంలో అధిక వర్షపాతం నమోదు అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని, ఉన్నతాధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధతీసుకొని ఎక్కడికక్కడ ప్రజలను అప్రమత్తత చేస్తున్నారని, కావున రైతులు అప్రమత్తతగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం జగ్గారావు పేర్కొన్నారు. యడ్లపాడు గ్రామంలో జిల్లా వ్యవసాయాధికారి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో సమావేశం అయ్యి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వారు తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అరాతీసారు. ఈ సందర్భంగా అయన వివరిస్తూ మోంథా తుఫాన్ ప్రభావిత మండలాలలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పల్నాడు జిల్లాలో సాగు చేస్తున్న పంటలు మునిగే ప్రమాదం పొంచి ఉందని, జిల్లాలోని యడ్లపాడు, నాదెండ్ల, అమరావతి, క్రోసూరు, అచ్చంపేట, పెదకూరపాడు తదితర మండలాలలో ఉన్నతాధికారులు అందరిని అప్రమత్తత పర్చటం జరిగిందని, సుమారు 17వేల హెక్టార్లు పంట దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని తెలిపాన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో వ్యవసాయధికారులు ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎవో హరిప్రసాద్, ఏఈఓ జీవన్, వ్యవసాయ శాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



## షార్ట్ సర్క్యూట్ కారణంగా పెంకుటిల్లు దగ్ధం

యడ్లపాడు, అక్టోబర్ 28, ప్రభాతవార్త : మండల పరిధిలోని ఉన్నవ గ్రామంలో మంగళవారం పెంకుటిల్లు కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించిన సంఘటన చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి స్థానికులు తెలుపుతున్న వివరాల ప్రకారం ఇంటిలో పల్లపోతుల పోలిరాజు అనే వ్యక్తి మాత్రమే నివాసం ఉంటాడని, పనుల నిమిత్తం వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి చేరు కుంటాడని, షార్ట్ సర్క్యూట్ అయిన సమయంలో ఇంటిలో ఎవరూలేరన్నారు. విషయం తెల్సుకొని వెంటనే అగ్నిమాపక సిబ్బందికి తెలియపర్చగా వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకు వచ్చారని, అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయిందన్నారు. అయితే ఎంత మేర ఆస్తి నష్టం జరిగిందనే విషయం ఇంకా తెలియరాలేదు.



## తుఫాన్ కారణంగా ఘాట్ రోడ్డు మూసివేత

యడ్లపాడు, అక్టోబర్ 28, ప్రభాతవార్త : మోంథా తుఫాన్ కారణంగా మండల పరిధిలోని చారిత్రక ప్రాంతమైన కొండవీడు కొండలపైకి ఉన్న ఘాట్ రోడ్డును మూసి వేస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణ ప్రియ తెలిపారు. తుఫాన్ ప్రభావం కారణంగా పర్యాటకులకు ఇబ్బందులు కలిగే ప్రమాదం ఉందని, ఉన్నతాధికారుల అదేశాలను గుణంగా 28,29 తేదీలు మూసివేయటం జరిగిందని, పర్యాటకులు ఇది గమనించాలని అమె కోరారు.




## తుఫాన్ కారణంగా ప్రజలు అప్రమత్తతగా ఉండాలి : ఎస్సై

యడ్లపాడు, అక్టోబర్ 28, ప్రభాతవార్త : వాతావరణ శాఖ సమాచారం ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన మోంథా తుఫాన్ తీవ్రతరమై తీరప్రాంతాలను తాకే అవకాశం ఉందని కావున ఈ నేపథ్యమంలో ప్రజల ప్రాణ, అస్తి రక్షణ కొరకు పోలీసులు మరియు జిల్లా యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉందని, కావున మండల ప్రజలు పలు సూచనలు పాటించాలని ఎస్సై టి శివరామకృష్ణ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లలోనే భద్రంగా ఉండాలని గాలి, వర్షం బలంగా ఉండే అవకాశం ఉన్నందున ఇళ్ల కిటికీలు, తులుపులు బలంగా మూపి వేయాలని, విద్యుత్ సరఫరాలు నిలిచిపోవచ్చు కాబట్టి ముందస్తుగా టార్చ్, బ్యాటరీ లైట్లు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైతే తాగునీరు, నిత్యఅవసర, ప్రథమ చికిత్స సామాగ్రి ముందుగానే నిల్వ ఉంచుకోవాలని, తెగిపోయిన విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, పడిపోయిన చెట్లవద్దకు వెళ్లకూడదని, రోడ్లపై చెట్లు, విద్యుత స్తంబాలు పడిపోయినట్లు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. అవసరమైతే తప్ప వాహన ప్రయాణాలు మానుకోవాలని, భారీ వర్షం, గాలులు ఉన్నప్పుడు రోడ్లపై ప్రయాణం చేయటం ప్రమాదకరం మన్నారు. ప్రభుత్వం, పోలీస్, రెవెన్యూ శాఖలు జారీ చేసే అధికారిక ప్రకటనలనే నమ్మాలని, సోషల్ మీడియాలో వచ్చే కధనాలను తప్పుడు వార్తలను అపోహలు పంచరాదన్నారు. పోలీస్ బృందాలు అన్ని ప్రాంతాల్లో గస్తీ విధులు నిర్వహిస్తున్నాయని, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ, తరలింపు చర్యలకు సిద్దంగా ఉంచబడ్డాయన్నారు. ప్రజల భద్రతే మా ప్రాధాన్యత కాబట్టి ఎవరికైనా సహాయం అవసరమైతే అలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలన్నారు.



## జనసేన సైనికుని కుటుంబానికి ఆర్థికసాయం

మాచర్ల, అక్టోబరు 28 ప్రభాతవార్త: ఆపదలో ఉన్న జనసేన సైనికుడి కుటుంబానికి న్యాయవాది, జనసేన నాయకులు బత్తుల బాబురావు అండగా నిలిచారు. పట్టణానికి చెందిన జనసేన సైనికుడు



మోడేపలిన్ల సంతోష్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో మంగళవారం పరామర్శించారు. పార్టీ సిద్ధాంతాలను అనుసరించి తక్షణ సాయంగా రూ.5 వేలు నగదుతోపాటు పండ్లు, మందులను అందజేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ జనసేన పార్టీ కేవలం ఒక రాజకీయ శక్తి మాత్రమే కాదు, ఇది ఒక కుటుంబం. ఈ కుటుంబంలోని ప్రతి జనసైనికుడు మాకు ఎంతో విలువైనవాడు. పార్టీ ఆశయాల కోసం నిరంతరం శ్రమించిన సంతోష్‌ను పార్టీ ఆదుకుంటుందన్నారు. సంతోష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొమెర అమరయ్య, వరక బాలయ్య, ఉప్పుతోళ్ల ప్రసాద్, కొమెర శ్రీను, బత్తుల శివ తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుపానుపై కూటమి ప్రభుత్వం అప్రమత్తం: ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల, అక్టోబరు 28 ప్రభాతవార్త: మొంథా తీవ్ర తుపాను ప్రభావంపై కూటమి ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని నియోజకవర్గ ప్రజలు ఎవరూ ఆందోళనచెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థ సంయుక్త అధ్వర్యంలో ఇచ్చిన నివేదికల ఆధారంగా అధిక వర్షపాతంతో కలిగే నష్టాన్ని ఇప్పటికే ప్రభుత్వం అంచనాకు వచ్చిందన్నారు. ఏపీ సీఎం నవచంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్‌లు నిత్యం సమీక్షిస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా టోల్ ఫ్రీ నంబర్లు ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాచర్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులను అప్రమత్తం చేశామని, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా నేతృత్వంలో అనునిత్యం పర్యవేక్షిస్తున్నారన్నారు. తుపాను బాధితుల కోసం జిల్లా కలెక్టరు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారని, మండలాల వారీగా కంట్రోల్ రూంలు,




అధికారులను నియమించారన్నారు. 24 గంటలు ఏ సమయంలోనైనా సహాయ చర్యలు తక్షణమే అందిస్తారని ఎమ్మెల్యే జూలకంటి వెల్లడించారు. అధికారులతోపాటు కూటమి ప్రభుత్వ శ్రేణులు కూడా సహాయ చర్యలకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కారంపూడి మండలం 70930 04566, దుర్గి మండలం 95732 71041, రెంటచింతల మండలం 99899 91002, వెల్దుర్తి మండలం 63005 02015, మాచర్ల మండలం 63028 17715, మాచర్ల మున్సిపాలిటీ 9849905838 నంబర్లలో సంప్రదించవచ్చున్నారు.

## మొంథా తుపానుపై విద్యుత్తు అధికారుల అప్రమత్తం

మాచర్ల, అక్టోబరు 28 ప్రభాతవార్త: మొంథా తుపాను వల్ల ఏర్పడే ప్రతికూల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని విద్యుత్తు సమస్యలను పరిష్కరించడానికి మాచర్ల డివిజన్లో విద్యుత్తు అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. సబ్ డివిజన్‌కు 40 స్తంభాలు, డివిజన్ మొత్తాన్ని కలిపి 160 విద్యుత్తు స్తంభాలు వేర్వేరు ప్రాంతాల్లో అందుబాటులో ఉంచారు. తుపాను వల్ల స్తంభాలు పడిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోవడం, వైర్లు తెగిపోవడం వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యుత్తు అధికారులు తెలిపారు. డివిజన్ ఆఫీసులో సమస్యలు తెలుసుకోవడానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. తుపాను వల్ల వినియోగదారులు విద్యుత్తు సమస్యలుంటే 9440817531 నంబర్లో తెలియజేయాలని డివిజన్ ఏఈ పేర్కొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## పల్నాడు జిల్లాలో 190 పునరావాస కేంద్రాలు గుర్తింపు

నరసరావుపేట, అక్టోబర్ 28 ప్రభాతవార్త : పల్నాడు జిల్లాలో 190 పునరావాస కేంద్రాలను గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా మంగళవారం తెలిపారు. నరసరావుపేట డివిజన్‌లో 159 కేంద్రాలు, సత్తెనపల్లి డివిజన్‌లో 22 కేంద్రాలు, గురజాల డివిజన్‌లో 9 కేంద్రాలను గుర్తించామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తక్షణ సహాయం కోసం 08647-252999 కు డయల్ చేసి కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. అదే విధంగా జిల్లాలో తుఫాన్ కారణంగా సదరమ్ రీ ఎసెస్‌మెంట్ కేంద్రాలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తూ మాట్లాడారు. భారీ వర్షాలకు రిజర్వాయర్లు, చెరువులలో నీటిమట్టం పెరుగుతూ ఉండటంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మరో రెండు రోజుల పాటు పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. భారీ వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశాలిచ్చారు. త్రాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేసుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలు పడిపోయే ప్రమాదం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశాలిచ్చారు.



## తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు

నరసరావుపేట క్రైం, అక్టోబర్ 28 ప్రభాతవార్త : తుఫాన్ ప్రభావంతో నరసరావుపేట నియోజకవర్గంలోని గ్రామాలలోనూ, పట్టణ పరిసర ప్రాంతాలలోనూ భారీ వృక్షాలు నేలకొరుగుతున్నాయి. విద్యుత్ స్తంభాలు పడిపోతున్నాయి. రావిపాడురోడ్డులోని సెయింట్‌మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద భారీ వృక్షం ఈదురుగాలులతో నేలకొరిగింది. పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. రూరల్ ఎస్.ఐ. చల్లా కిషోర్ తమ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. రోడ్డుకు అడ్డుగా పడిపోయిన చెట్టును జేసిబి సహాయంతో పక్కకు తొలగించారు. పల్నాడు ప్రాంతానికి జిల్లా కేంద్రం నుండి రాకపోకలు సాగించే ప్రధాన మార్గంలో ఈ సంఘటన జరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా పోలీస్‌శాఖ వేగంగా చర్యలు తీసుకుంది. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ సమస్య లేకుండా సమస్య పరిష్కారం అయ్యింది. అదే విధంగా పట్టణంలోని పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం సైతం వేగంగా వీస్తున్న గాలులకు పడిపోయింది. స్తంభానికి హోర్డింగ్‌లు సైతం ఉండటంతో వాహనదారులు, స్థానికులు ఆందోళన చెందారు. విద్యుత్ స్తంభం కావడంతో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడ్డారు. విద్యుత్‌శాఖ అధికారులు అక్కడకు చేరుకొని స్తంభాన్ని తొలగించారు. స్తంభం నేలకొరిగే సందర్భంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలలో చెట్ల కొమ్మలు విరిగిపోవటంతో ఇళ్ల పాక్షికంగా దెబ్బతిన్నాయి. అదే విధంగా పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. వేగంగా వీస్తున్న గాలులకు విద్యుత్ తీగాలతో ప్రమాదం పొంచి ఉందనే ఆందోళన లోతట్టు ప్రాంతాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కమీషనర్ జస్వంతరావు, తహశీల్దార్ వేణు గోపాల్, ఎంపిడివో కృష్ణకుమారి తమ కార్యాలయాలలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసారు. కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నెంబర్‌లు ఏర్పాటు చేసారు. మైక్‌ల ద్వారా ప్రజలకు సూచనలు చేస్తూ తుఫాన్ పై ప్రచారం చేస్తున్నారు. మరో వైపు పోలీస్ శాఖ అధికారులు జెసిబిలు ఏర్పాటు చేసుకుని పడిపోయిన చెట్లను తొలిగించారు. చప్టాల వద్దప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రజలను ఆటువైపు రాకపోకలు సాగించవద్దని కోరుతున్నారు.



## ఆటో స్టాండ్ ఏర్పాటు చేస్తాం : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, అక్టోబర్ 28 ప్రభాతవార్త : ఆటోస్టాండ్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు హామీ ఇచ్చారు. మంగళవారం ఆటోస్టాండ్ ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్లు ఎమ్మెల్యే అరవింద్‌బాబుకు పార్టీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆటోస్టాండ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అరవింద్‌బాబు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల ఇబ్బందులు, సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తా మన్నారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న టువంటి ఇబ్బందులను తొలగిస్తామన్నారు. పలు ప్రాంతాలలో ఆటోస్టాండ్‌లను ఏర్పాటు చేసేందుకు స్థలాలు కేటాయించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే అరవింద్‌బాబు ఆదేశాలిచ్చారు. అదే విధంగా ఉప్పలపాడు గ్రామ సమీపంలో ఆటో నగర్ నిర్మాణానికి భూ సేకరణ జరుగుతుందన్నారు. ఆరు ఎకరాల నుండి పది ఎకరాల వరకు భూమిని ఆటోనగర్ కోసం గుర్తించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో ఆటోనగర్ ఏర్పాటు విషయమై మాట్లాడటం జరిగిందన్నారు. ఆటోనగర్ ఏర్పాటుతో 500 మందికి పైగా ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. అదే విధంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. విజయవాడ, గుంటూరు నగరాలలో ఆటోనగర్‌లను మోడల్స్‌గా తీసుకొని పనులు ప్రారంభిస్తామన్నారు. జిల్లా కలెక్టర్‌తో చర్చించి భూమి కేటాయింపులు, నిధులు సమకూర్చే కార్యక్రమాన్ని చేపడతామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలిపారు.



## వైకాపా కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి పరామర్శ

నరసరావుపేట క్రైం, అక్టోబర్ 28 ప్రభాతవార్త : అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్స పొందుతున్న పార్టీ కార్యకర్త చిరువూరి చిన్నయ్యను వైకాపా పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించారు. పమిడిమర్రు గ్రామానికి చెందిన చిన్నయ్య వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చురుకైన కార్యకర్త అని తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని ఈ సందర్భంగా డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. వారి కుటుంబసభ్యులతో మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని, త్వరగా చిన్నయ్య కొలుకొని పూర్తి ఆరోగ్యంతో ఇంటికి వస్తారని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ధైర్యం చెప్పారు.




**జిల్లాలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయకచర్యల్లో పాల్గొనండి : డాక్టర్ గోపిరెడ్డి**

జిల్లాలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయకచర్యల్లో వైకాపా శ్రేణులు పాల్గొనాలని వైకాపా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డిశ్రీనివాసరెడ్డి అన్నారు. తుఫాన్ ప్రభావం వలన అనేక గ్రామాలలో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు పడిపోతున్నాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అదే విధంగా జిల్లా అధికారయంత్రాంగం నిర్వహించే చర్యల్లో తమవంతు సహాయ సహకారాలను అందించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని కోరారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలు అన్నిశాఖలకు తగిన ఆదేశాలు ఇవ్వాలన్నారు. జిల్లాలోని ప్రజలకు త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఆహారం అందేందుకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఈశ్వర్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం

నకరికల్లు, అక్టోబర్ 28 ప్రభాతవార్త : ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి సహకారంతో జరిగిందన్నారు. ఛైర్మన్ షేక్.మీరావలి కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆసుపత్రి ప్రతినిధి వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులకు కంటి సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించామన్నారు.కళాశాల కార్యదర్శి షేక్.కరీమ్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులతో పాటు ఉద్యోగులు, అధ్యాపకులు 266 మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. 22 మందికి కళ్ళజోళ్ళకు సిఫార్సు చేయడం జరిగిందన్నారు. డైరెక్టర్ షేక్.మస్తాన్‌షరీఫ్ మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా జీవించేందుకు కళ్ళు ఆరోగ్యంగా ఉండటం ఎంతో ముఖ్యమని తెలియజేశారు.ప్రిన్సిపాల్ జి.నాగమల్లేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## నవంబర్ 10 నుండి కులగణన నిర్వహించాలి

నరసరావుపేట టౌన్, అక్టోబర్ 28 ప్రభాతవార్త : నవంబర్ 10 నుండి కులగణన నిర్వహించాలని బిసి సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం నాయకులు బాదుగున్నల శ్రీనివాస్, విశ్వేశ్వరరావు, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమార్, రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నవంబర్ 10 నుండి గృహగణనతో పాటు జనగణన జరుగుతుందన్నారు. అయితే ఎన్నో ఏళ్ళుగా కులగణన జరపాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. కులగణన జరిగితేనే బిసి కులాలకు మంచి జరుగుతుందన్నారు. ఉద్యోగాలలోనూ, రాజకీయాలలోనూ సమాన హక్కులు జనాభా ప్రాతిపదికన ఇవ్వాలన్నారు. ప్రభుత్వం స్పందించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.



## నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, అక్టోబర్ 28 ప్రభాతవార్త : నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో భారీగా వీస్తున్న గాలులతో ప్రమాదం పొంచి ఉందన్నారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సాధ్యమైనంతవరకు ఇళ్ళ నుండి బయటకు రావద్దన్నారు. ఇప్పటికే పల్నాడురోడ్డులో భారీ వృక్షం నేలకొరిగిందని, పలు ప్రాంతాలలో చెట్లు విరిగిపడుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా సూచనల మేరకు అధికారులు పలు ప్రాంతాల్లో సహాయక చర్యలను చేపడుతున్నారని తెలియజేశారు. అదే విధంగా వాయుగుండం తీరం దాటుతున్న నేపథ్యంలో మరింత ఉధృతంగా వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. సాధారణ ప్రజలు బయటకు వెళ్ళే కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలన్నారు. పొలాలకు, నీటివనరుల వద్దకు వెళ్ళవద్దన్నారు. చెట్లు, విద్యుత్ తీగలు, గోడల దగ్గర నిలబడవద్దన్నారు. ఇంటి తలుపులు, కిటికీలు మూసివేయాలని సూచించారు. బ్యాటరీలు, టార్చిలైట్లు, త్రాగునీరు, ఆహార పదార్థాలు, ప్రాథమిక చికిత్సకు అవసరమైన వస్తువులను, అత్యవసర పరిస్థితులలో అవసరమైన ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు.



## నెల్లూరి హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నరసరావుపేట, అక్టోబర్ 28 ప్రభాతవార్త : నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్స్‌లో అక్టోబర్ 29న ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నెల్లూరి రమేష్ మంగళవారం తెలియజేశారు. బుధవారం ఉదయం 10 గంటల నుండి సత్తెనపల్లిరోడ్డులోని హాస్పటల్స్‌లో ఉచిత వైద్య శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. ఓపి పూర్తిగా ఉచితమని తెలియజేశారు. అన్ని టెస్టులపై 50 శాతం రాయితీ ఉంటుందని తెలియజేశారు. అదే విధంగా ముఖం ఒక వైపుకు తాగుతున్న లక్షణాలు, భుజం, చేయి ఒక ప్రక్కకు లాగే ఆరోగ్య సమస్యలు, మాటలు తడబడటం, బ్రెయిన్ స్ట్రోక్‌ను సకాలంలో గుర్తించాలన్నారు. ఉచిత వైద్య శిబిరానికి హాజరైన అనారోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని డాక్టర్ నెల్లూరి రమేష్ తెలియజేశారు.

## కల్వర్టు పూడికతీత పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి అక్టోబర్28 ప్రభాతవార్త : మొంథా తుఫాన్ వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు. తూఫాన్ పై అధికారులు అప్రమత్తంగా ఉండాలి తుఫాన్ తో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలి. పునరావసర శిబిరాలు సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు అందించాలి తుఫాన్ దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి... విద్యుత్కు అంతరాయం తాగునిటీ సరఫరాకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి అత్యవసరమైతేనే ప్రజలు బయటకు రావాలని సూచనప్రాంతాల్లో ప్రత్యేక అధికారుల నియామకం.. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్ల చర్యలు చేపట్టాలి. అధికారులు అప్రమత్తంగా ఉండాలంటూ శాసన సభ్యులు కన్నా ఆదేశాలు జారీచేశారు..



## చిన్న పరిశ్రమ శాఖలో షెడ్యూల్ కులాల వారికి సబ్సిడీ వేయటంలో అన్యాయం.గార్లపాటి దాసు

క్రోసూరు( అక్టోబర్ 28 ప్రభాతవార్త: ఏపీ ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గార్లపాటి దాసు మంగళవారం పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రం చిన్న పరిశ్రమల వారిని ప్రోత్సహించడానికి చిన్న పరిశ్రమల శాఖ వారి ద్వారా గత రెండు సంవత్సరాలుగా ను 1500 కోట్లు మంజూరు చేసినారు. అయితే చిన్న పరిశ్రమల వారు జనరల్. ఓ బి సి మరియు బిసి.ఎస్టి. ఎస్సీలు గత రెండు సంవత్సరములు క్రితం బ్యాంకుల ద్వారా చిన్న పరిశ్రమలు మరియు జెసిబి లు. టిప్పర్లు. లారీలు. కార్లు. ఆటోలు. లోన్లు తీసుకున్నారు. వారికి ఇప్పటికే సబ్సిడీ పడక బ్యాంకులకు వడ్డీల కట్టలేక తికమక్క అవుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం వారం క్రితం 1500 కోట్లు మంజూరు చేయగా అధిక మొత్తం సబ్సిడీ జనరల్ వారికి ఓబీసీ వారికి బీసీ వారికి ఎస్టీ వారికి సబ్సిడీ మంజూరు చేసి షెడ్యూల్డ్ కులాలు వారికి అరకొరకగా సబ్సిడీ నిధులు విధిల్చి కుటమి ప్రభుత్వం. అధికారులు అన్యాయం చేస్తున్నారు. ఎస్టీ సోదరులు మంగళగిరిలోని చిన్న పరిశ్రమల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేయగా వారికి 500 కోట్లు. గత శనివారం రెండో శనివారం. ఆదివారం రెండు రోజులు సెలవు. అయితే అధికారులు ముడుపులు తీసుకుని సెలవులు పక్కనపెట్టి రాష్ట్రంలోని ఉన్న పరిశ్రమల వారికి. వారి అకౌంట్లకు సబ్సిడీలు కొట్టినారు. రాష్ట్రంలో షెడ్యూల్ కులాలు వారికి మరి ముఖ్యంగా పల్నాడు జిల్లా వారికి సబ్సిడీ నిధుల చెల్లించాలని గార్లపాటి దాస్ డిమాండ్ చేసినారు.



## దొడ్లేరు,హసనాబాద్ లోలెవల్ బ్రిడ్జ్ వద్ద పూడిక తీయింపు పనులు ప్రారంభం.

క్రోసూరు( అక్టోబర్ 28 ప్రభాతవార్త ): పల్నాడు జిల్లా క్రోసూరు మండలం దొడ్లేరు హసనాబాద్ పోయే బ్రిడ్జి దగ్గర లో లేవల్ చప్టా దగ్గర వద్ద అటు నుంచి వస్తున్న మురుగు నీటిలో ఉన్న చెత్త సదానాన్ని బురద మట్టిని జెసిపిల ద్వారా తీయడం జరిగిందని పూడిక తీయడం జరిగిందని క్రోసూరు మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు మొగల్ జాన్ తెలిపారు. అలాగే దొడ్లేరు టు హసనాబాద్ పోయే లో లొలెవల్ బ్రిడ్జి దగ్గర ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరును జెసిపిలతో పేరుకుపోయిన మురికి నీరు చెత్తాచెదారాన్ని శుభ్రపరిచి పక్కకి నెట్టి నీటిని ఉధృతం లేకుండా పంపించటం జరిగిందని లేకపోతే దొడ్లేరు కాలనీలోకి నీరు రావడం జరిగిందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం మొత్తం స్థానిక ఎమ్మార్వో వివి నాగరాజు ఎండిఓ రవికుమార్ సమక్షంలో జరిగిందని టిడిపి పార్టీ మండల అధ్యక్షులు మొగల్ జాన్ విలేకరులకు తెలిపారు.

## వరి పంటలో ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చు

క్రోసూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త : సోమవారం న దొడ్లేరు గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ రైతు కందుల అరుణ వరి పంట వ్యవసాయ క్షేత్రాన్ని ప్రకృతి వ్యవసాయ జిల్లా సిబ్బంది సైదయ్య సందర్శించడం జరిగింది.సైదయ్య మాట్లాడుతూ వరి పంట లో ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని పంట దిగుబడి పెరుగుతుందని తెలియజేయడం జరిగింది . అరుణ వరి పంట వ్యవసాయ క్షేత్రంలో 1మీ 1మీ లో కొన్ని రకాల పరిశీలనలు చేయడం జరిగింది. ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో సరాసరి దిబ్బుకి పిలకల సంఖ్య 25ఉన్నవి, వేరు వ్యవస్థ పొడవు 28ఙ ఉన్నది. దిబ్బు పొడవు 0.65ఙ గా ఉన్నది. ప్రకృతి వ్యవసాయ రైతులు వారి పంటలకు కావలసిన ఎరువులు ( ఘనజీవామృతం, ద్రవ జీవామృతం) క్రిమిసంహారాలు ( దశపరిని కషాయం,నిమాస్త్రం,పుల్లటిమజ్జిగా) వారి స్థాయిలో తయారు చేసుకోవడం వలన పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలియజేయడం జరిగింది. ప్రస్తుతం రాబోతున్న మ్యొంథి తుఫాన్ దృష్ట్యా వరి పంటకు బ్యాక్టీరియా, శిలీంద్రాలకు సంబంధించిన తెగుళ్ల వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రతి రైతు పుల్లటి మజ్జిగ లేదా పేడ మూత్రం ఇంగువ ద్రావణం లేదా ద్రవజీవమృతం పిచికారి చేయాలని సూచించడం జరిగింది.వరి పంట వేసే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా పెట్టుబడులు ఖర్చు తగ్గించుకోవడమే కాకుండా పంట దిగుబడి పెరుగుతుందని పంటకు చీడపీడల ఉధృతి తగ్గుతుందని అంతేకాకుండా పంటకు అధిక ధర లభిస్తుందని తెలియజేయడం జరిగింది. ప్రతి సోమవారం దొడ్లేరు లోని రైతు సేవా కేంద్రంవద్ద ప్రకృతి విక్రయ కేంద్రం నిర్వహించబడుతుందని తెలియజేయడం జరిగింది .ఈ కార్యక్రమానికి డివిజన్ మాస్టర్ ట్రైనర్ జయలక్ష్మి, సావిత్రి, బాజిబి,ఉష పాల్గొనడం జరిగింది.

## మిర్చి, పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం!

సత్తెనపల్లి టౌన్, అక్టోబర్ ప్రభాతవార్త :సత్తెనపల్లి మండలంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికొచ్చే దశలో ఉన్న మిర్చి, పత్తి (కలెక్టింగ్ స్టేజ్‌లో ఉన్న పత్తి రంగు మారి నాణ్యత కోల్పోయే ప్రమాదం), మొక్కజొన్న వంటి కీలక పంటలు దెబ్బతినడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు దెబ్బతిని, పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేకపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. "ప్రకృతి పంజా విసిరింది. అప్పులు చేసి పంటలు సాగు చేస్తే వర్షం పాలు చేసింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి," అని బాధిత రైతులు కోరుతున్నారు.

29-10Pg5 9_29-10Pg5.qxd 29/Oct/25 1:08 AM Page 1



# మూడోసారి పోటీకి ఇష్టమే

## ట్రంప్ మన్‌కీ బాత్!



**వాషింగ్టన్, అక్టోబరు 28:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేసే అంశంపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగపరంగా అవకాశం లేనప్పటికీ, 2028లో మళ్లీ పోటీ చేసే ఆలోచనను ఆయన తోసిపుచ్చలేదు. తన మాజీ వ్యూహకర్త స్టీవ్ బానన్ చేసిన సూచనపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ప్రయాణిస్తూ మీడియాతో మాట్లాడిన ట్రంప్, మూడోసారి పోటీ చేయడాన్ని నేను కచ్చితంగా ఇష్టపడతాను. నాకు మునుపెన్నడూ లేనంత మంచి ఆదరణ ఉందని అన్నారు. అయితే, వెంటనే మాట మార్చుతూ, దాని గురించి నేను నిజంగా ఇంకా ఆలోచించలేదని పేర్కొన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్షపదవి చేపట్టడానికి వీల్లేదు. పాలిటికో కథనం ప్రకారం, ట్రంప్ సన్నిహితుడైన స్టీవ్ బానన్, ఆయన మూడోసారి పోటీ చేయాలని బలంగా వాదిస్తున్నారు. దీనికోసం ఒక ప్రణాళిక కూడా సిద్ధంగా ఉందని తన పాడ్‌కాస్ట్‌లో ఇటీవల బానన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో తన తర్వాత రిపబ్లికన్ పార్టీని నడిపించే నాయకులపై కూడా ట్రంప్ స్పష్టత ఇచ్చారు. 2028 అధ్యక్ష ఎన్నికల బరిలో విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రధాన అభ్యర్థులుగా ఉంటారని సంకేతాలిచ్చారు. మన దగ్గర చాలా మంచి నాయకులు ఉన్నారు. వారిలో ఒకరు ఇక్కడే నిలబడి ఉన్నారంటూ రూబియోను ఉద్దేశించి అన్నారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా అద్భుతమైన వ్యక్తి. వీరిద్దరికీ వ్యతిరేకంగా ఎవరూ పోటీ చేయరని నేను భావిస్తున్నాను అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ట్రంప్ ఆసియా పర్యటనలో ఉన్నారు. మలేషియాలో ఆసియాన్ సదస్సులో పాల్గొన్న ఆయన, తన పర్యటనను విజయవంతంగా ముగించుకుని జపాన్‌లోని టోక్యోకు చేరుకున్నారు. మలేషియా పర్యటన ముగింపు సందర్భంగా అక్కడి అధికారులు, ప్రజలకు ఆయన అభివాదం చేశారు. చాలా గొప్ప, శక్తివంతమైన దేశం మలేషియా నుంచి బయలుదేరుతున్నాను. కీలకమైన వాణిజ్య, రేర్ ఎర్త్ ఒప్పందాలు కుదుర్చుకున్నాం. అంతకుమించి థాయ్‌లాండ్, కంబోడియా మధ్య శాంతి ఒప్పందం కుదిర్చాం. ఇక యుద్ధం లేదు లక్షలాది ప్రాణాలను కాపాడాం. ఇప్పుడు జపాన్‌కు బయలుదేరానని ఆయన ట్రూత్ సోషల్ వేదికగా పోస్ట్ చేశారు.

# సరిహద్దులు మళ్లీ ఉద్రిక్తం



**లీపా లోయలో కాల్పుల విరమణ ఉల్లంఘన**
**మోర్టార్ షెల్లింగ్‌కు తెగబడిన పాక్ రేంజర్లు**

శ్రీనగర్,అక్టోబరు 28: భారత్, పాకిస్తాన్‌ల మధ్య నియంత్రణ రేఖ వెంబడి దాదాపు 5 నెలలుగా నెలకొన్న ప్రశాంతతకు మరోసారి భంగం కలిగింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ ఏడాది మే 10వ తేదీ నుంచి నిశ్శబ్దంగా ఉన్న సరిహద్దు ప్రాంతం తాజాగా అక్టోబర్ 26,27 మధ్య అర్ధరాత్రి కాల్పుల మోతతో దద్దరిల్లింది. నియంత్రణ రేఖ వెంబడి జమ్మూ కాశ్మీర్‌లోని వ్యూహాత్మక ప్రాంతమైన లీపా లోయలో పాకిస్తాన్ సైన్యం ఈ కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడింది. సరిహద్దుల్లోని భారత స్థావరాలను లక్ష్యంగా చేసుకుని పాక్ సైనికులు చిన్న ఆయుధాలతో కాల్పులు జరపడంతో పాటు మోర్టార్ షెల్లింగ్‌కు కూడా తెగబడినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. చాలా కాలం తర్వాత లీపా లోయ వద్ద పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి ఆక్రమణ చొరబాట్లకు కీలకమైన స్థావరంగా ఉంది. పాకిస్తాన్ సైన్యం ప్రారంభించిన దుశ్చర్యకు భారత సైనికులు గట్టిగా బదులిచ్చారు. పాక్ రేంజర్ల రెచ్చగొట్టే కాల్పులను భారత సైనికులు బలంగా తిప్పికొట్టారు. భారత జవాన్ల దీటైన ప్రతిఘటనతో పాకిస్తాన్ సైనికులు తోక ముడిచి వెనక్కి తగ్గక తప్పలేదని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. భారత్ బ్రహ్మోస్ మిస్సైల్స్‌కు పాక్ సైన్యం అవాక్కైంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత నియంత్రణ రేఖ వెంట మే 10వ తేదీ నుంచి శాంతి యుత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు మరణించిన తర్వాత ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ మే 7వ తేదీన చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌కు తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో పాకిస్తాన్ భూభాగంలో లోపల ఉన్న 9 ఉగ్రవాద శిబిరాలను భారత వైమానిక దళం ధ్వంసం చేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ఆపరేషన్ సిందూర్‌లో వందకు పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్ర సంస్థల స్థావరాలు పూర్తిగా నాశనం అయ్యాయి. కూలిన పాక్ ఫైటర్ జెట్లు ఆపరేషన్ సిందూర్ దెబ్బకు తట్టుకోలేకపోయిన పాకిస్తాన్ భారత్‌పై డ్రోన్, క్షిపణి దాడులకు దిగింది. అయినప్పటికీ భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ ఈ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. ఫలితంగా.. మే 8వ తేదీ నుంచి 10వ తేదీ మధ్య ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పాకిస్తాన్‌లోని 11 సైనిక విమాన స్థావరాలపై దాడులు చేయడంతో.. తీవ్రంగా నష్టపోయిన ఇస్లామాబాద్ చివరకు కాల్పుల విరమణ కోసం భారత్‌కు విజ్ఞప్తి చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ స్వయంగా శాంతి కోసం భారత్‌ను అభ్యర్థించిన తర్వాత కూడా తాజాగా లీపా వ్యాలీలో కాల్పుల విరమణను ఉల్లంఘించడం ఆ దేశ వక్రబుద్ధికి, సరిహద్దుల్లో శాంతిని చెడగొట్టాలనే కుట్రకు నిదర్శనంగా నిలుస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఆగస్టులో పూంఛ్ ప్రాంతంలో కూడా ఇలాంటి ఉల్లంఘనలు జరిగాయని వార్తలు వచ్చినా అప్పట్లో భారత సైన్యం వాటిని ఖండించింది. అయితే తాజా లీపా వ్యాలీ ఘటనతో సరిహద్దుల్లో మళ్లీ ఉద్రిక్తత పెరిగింది.

# రజనీకాంత్, ధనుష్ ఇళ్లకు బాంబు బెదిరింపులు!



**చెన్నై, అక్టోబరు 28:** ప్రముఖ తమిళ నటుల ఇళ్లకు బాంబు బెదిరింపులు వస్తున్నాయి. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్, వర్ధమాన నటుడు ధనుష్ ఇళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈమేరకు తైనాంపేట్ పోలీసులకు ఈమెయిళ్లు అందడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఏకంగా రాష్ట్ర డిజిపి కార్యాలయానికే ఈ మెయిళ్లు రావడం విశేషం. ఈ నటుల ఇద్దరి ఇళ్లు కూడా తైనాంపేట్‌పోలీసు పరిధిలో ఉండటంతో వెంటనే కేసులునమోదుచేసి గాలింపు ప్రారంభించారు. అయితే ఇళ్లకువెళ్లిన తర్వాత తమకు బాంబు స్క్వాడ్ అవసరం ఏమీ లేదని చెప్పారని తేలింది. రెండో హెచ్చరిక సాయంత్రం 6.30 గంటలకు వచ్చింది. రజనీకాంత్ టీమ్ మరోసారి సెక్యూరిటీ తనిఖీలను వ్యతిరేకించింది. అలాగే మరోనటుడు ధనుష్‌ఇంటిని పేల్చేస్తామని కూడా ఇదే తరహా మెయిల్ డిజిపికి వచ్చింది. ఆయన కూడా ఇలాంటి సెక్యూరిటీ తనిఖీలు వద్దని నిరాకరించినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవలికాలంలోప్రముఖ వ్యక్తులు అనేకమందికి ఈ తరహా మెయిళ్లు వస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సైబర్‌క్రైమ్ పోలీసులు ఈ వచ్చిన ఈమెయిళ్లను పరిశీలిస్తున్నారు. ఎక్కడినుంచి వచ్చాయన్న వివరాలన ఐపి అడ్రసులను ట్రాకింగ్‌చేస్తున్నట్లు తెలిపారు.

# రాజస్థాన్‌లో ప్రైవేట్ ట్రావెల్ బస్సు దగ్ధం

## ఘటనలో ముగ్గురు మృతి, పలువురికి గాయాలు



**జైపూర్, అక్టోబర్ 28:** కర్నూలులో ఘోర బస్సు ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 19 మంది సజీవదహనమయ్యారు. ఈ ఘటన మరువకముందే దేశంలో మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైంది. రాజస్థాన్‌లో ప్రైవేట్ ట్రావెల్ బస్సు దగ్ధమైంది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడ్డారు. జైపూర్, ఢిల్లీ, జాతీయ రహదారిపై మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఉత్తరప్రదేశ్ నుంచి తోడిలోని ఇటుక బట్టీకి కార్మికులను తీసుకెళుతోంది. జైపూర్ గ్రామీణ జిల్లా షాపురా సబ్ డివిజన్‌లోని మనోహర్‌పూర్ పోలీస్‌స్టేషన్ ప్రాంతం వద్దకు రాగానే ప్రమాదానికి గురైంది. బస్సు రన్నింగ్‌లో ఉండగా హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలాయి. వెంటనే భారీ శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందారు. సుమారు 12 మంది గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో బస్సు మొత్తం దగ్ధమైంది. సమాచారం అందున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఘటనాస్థలి వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# ట్రంప్‌ను 'శాంతి'కి నామినేట్ చేస్తా

**- జపాన్ ప్రధాన మంత్రి సనాయి తకైచి - టోక్యోలో ట్రంప్‌తో చర్చలు**



**టోక్యో, అక్టోబరు 28:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి పురస్కారానికి నామినేట్ చేస్తానని జపాన్ ప్రధానమంత్రి సనాయి తకైచి పేర్కొన్నారు. ఇదే విషయాన్ని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. మంగళవారం ఉదయం టోక్యోలోని అకసకా ప్యాలెస్‌లో ప్రధానమంత్రి తకైచితో ట్రంప్ భేటీ అయ్యారు. ఇరు దేశాల ఆర్థిక, భద్రతా, ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ఈ భేటీ సందర్భంగా, నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ నామినేషన్‌కు తాము మద్దతిస్తామని తకైచీ స్పష్టం చేసినట్లు వైట్‌హౌస్ పేర్కొంది. అయితే, దీనిపై జపాన్ ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ సమావేశంలో అంతర్జాతీయ శాంతి స్థాపన కోసం ట్రంప్ చేస్తున్న కృషిని తకైచీ కొనియాడారు. ముఖ్యంగా థాయ్‌లాండ్- కంబోడియా మధ్య శాంతి ఒప్పందం, గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడంలో ట్రంప్ కీలక పాత్ర పోషించారని ఆమె ప్రశంసించారు. "అధ్యక్షా, మీరు థాయ్‌లాండ్, కంబోడియా మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని సాధించడంలో విజయం సాధించారు.

అలాగే, మధ్యప్రాచ్యంలో మీరు ఇటీవల కుదిర్చిన ఒప్పందం అపూర్వమైనది, చారిత్రాత్మకమైనది" అని తకైచీ అన్నారు. ఆసియాలో అమెరికాకు జపాన్ అత్యంత విశ్వసనీయ మిత్రదేశంగా ఉంది. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ మూలకాలపై ఒప్పందాలు జరిగాయి. ఆసియా పర్యటనలో భాగంగా ట్రంప్ తొలుత మలేషియాలో పర్యటించి ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం

- **200 యూనిట్ల ఉచిత విద్యుత్**
- **మహిళలకు ప్రతినెలా రూ.2,500**
- **ప్రభుత్వం వచ్చిన 20రోజుల్లోనే అమలు**
- **25 హామీలతో మహాకూటమి మేనిఫెస్టో విడుదల**



**పాట్నా, అక్టోబరు 28:** బీహార్‌లోని ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ కూటమి రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం మంగళవారం తన ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేసింది. ప్రభుత్వ ఉద్యోగాలు, మహిళలకు ఆర్థిక సహాయం హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపు ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు నెలనెలా రూ.2,500 ఆర్థిక సహాయం ఇస్తామని పేర్కొంది. అలాగే పాత పెన్షన్ పథకాన్ని అమలు చేస్తామని కూడా మేనిఫెస్టోలో మహా కూటమి హామీ ఇచ్చింది. జీవికా దీదీస్‌కు ప్రభుత్వ ఉద్యోగులుగా శాశ్వత హోదా కల్పిస్తామని కూడా మేనిఫెస్టోలో పేర్కొంది. కాంట్రాక్టు, ఔట్ సోర్స్ కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులు మారుస్తామని హామీనిచ్చింది. దాదాపు 25 హామీలతో "బీహార్ కా తేజస్వి ప్రాణ్ పత్ర" పేరిట మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మహాఘట్ బంధన్ సిఎం అభ్యర్థి, ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్, డిప్యూటీ సిఎం అభ్యర్థి, వికాశ్‌సీల్ ఇసాన్ పార్టీ (విఐపి) చీఫ్ ముకేశ్ సాహని, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పవన్ ఖేరా, సిపిఐ(ఎంఎల్) అగ్రనేత దీపాంకర్ భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ మాట్లాడుతూ, తమ మేనిఫెస్టోలో ఆచరణాత్మక హామీలనే తాము పెట్టామని, ప్రభుత్వ ఖజానాకు ఎలాంటి భారం కాదని పేర్కొన్నారు. అధికార ఎన్‌డిఏ కూటమిపై తేజస్వి విమర్శలు గుప్పించారు. సిఎం నితీశ్‌కుమార్ ఎన్‌డిఏ కూటమిలో బందీ అయిపోయారని, అందుకే సిఎం అభ్యర్థి ఎవరనేది ఇంకా తేల్చడం లేదని ఆర్‌జెడి నేత దుయ్యబట్టారు.

**చిక్కుల్లో ప్రశాంత్ కిశోర్ - బీహార్, బెంగాల్‌లో ఓటరుగా నమోదు - ఇసి నోటీసులు**

ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్ చిక్కుల్లో పడ్డారు. బీహార్‌తోపాటు పశ్చిమబెంగాల్ రెండు రాష్ట్రాల ఓటర్ల జాబితాలో ప్రశాంత్ కిశోర్ పేరు నమోదైంది. బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న భబానీపూర్‌లో 121, కాళీఘాట్ రోడ్ చిరునామాతో ఓటరు జాబితాలో ప్రశాంత్ కుమార్ పేరుంది. 2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కిశోర్ టిఎంసికి రాజకీయ సలహాదారుగా పనిచేసిన విషయం తెలిసింది. బీహార్‌లో కర్గాహార్ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ప్రశాంత్ కిశోర్‌కు ఓటుంది. పికెకు ఇసి నోటీసులు బీహార్‌తో పాటు పశ్చిమబెంగాల్ ఓటర్ల జాబితాలోనూ ఆయన పేరు కనిపించడంతో ఎన్నికల కమిషన్ ఈ చర్యలకు దిగింది. బీహార్‌లో రోహటాస్ జిల్లా ససరాంలోని కర్గాహార్ అసెంబ్లీ నియోజవవర్గం రిటర్నింగ్ అధికారి ఈ నోటీసులు పంపారు. కర్గాహార్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 621లో ఎపిక్ (ఓటర్ ఐడి) నంబర్ 1013123718 కింద ఓటరుగా ఆయన పేరు నమోదైందని, ఇదే సమయంలో పశ్చిమబెంగాల్‌లోని భాబనిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సెయింట్ హెలెన్ స్కూలు పోలింగ్ బూత్‌లో కూడా ఆయన పేరు నమోదై ఉందని ఆ నోటీసులో రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.






# ఢిల్లీ ఎయిర్‌పోర్టులో బస్సుదగ్ధం!

**న్యూఢిల్లీ,అక్టోబరు 28:** ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ మధ్యాహ్నం పెను ప్రమాదం తప్పింది. టెర్మినల్ 3 వద్ద ఎయిరిండియా విమానానికి కొన్ని మీటర్ల దూరంలో ఆగి ఉన్న ఓ బస్సులో అగ్నిప్రమాదం సంభవించింది. బస్సు పూర్తిగా మంటల్లో చిక్కుకుని దగ్ధమైంది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. టెర్మినల్ 3 వద్ద బే 32 సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ బస్సు పలు విమానయాన సంస్థలకు గ్రౌండ్ సర్వీసులు అందించే సాట్స్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే థర్డ్‌పార్టీ సంస్థకు చెందినది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో ప్రయాణికులు ఎవరూ లేరు. సమాచారం అందుకున్న వెంటనే విమానాశ్రయ అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి, నిమిషాల వ్యవధిలోనే మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ యాజమాన్యం స్పందించింది. ఇదొక సాధారణ ఘటనేనని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఎక్స్ వేదికగా తెలిపింది. "ప్రయాణికులు, సిబ్బంది భద్రతకే మా ప్రథమ ప్రాధాన్యత. విమాన సర్వీసులన్నీ యథాతథంగా కొనసాగుతున్నాయి" అని స్పష్టం చేసింది. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులు గానీ, లగేజీ గానీ లేదని పోలీసులు తెలిపారు. అయితే, బస్సులో డ్రైవర్ మాత్రమే ఉన్నాడని, అతనికి ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై సాట్స్ సంస్థ దర్యాప్తు ప్రారంభించిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రమాద కారణాలను తెలుసుకునేందుకు బస్సును క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

# రీల్స్ చేయబోయి నదిలోపడిన బిజెపి ఎమ్మెల్యే




**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** దేశరాజధాని ఢిల్లీలో అధికార బీజేపీకి చెందిన ఓ ఎమ్మెల్యేకి ప్రమాదకర అనుభవం ఎదురైంది. యమునా నది శుభ్రతపై రీల్స్ చేస్తూ కాలుజారి నదిలో పడిపోయారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఛట్ పూజ వేడుకల నేపథ్యంలో యమునా నది శుభ్రతపై అధికార బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోన్న విషయం తెలిసిందే. తాము అధికారం చేపట్టిన తర్వాత యమునా శుభ్రమైందంటూ బీజేపీ ప్రచారం చేస్తోంది. అయితే, బీజేపీ ప్రచారాన్ని ఆప్ తిప్పికొడుతోంది. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. ఈ క్రమంలో యమునా నది శుభ్రతపై అవగాహన కల్పించేందుకు పత్పర్‌గంజ్ బీజేపీ ఎమ్మెల్యే రవీందర్ సింగ్ నేగి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగానే నది ఒడ్డున రీల్ చిత్రీకరిస్తుండగా.. అదుపుతప్పి నదిలోకి పడిపోయారు. 19 సెకన్ల నిడివి ఉన్న ఆ వీడియోలో, ఎమ్మెల్యే నేగి రెండు బాటిళ్లను చేతిలో పట్టుకుని యమునా నది ఒడ్డున మోకాళ్లపై కూర్చుని ఉంటారు. అక్కడి నుంచి లేవడానికి ప్రయత్నించగా అదుపుతప్పి ఒక్కసారిగా నీటిలో పడిపోయారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. దీనిపై ఆప్ నేత సంజీవ్ ఝా తీవ్రంగా స్పందిస్తూవ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీజేపీ నాయకులకు తప్పుడు వాగ్దానాలు చేయడం ఓ వృత్తిగా మారిందంటూ వ్యాఖ్యానించారు. బహుశా అబద్ధాలు, ప్రచార రాజకీయాలతో విసిగిపోయిన యమునా స్వయంగా వారిని పిలిపించుకున్నట్టుంది అన్నారు.

# అమెరికా, రష్యా మధ్య ఫ్లుటోనియం ఒప్పందం రద్దుచేసిన పుతిన్

**మాస్కో, అక్టోబర్ 28:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు రష్యా ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్ గట్టి షాకిచ్చారు. ఉక్రెయిన్ తో యుద్ధాన్ని ఆపేయాలన్న తన సూచనను పెడచెవిన పెట్టాడని పుతిన్ పై ట్రంప్ ఇప్పటికే ఆగ్రహంగా ఉ న్నారు. ఈ క్రమంలోనే అమెరికాతో గతంలో రష్యా కుదుర్చుకున్న ఫ్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ రద్దు చేసుకున్నారు. దీనికి సంబంధించిన చట్టంపై తాజాగా పుతిన్ సంతకం చేశారు. ఈ పరిణామం మళ్లీ అణు ఉద్రిక్తతలకు దారి తీస్తుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఒబామా హయాం లోనే2000 సంవత్సరంలో అమెరికా, రష్యాల మధ్య ఫ్లుటోనియం నిర్వహణపై ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత 2010లో ఈ ఒప్పందాన్ని సవరించారు. దీని ప్రకారం రష్యా తమ వద్ద నిల్వ ఉన్న 34 మెట్రిక్ టన్నుల ఫ్లుటోనియంను అణ్వాయుధాల తయా రీకి వాడ కూడదు. ఈ నిల్వలను పౌర అణు విద్యుత్ తయా రీ కోసం వినియోగించుకోవాలని ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. దీంతో దాదాపు 17 వేల అణ్వాయుధాల తయారీని అడ్డుకున్నట్లు అప్పట్లో అమెరికా అధికారులు పేర్కొన్నారు. అయితే, ఒబామా హయాంలో 2016 సంవత్సరం అమెరికా, రష్యాల మధ్య సంబంధాలు దెబ్బ తిన్నాయి. దీంతో ఫ్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ నిలిపివేశారు. తాజాగా ఈ అగ్రిమెంట్‌ను పూర్తిగా రద్దు చేసుకుంటూ చట్టంపై సంతకం చేశారు.

# సంక్షిప్తంగా..

## తుర్కియేలో తీవ్రస్థాయి భూకంపం



**అంకారా, అక్టోబరు 28:** తుర్కియేలో మరోసారి భారీ భూకంపం సంభవించింది. నేటి వేకువజామున దేశంలోని పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.1గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భూప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. గాఢ నిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా భూమి కంపించడంతో ఉలిక్కిపడి లేచారు. ఏం జరుగుతోందో తెలియని ఆందోళనతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంప కేంద్రం, ప్రభావితమైన ప్రాంతాల పూర్తి వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణ నష్టం జరిగినట్లు సమాచారం అందనప్పటికీ, కొన్ని భవనాలకు స్వల్ప నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. భూకంపం సంభవించిన వెంటనే అప్రమత్తమైన అధికార యంత్రాంగం సహాయక చర్యలను ప్రారంభించింది.

## ఆర్ఎస్ఎస్‌పై కర్ణాటక సర్కార్‌కు హైకోర్టు షాక్

**బెంగళూరు, అక్టోబరు 28:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకలాపాల వ్యవహారంలో కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో ఆరెస్సెస్ తదితర సంస్థల కార్యకలాపాలకు ముందస్తు అనుమతిని తప్పనిసరి చేస్తూ సిద్ధరామయ్య ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు మంగళవారం మధ్యంతర స్టే విధించింది. తదుపరి విచారణను హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ నవంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. ఆరెస్సెస్ ఏర్పడి వందేళ్లయిన నేపథ్యంలో భారీస్థాయిలో కవాతులు నిర్వహించేందుకు రాష్ట్ర బీజేపీ నాయకులు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో సిద్ధరామయ్య ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు సంస్థలు, సంఘాలు తమ కార్యకలాపాల కోసం ప్రభుత్వ మైదానాలు, రహదారులు, బహిరంగ ప్రదేశాలు, విద్యాసంస్థల ఆవరణలను వినియోగించుకోవాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి చేసింది.

## దుబాయ్‌లో ఎన్ఆర్ఐల కోసం పాస్‌పోర్టు సేవా ప్రోగ్రామ్

**దుబాయ్, అక్టోబరు 28:** ఎన్ఆర్ఐల కోసం దుబాయ్‌లోని భారత కాన్సులేట్ జనరల్.. పాస్‌పోర్టు సేవా ప్రోగ్రామ్ 2.0ను ఆవిష్కరించింది. ఆధునికీకరించిన ఈ ప్రోగ్రామ్ మంగళవారం నుంచి అమలులోకి వచ్చింది. పాస్‌పోర్టు సేవలను రిజిస్టర్ చేసుకోవడానికి, దరఖాస్తు చేసుకోవడానికి దరఖాస్తుదారులు కొత్తగా లాంచ్ అయిన ఆన్‌లైన్ పోర్టల్‌ను వినియోగించాల్సి ఉంటుంది. అప్లికేషన్ ప్రాసెస్, సర్వీస్ సెంటర్లలో ఎదురుచూపులు తగ్గించేందుకు ఈ సేవను అందుబాటులోకి తీసుకువచ్చారు. పాస్‌పోర్ట్ సేవా ప్రోగ్రామ్ 2.0 కింద ఇ-పాస్‌పోర్టులను తీసుకువచ్చారు. ఈ సాంకేతికతతో ఇమిగ్రేషన్ క్లియరెన్స్‌లు వేగవంతం కానున్నాయి. భారత్ అందించే సేవలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మారనున్నాయి. వీసా అవసరాలకు తగ్గట్టుగా ఫొటో, సంతకం, ఇతర పత్రాలను నేరుగా ఆ పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేసుకోవచ్చు. దాంతో బిఎల్ఎస్ ఇంటర్నేషనల్ సెంటర్లలో ప్రాసెసింగ్ టైమ్ తగ్గే అవకాశం ఉంటుంది.

## కెనడాలో సిక్కునేత దారుణ హత్య

**టొరంటో, అక్టోబరు 28:** కెనడాలో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. భారత సంతతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, కానమ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు దర్శన్ సింగ్ సాహ్సి (68) కాల్పుల్లో మరణించారు. బ్రిటిష్ కొలంబియాలోని అబాట్స్‌ఫోర్డ్‌లో ఆయన నివాసం వెలుపల ఈ ఘటన జరిగింది. కారులో కూర్చుంటున్న సమయంలో ఓ దుండగుడు ఆయనపై కాల్పులు జరిపి పారిపోయినట్లు తెలుస్తోంది. అబాట్స్‌ఫోర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్ వివరాల ప్రకారం, సోమవారం ఉదయం 9:22 గంటలకు రిడ్జ్‌వ్యూ డ్రైవ్‌లో కాల్పులు జరిగినట్లు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేసరికి, కారులో ఉన్న సాహ్సి తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ప్రథమ చికిత్స సిబ్బంది వెంటనే వైద్య సహాయం అందించినప్పటికీ ఫలితం లేకపోయింది.

## ఢిల్లీ బయట రిజిస్ట్రేషన్ వాహనాలకు ఇకపై నో ఎంట్రీ!

**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** దేశ రాజధాని ఢిల్లీ లోకి నగరం బయట రిజిస్టర్ అయిన కమర్షియల్ వాహనాల ప్రవేశంపై నిషేధం విధించారు. నవంబర్ 1 నుంచి ఈ నిషేధం అమల్లోకి వస్తుందని అధికారులు తెలిపారు. 'ది కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే బీఎస్6 నార్మ్స్ కు లోబడి ఉన్న వాహనాలను మాత్రం ఈ నిషేధం నుంచి మినహాయించారు. బీఎస్6 నార్మ్స్‌కు లోబడి వాహనాలు కాలుష్య కారకాలను తక్కువగా విడుదల చేస్తాయని, కాలుష్య నియంత్రణలో ఇవి తోడ్పడుతాయని అధికారులు చెప్పారు. ప్రమాణాలకు లోబడి బీఎస్6 వాహనాలకు 2026 అక్టోబర్ 31 వరకు మాత్రమే ఢిల్లీలోకి అనుమతి ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్6 కమర్షియల్ వాహనాలతోపాటు సీఎన్‌జీ, ఎల్ఎన్‌జీ, ఎలక్ట్రిక్ వాహనాలకు కూడా తాజా నిషేధం నుంచి మినహాయింపు ఇచ్చారు.

29-10pg6exHMNWJQE 10_29-10pg6exHMNWJQE.qxd 29/Oct/25 1:09 AM Page 1





## తుపాను నష్టాన్ని తగ్గించాలి

నూజివీడు, అక్టోబరు 28 ప్రభాతవార్త: తుపాను సహాయక కార్యక్రమాలలో ప్రభుత్వ ప్రతిష్ట ఇనుమడింపచేసేలా అధికార యంత్రాంగం పనిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారధి అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళ వారం సాయంత్రం తుపాన్ పరిస్థితి, సహాయక చర్యలపై అధికారులతో మంత్రి పార్థసారధి సమీక్షి ంచారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ... జిల్లాలో భారీ వర్షాల కారణంగా ముంపు ప్రమాదం ఉన్న ప్రతీ ప్రాంతంలోని ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని, వారికి నాణ్యమైన భోజనం, వసతి అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టాలు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. తుపాన్ కారణంగా జరిగిన పంట నష్టం అంచనాలను రూపొందించాలన్నారు. కూలిన చెట్లను వెంటనే తొలగిం చేందుకు చర్యలు తీసుకోవాలని, తెగిన విద్యుత్ వైర్ల కారణంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కూలిన విద్యుత్ స్తంభాల స్థానే కొత్త స్తంభాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ బొల్లపల్లి వినూత్న, డిఎస్పీ కె.వి.వి. ఎన్.వి. ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులను కాపాడుకుందాం

### రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

సచివాలయం, అక్టోబరు 28 ప్రభాతవార్త: మొంథా తుపాన్ నుంచి బిసి హాస్టళ్ళ, ఎంజెపి స్కూళ్ళో చదువుకునే విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకుందామని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఎంజెపి స్కూల్ కార్యదర్శి మాధవీలతతో మంత్రి సవిత మంగళవారం సమావేశమయ్యారు. బిసి హాస్టళ్ల విద్యార్థుల రక్షణకు తీసుకున్న చర్యల గురించి జిల్లాల వారీగా మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థులకు కాచి చల్లారి ్చన నీరు, తాజా ఆహారం మాత్రమే అందివ్వాలన్నారు. విద్యుత్ కోతలుండే అవకాశముందని, ఇన్వర్టర్లను పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. టార్చిలైట్లు, క్యాండిల్స్, అగ్గి పెట్టెలను పెద్దమొత్తంలో ముందు జాగ్రత్తగా సమకూర్చుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై నివేదిక ఇవ్వాలని బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణను, ఎంజేపిస్కూల్ కార్యదర్శి మాధవీలతను మంత్రి సవిత ఆదేశించారు. హాస్టళ్ళ విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాలని, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని స్పష్టం చేశారు.



సున్నపు కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

## మొంథా తుపానుతో స్తంభించిన జనజీవనం

శ్రీకాళహస్తి, అక్టోబరు 28 ప్రభాతవార్త: తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించింది. మంగళవారం ఉదయం నుంచి ఒకటే ధారగా వర్షం కురుస్తుంది. దాంతో పట్టణంలో ఎప్పుడూ రద్దీ ఉండే వ్యాపార కూడళ్లు మూతపడ్డాయి. కాలువలు పొంగి రాకపోకలకు అంతరాయం కల్గింది. తుపాను ప్రభావం తొట్టంబేడు, ఏర్పేడు మండలాల్లో అధికంగా కనబడింది. సదాశివ కోన ప్రాజెక్టు నిండింది. అలాగే స్వర్ణముఖి నుంచి సుమారు 7వేల క్యూసెక్కుల నీరు సాగుతుండగా కాళంగి రిజర్వాయర్‌కు సంబంధించి గేట్లు, మల్లిమడుగు డ్యాంకు సంబంధించి గేట్లు తెరవటంతో పలు రాకపోకలకు అంతరాయంగా మారింది. ఏర్పేడు మండలంలోని పలు గిరిజన కాలనీల్లోని ఇళ్ళు నేలకొరిగాయి. పలు రోడ్లు ధ్వంసమయ్యాయి. రాకపోకలకు వీలు కాని విధంగా మారాయి. అక్టోబర్ నెల చివరి వారంలో ఈ ప్రాంతాల్లో 580 మి.మీల వర్షం నమోదైంది. దాంతో చెరువులు నిండాయి. అయితే తుపానుతో తల్లడిల్లుతున్న ప్రజలను పలకరిస్తూ దెబ్బతిన్న చెరువులు రోడ్లను వర్షంలోనే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పర్యటించి పరిశీలించారు. అధికారులకు సూచనలు ఇచ్చారు. ఏర్పేడు మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. ముళ్ళపూడి, దొమ్మరపాళెం ప్రాంతాల్లో నిరుపేదలను శాసనసభ్యుడు పలకరించారు. సాయంత్రం వర్షంలోనే సున్నపు కాలువ స్థితిని ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పరిశీలించారు. పలు చెరువులను పరిశీలించారు. ఎమ్మెల్యేతో పాటు రంగినేని చెంచయ్యనాయుడు, అంక్షితల కృష్ణయాదవ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి అధికారులున్నారు.

# పరిపాలనా సౌలభ్యం కోసమే జిల్లాల పునర్ వ్యవస్థీకరణ



- ప్రజల ఆకాంక్షల మేరకు విభజన
- మంత్రివర్గ ఉపసంఘంతో సీఎం
- గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతోనే సమస్య: చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో చేపట్టిన జిల్లాల పునర్ వ్యవస్థీకరణతో ప్రజల ఆకాంక్షలు నెరవేరి, పరిపాలనా సౌలభ్యం కలగాలని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటుతో తలెత్తిన సమస్యలు పరిష్కారం కావాలని, అదే సమయంలో కొత్త ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ఈ ఏడాది జులై 22న ఏడుగురు సభ్యులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిపై సచివాలయంలో నిర్వహించిన సమీక్షకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు... ఉప సంఘంలోని మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, అనిత, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్థన్ రెడ్డి హాజరయ్యారు. మంత్రులు, జిల్లా కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రాథమిక నివేదిక సిద్ధం చేశామని మంత్రులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటును సరిదిద్దేలా జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపైనా, కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపైనా సీఎం చర్చించారు.

### గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతోనే సమస్య

కొత్త జిల్లాల ఏర్పాటుపై గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం ప్రాంతీయ విభేదాలకు కారణమైందని, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మరోవైపు భవిష్యత్‌లో చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని జిల్లాల పునర్ వ్యవస్థీకరణ జరగాలని నిర్దేశించారు. రెవెన్యూ డివిజన్ల పునర్వ్యవస్థీకరణను ప్రత్యేకంగా చేపట్టాలన్నారు. పోలవరం పూర్తయిన తర్వాత ముంపు మండలాల ప్రజలు ఏ రెవెన్యూ వార్డు, ఏ నియోజకవర్గంలో ఉంటారనేదానిపైనా అధ్యయనం చేసి... దానికి అనుగుణంగా పునర్ వ్యవస్థీకరణ జరపాలన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు ఆ ప్రాంత చిరకాల వాంఛ అని సీఎం ప్రస్తావించారు. తమ పరిశీలనకు వచ్చిన అంశాలను, ఆయా వర్గాల అభిప్రాయాలను మంత్రులు ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంగళవారం జరిగిన తొలి సమావేశంలో పలు అంశాలు చర్చించిన సీఎం... ప్రతిపాదనలపై తదుపరి చర్చలకు వారంలో మరోసారి సమావేశం అవుదామని తెలిపారు.

# అంతర్గత జలమార్గాల అభివృద్ధికి చర్యలు

- పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి




అమరావతి, అక్టోబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియాతో ఎపి ఇన్ వాటర్ వేస్ అథారిటీ కుదుర్చుకున్న ఒప్పందం వల్ల రాష్ట్రంలో అంతర్గత జల మార్గాల అభివృద్ధికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. ముంబయిలో జరుగుతున్న ఇండియా మారిటైమ్ వీక్-2025లో భాగంగా మంగళవారం ఈ ఒప్పందం జరిగినట్లు మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అంతర్గత జలమార్గాల అభివృద్ధితో సరుకు రవాణా వ్యయం భారీగా తగ్గనుందని తెలిపారు. ఈ ఒప్పందం వల్ల ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ.150 కోట్లకుపైగా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు సముఖత వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం వెస్సెల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (విటిఎంఎస్), నావిగేషనల్ ఎయిడ్‌లను అందించాల్సి ఉండగా, రివర్ క్రూయిజ్ టూరిజం విటిఎంఎస్‌కు ఆన్‌షోర్ సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం భూమిని కేటాయించాల్సి ఉందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి రాష్ట్రంలో అంతర్గత జలమార్గాలను బలోపేతం చేయడమే లక్ష ్యంగా, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా దాదాపు రూ.150 కోట్లకు పైగా ఏపీలో పెట్టుబడి పెట్టేందుకు ఈ ఎంవోయూ ద్వారా అంగీకారం...

ఈ ఎంవోయూ ద్వారా కేంద్ర ప్రభుత్వం వెస్సెల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (విటిఎంఎస్), నావిగేషనల్ ఎయిడ్‌లను అందించాల్సి ఉండగా.. రివర్ క్రూయిజ్ టూరిజం, విటిఎంఎస్ ఆన్ షోర్ సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన భూమిని అందించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో జాతీయ జలమార్గాలలో డ్రెడ్జింగ్‌కు కేంద్రం సొంత నిధుల ద్వారా లేదా ఆసక్తిగల ఆపరేటర్‌తో పిపిపి ఏర్పాటు చేయడంతో అవసరమైన ఫెయిర్‌వేను అందించాల్సి ఉండగా.. డ్రెడ్జింగ్ మెటీరియల్‌ను డంపింగ్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన భూమిని చూపించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని జాతీయ జలమార్గాలలో రివర్ క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి కేంద్రం తగిన సహకారం అందించాల్సి ఉండగా.. ప్రతిపాదిత రివర్ క్రూయిజ్ టెర్మినల్స్, స్టేషన్లకు చివరి మైలు కనెక్టివిటీని రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సి ఉందన్నారు. నిబంధనల మేరకు అంతర్గత జల మార్గాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఓడలు ట్రాఫిక్‌ను నియంత్రించాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ ఎం.టి. కృష్ణబాబు, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, విశాఖ పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే, ఎపి ఎయిర్ పోర్టు అథారిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి ప్రవీణాదిత్య, మారిటైమ్ బోర్డు సిఇఒ అభిషేక్ కుమార్, ఎపి ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఛైర్మన్ జడ్. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### నవంబరు 10 నుంచి

# జనగణన

#### - రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, అక్టోబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: 2027 జనాభా లెక్కల సేకరణలో భాగంగా నవంబరు 10 నుండి 30వ తేదీ వరకూ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ఎంపిక చేయబడిన ప్రాంతాల్లో హౌస్ లిస్టింగ్ మరియు హౌసింగ్ సెన్సస్ ప్రక్రియను చేపట్టనున్నట్టు కేంద్ర రిజిస్ట్రార్ జనరల్ మరియు సెన్సస్ కమీషనర్ నోటిఫికేషన్ జారీ చేయగా అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం జిఓఎంస్ సంఖ్య 114 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. సెన్సస్ 2027 భారత జనాభా గణన కోసం ప్రీటెస్ట్ (మొదటి దశ ఇళ్ల జాబితా మరియు గృహ గణన) నిర్వహణకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. జనాభా లెక్కల చట్టం, 1948 (1948లో 37) లోని సెక్షన్ 17తి ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, 1990 జనాభా లెక్కల నియమాల్లోని నిబంధన 6దీ తో చదవబడిన కేంద్ర ప్రభుత్వం, 2027 భారత జనాభా లెక్కల మొదటి దశ ముందస్తు పరీక్ష నిర్వహణ కోసం ఆ చట్టంలోని నిబంధనలను దీని ద్వారా పొడిగించింది. ఎంపిక చేయబడిన నమూనా ప్రాంతాలలో గృహ జాబితా మరియు గృహ గణన అయిన భారత జనాభా లెక్కల మొదటి దశ ముందస్తు పరీక్ష నవంబర్ 10 నుండి30 వరకు అన్ని రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో నిర్వహించబడుతుంది. ఈ నోటిఫికేషన్‌కు అనుగుణంగా నవంబర్ 1 నుండి 7 వరకు స్వీయ గణన కోసం కూడా ఒక ఎంపిక ఉంటుంది.

# ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్ల కల్పనపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

- కర్ణాటకలో అమలు తీరును అధ్యయనం చేసి నివేదిక అందజేయాలని హైకోర్టు ఆదేశం




విజయవాడ, అక్టోబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: ఉద్యోగాల్లో ట్రాన్స్ జెండర్లకు రిజర్వేషన్ల కల్పనపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్రానికి ఆదేశించింది. ట్రాన్స్ జెండర్లకు కర్ణాటకలో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఒక శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నందున రాష్ట్రంలోనూ అదే తరహా నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని చెప్పింది. కర్ణాటకలో అమలు తీరును అధ్యయనం చేసి, రిజర్వేషన్ కల్పనపై నివేదిక అందజేయాలంది. విచారణను 4 వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ ఎ హరిహరనాథ శర్మతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. 2018 నవంబర్లో జారీ చేసిన ఎస్ఐ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో ట్రాన్స్ జెండర్లకు రిజర్వేషన్ కల్పన అంశం లేదంటూ ట్రాన్స్ జెండర్ గంగా భవానీ ఆ తర్వాత ఏడాది హైకోర్టును ఆశ్రయించారు. ఎస్ఐ పోస్టుకు ఇచ్చిన దరఖాస్తు కాలమ్‌లో స్త్రీ, పురుష ఐచ్ఛికాలు మాత్రమే ఉన్నాయని, ట్రాన్స్ జెండర్ కాలమ్ లేదని, దీంతో తాను స్త్రీగా ఐచ్ఛికం ఇవ్వాల్సి వచ్చిందని భవానీ పిటిషన్‌లో వివరించారు. రాత పరీక్షలో 35 శాతం మార్కులు వచ్చినప్పటికీ అధికారులు తదుపరి ప్రక్రియకు తనను అనర్హురాలిగా ప్రకటించారన్నారు. దీనిపై పిటిషన్‌ను సింగిల్ జడ్జి కొట్టేయడంతో అప్పీల్ దాఖలు చేయాల్సి వచ్చిందని వివరించారు. గంగా భవానీకి ఉద్యోగం కల్పించే విషయంలో నిర్ణయం తీసుకోవాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజీతిని గతేడాది బెంచ్ ఆదేశించింది. ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్ వాదిస్తూ, పిటిషనర్‌కు 28 శాతమే మాత్రమే మార్కులు వచ్చాయన్నారు. అర్హతకు 35 శాతం మార్కులు రావాలన్నారు. కర్ణాటకలో ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్ జెండర్లకు ఒక శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని చెప్పారు.

# ఢిల్లీలో కృత్రిమ వర్షం


### క్లౌడ్ సీడింగ్ ప్రక్రియ పూర్తి చేసిన ప్రభుత్వం



న్యూఢిల్లీ, అక్టోబరు 28: దేశ రాజధాని ఢిల్లీని తీవ్ర వాయుకాలుష్యం వేధిస్తోంది. దీపావళి అనంతరం పరిస్థితులు మరింత దిగజారాయి. మంగళవారం ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ 306గా నమోదు అయినట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు వెల్లడించింది. ఇది తీవ్రమైన కాలుష్య కేటగిరిలోకి వస్తుంది. ఈ నేపథ్యంలో కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు స్థానికంగా కృత్రిమ వర్షం కురిపించేందుకు ఢిల్లీ ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా క్లౌడ్ సీడింగ్ ప్రక్రియను పూర్తి చేసింది. ఐఐటి కాన్పూర్ నుంచి బయల్దేరిన ఎయిర్ క్రాఫ్ట్ సిల్వర్ అయోడైడ్, పొటాసియం అయోడైడ్ లాంటి రసాయన ఉత్ప్రేరకాలను వివిధ ప్రాంతాల్లోని మేఘాలపై చల్లి క్లౌడ్ సీడింగ్ ప్రక్రియను పూర్తి చేసింది. దీంతో మరికొన్ని గంటల్లో వర్షం పడే అవకాశం ఉంది. నగరంలో అయిదు క్లౌడ్ సీడింగ్ ట్రయల్స్ నిర్వహించడానికి ఢిల్లీ ప్రభుత్వం సెప్టెంబర్ 25న ఐఐటి కాన్పూర్‌తో ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం అక్టోబర్ 1 నవంబర్ 30 మధ్య ఎప్పుడైనా ట్రయల్స్ నిర్వహించడానికి పౌర విమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ అనుమతిచ్చింది. ఈ ప్రక్రియను నిర్వహించడానికి కావాల్సిన రూ.3.21 కోట్ల బడ్జెట్‌ను ఢిల్లీ మంత్రివర్గం మేలో ఆమోదించింది. అయితే ప్రతికూల వాతావరణం, రుతుపవన పరిస్థితుల కారణంగా ఈ ప్రక్రియ పలుమార్లు వాయిదా పడింది. తొలుత శాస్త్రవేత్తలు కృత్రిమ వర్షానికి అనువైన మేఘాలను గుర్తిస్తారు. వాటిలో సరిపడా తేమ ఉంటుంది. కానీ, వర్షించేందుకు అనువైన పరిస్థితులు ఉండవు. అలాంటి సందర్భంలో సిల్వర్ అయోడైడ్, పొటాషియం అయోడైడ్ లాంటి రసాయన ఉత్ప్రేరకాలను మేఘాలపై చల్లి క్లౌడ్ సీడింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఇవి మేఘాల్లోని తేమను కరిగించి, వర్షపు బిందువుల రూపంలో కింద పడేందుకు సహకరిస్తాయి. కొన్నిసార్లు పొడి మంచును కూడా వినియోగిస్తారు. దీనివల్ల మేఘాలు చల్లబడి వర్షం కురిసేందుకు వీలుంటుంది.

# ప్రయాణికుల భద్రతపై దృష్టి కేంద్రీకరించాలి

### మొంథా తుపాన్ సంసిద్ధతపై దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ సమీక్ష




హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 28 ప్రభాతవార్త: ప్రయాణికులకు ఉత్తమ భద్రతను కల్పించే ప్రయత్నాలపై దృష్టి పెట్టాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులకు సూచించారు. మొంథా తుపాను పరిస్థితిని ఎదుర్కోవడానికి సంసిద్ధత దిశగా రైలు కార్యకలాపాల భద్రత, కార్యాచరణ ప్రణాళికపై మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుండి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాష్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతో పాటు మొత్తం 6 డివిజన్‌లైన సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి.ఆర్.ఏంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ రాబోయే మోంతా తుఫాన్ దృష్ట్యా అన్ని విభాగాల ప్రధానాధిపతులతోపాటు పాటు ముఖ్యంగా విజయవాడ, గుంటూరు డివిజన్లతో కూడా వివరణాత్మక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ తుఫానును ఎదుర్కో వడానికి రైల్వేలు తీసుకుంటున్న వివిధ చర్యలను సమీక్షించారు. వివిధ డిపోలలో రుతుపవనాల సంసిద్ధత కోసం చేసిన నిల్వల స్థితిని ఆయన సమీక్షిం చారు. వివిధ ప్రదేశాలలో తగినంత నిల్వలను మోహరించాలని అధికారులను ఆదేశించారు. తుఫాను మార్గాన్ని నిశితంగా పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్) బృందాలతో సన్నిహితంగా వ్యవహరించి, ట్రాక్ మరియు రైలు కార్యకలాపాల భద్రతను నిర్ధారించడానికి ఈ విభాగంలో రైల్వే ప్రభావిత ట్యాంకుల స్థానాన్ని పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రభావితమయ్యే విభాగాలలో ట్రాక్‌లపై పెట్రోలింగ్ ఉండేలా చూడాలని కూడా ఆయన ఆదేశించారు. వాస్తవ సమయ సమాచారాన్ని పొందడానికి అన్ని వంతెనలు, ప్రదేశాలలో స్టేషనరీ వాచ్‌మెన్‌లను కూడా నియమించాలని తెలిపారు.

### ఎంప్లాయీ ఆఫ్ ది మంత్ అవార్డులను అందజేసిన జిఎం

జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సిబ్బందికి 'ఎంప్లాయీ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డుగ్రహీతలలో స్టేషన్ మాస్టర్స్, లోకో పైలట్లు, పాయింట్స్ మ్యాన్, కీ మ్యాన్ వంటి వంటి వివిధ కేటగిరి లకు చెందినవారు ఉన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ అవార్డు గ్రహీతలను అభినందించారు. వారి విధులను అత్యంత అంకితభావంతో నిర్వర్తించడంలో వారి నిబద్ధతను అభినందించారు.

# రాజకీయ ఉద్దేశంతో ఇసి నిర్ణయాలు

- 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ అమలు నిర్ణయం సరైంది కాదు
- సిపిఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కరత్




హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త: జాతీయ ఎన్నికల కమిషన్ (ఇసిఐ) రాజకీయ ఉద్దేశంతో నిర్ణయాలు తీసుకుంటోందని, 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను అమలు చేయాలని నిర్ణయించడం సరైంది కాదని సిపిఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కరత్ విమర్శించారు. ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే ఇచ్చిందనీ, ఇంకా తుదితీర్పును వెల్లడిం చలేదని గుర్తు చేశారు. ఇసి స్వతంత్రంగా వ్యవహరిం చాలనీ, ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 23 నుంచి హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమైన సిపిఎం అఖిల భారతస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ప్రకాశ్‌కరత్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవ డంతో పాటు రాజకీ యంగా, సైద్ధాంతికంగా బలోపేతం కావాలన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ, హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. రాజ్యాంగ వ్యవస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గుప్పె ట్లో పెట్టుకుందని విమ ర్శించారు. మోడీ ప్రభు త్వం అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ నిర్వ హించాలని ఇసి ప్రకటిం చిందని, రెండు నెలల క్రితం ఎస్ఐఆర్‌ను బీహార్ లో నిర్వహించిందని గుర్తుచేసిన ప్రకాశ్‌కరత్.. లౌకిక, ప్రతిపక్ష పార్టీలన్నీ ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశాయన్నారు. ఇసి తీరుపై అనుమానాలు వస్తున్నాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు సిద్ధాంత, రాజకీయ అవగాహనను పెంచడం కోసమే ఈ శిక్షణ తరగతులను నిర్వహించామని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు చెప్పారు. రాబోయే కాలంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు తమ పార్టీ శ్రేణులను సంసిద్ధం చేస్తామన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయి లను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు బకాయి లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న విద్యార్థి సంఘాల రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు.

29-10P g7exHMNWJQE- 11 GNT_29-10P g7exHMNWJQE-1111.qxd 29/Oct/25 1:23 AM Page 1



# నేటి నుంచే పత్తి కొనుగోళ్లు

**● కనీస మద్దతు ధర రూ.8,110 ● 30 సిసిఐ కొనుగోలు ఏర్పాటు ● మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి**

విజయవాడ అక్టోబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర రైతాంగానికి ఉపశమనం కల్పించేలా, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలను బుధవారం నుంచే ప్రారంభించాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం మెంథా తుపాను తీవ్రత నేపథ్యంలో, రైతులు నష్టపోకుండా ఉండేందుకు, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 30 కొనుగోలు కేంద్రాలలో తక్షణమే ప్రత్తి సేకరణ చేపట్టాలని సిసిఐ, సంబంధిత అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, 2025-26 సంవత్సరానికి 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగైనట్లు, సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాలుకు రూ. 8,110/ కనీస మద్దతు ధరను రైతులకు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పత్తి అమ్ముకోవాలనుకునే రైతులు కొనుగోలు ప్రక్రియను సక్రమంగా పాటించాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.



**రైతులు ఆందోళన చెందవద్దు**

మొంథా తుపాన్ తీవ్రత అధికంగా ఉండబోతున్నా, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వ్యవసాయ మరియు ఉద్యాన పంటల ప్రాథమిక నష్టం అంచనా నివేదికలు ఇప్పటికే సేకరించామని, ముంపు ప్రాంతాలను గుర్తించి ముందస్తు నష్టనివారణ చర్యలు చేపట్టామని వివరించారు. రైతుల కోసం ప్రత్యేకంగా సోషల్ మీడియా ద్వారా 24 గంటల సలహా, సూచనలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. తుపాన్ అనంతరం నష్టం వాటిల్లిన ప్రతి రైతును ప్రభుత్వం పూర్తిగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఈ క్లిష్ట సమయంలో రైతులు ధైర్యంగా ఉండాలి. ప్రభుత్వం మీతో ఉంది, అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# ఎస్సీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత



షెడ్యూల్డ్ కుల సంఘాల నేతలు, కార్యకర్తల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న రాజా

**శాసనసభ కమిటీ అధ్యక్షుడు వర్ల కుమార్ రాజా**

అనంతపురం, అక్టోబరు 28 ప్రభాతవార్త బ్యూరో: ఎస్సీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అధ్యక్షుడు వర్ల కుమార్ రాజా స్పష్టం చేశారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్‌లతో కలిసి ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అధ్యక్షుడు వర్ల కుమార్ రాజా పాల్గొనగా.. కమిటీ సభ్యులు కావలి గ్రీష్మ ప్రసాద్, ఎమ్మెస్ రాజు, విజయ్ కుమార్ బి.ఎన్ రోషన్ కుమార్ సొంగ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ కమిటీ అధ్యక్షుడు వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే అనంతపురం జిల్లాలో పర్యటించి షెడ్యూల్డ్ కులాలకు చెందిన మానిటరింగ్ కమిటీ స్థితి తదితర అంశాలపై నివేదికలను అందిస్తామన్నారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చాలా సీరియస్‌గా దృష్టి సారించారని, ఎస్సీల అభివృద్ధి కోసం 20,000 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించిందని, వారి కోసం ఎస్సీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి వారి అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు.

అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు పునరావాసం కల్పించడం, ఆర్థికంగా ఆదుకోవడం లాంటి చర్యలను సీరియస్ గా తీసుకోవాలని, తీవ్రత ఎక్కువ ఉన్న కేసులకు సంబంధించి వారి కుటుంబాలకు భూమిని నిబంధనల మేరకు కేటాయించాలని ఆదేశించారు. జిల్లాలో ఎస్సీల ప్రజలు మరియు షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు మరియు కార్యకర్తలు ఇచ్చే వినతి పత్రాలు స్వీకరించామని, వాటిని మినిట్స్ రూపంలో రికార్డ్ చేసి శాసన సభకు అందజేస్తామన్నారు. సంక్షేమ పథకాల అమలు, పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసుల స్థితి, విజిలెన్స్ అండ్ అభివృద్ధి కోసం బాగా పనిచేస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను అభినందించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటనలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు, సమావేశంనకు సంబంధించిన నివేదికను శాసనసభకు అందజేస్తామన్నారు.

ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల వారి రక్షణ కోసం ఏర్పాటు చేసిన అట్రాసిటీ చట్టం లక్ష్యం నెరవేరేలా పోలీసులు పనిచేయాలని, ఎలాంటి ఒత్తిడికి తలొగ్గరాదని, తప్పుడు కేసులు నమోదు కాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అట్రాసిటీ కేసు తీవ్రతను బట్టి బాధితులకు ఆర్థిక సహాయం, స్థలం ఇవ్వాలన్నారు. మూడు నెలల తర్వాత శాసనసభ కమిటీ ఇక్కడికి మళ్లీ రావడం జరుగుతుందని, ఆలోపు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మలోల, తాడిపత్రి ఏఎస్పి రోహిత్ కుమార్ చౌదరి, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు వసంతబాబు, కేశవనాయుడు, శ్రీనివాస్, డిఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవికృష్ణ, శ్రీనివాస్, సిపిఓ అశోక్ కుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, జిల్లా వ్యవసాయ అధికారు ఉమామహేశ్వరమ్మ, హౌసింగ్ పీడీ శైలజ, డిఈఓ ప్రసాద్ బాబు, డిఎండబ్ల్యూఓ రామ సుబ్బారెడ్డి, హార్టికల్చర్ డీడీ ఉమాదేవి, జడ్పీ సీఈవో శివశంకర్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామునాయక్, ఏఎస్డబ్ల్యువోలు రామ్మోహన్, శ్రీనివాసులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కుప్పంలో ఇన్నర్ రింగ్ రోడ్డు

**● సిఎం ఆదేశాలు... రూ.30 కోట్లు మంజూరు... ● ప్రభుత్వ ఉత్తర్వులు**

కుప్పం, అక్టోబరు 28 ప్రభాతవార్త: సిఎం చంద్ర బాబునాయుడు ఆదేశాలతో నియోజకవర్గ కేంద్రమైన కుప్పం పట్టణం సరిహద్దుల మీదుగా అంతర్గత రహదారి (ఇన్నర్ రింగ్‌రోడ్)కు రూ.30 కోట్ల నిధులు మంజూరుచేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మొవ్వ తిరుమల కృష్ణబాబు పాలనాపరమైన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో 2/4కి.మీ. నుంచి 4/8కి.మీ. వరకు అంతర్గత రహదారిని అభి వృద్ధి చేయనున్నారు. గతంలోనే కుప్పం పట్టణం చుట్టూ ఇన్నర్ రింగ్ రోడు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక విజలాపురం సర్కిల్ నుంచి గుత్తార్ల పల్లి సమీపం దాకా, అక్కడ నుంచి డికెపల్లి చెరువు కట్ట నుంచి డికెపల్లి పార్కు మీదుగా పలార్లపల్లి మార్గంలో చీలేపల్లి వరకు, అన ంతరం అక్కడ నుంచి స్థానిక ఇండస్ట్రియల్ ఏరియా (ఏకార్లపల్లి) దాకా ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అప్పట్లో చాలావరకు మట్టిరోడ్డు పనులు సైతం పూర్త య్యాయి. అయితే తదనంతరం వైకాపా ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఈ రింగ్‌రోడ్డు నిర్మాణం ముందు కు సాగలేదు. మరలా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి సిఎం చొరవతో రింగ్‌రోడ్డుపనులపూర్తికినిధులుమంజూరు అయ్యాయి.



## సిఎంతో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ భేటి

విజయవాడ, అక్టోబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మంగళవారం ఎపి మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి ని కలిసిన ఆమె పలు అంశాలపై వారితో చర్చిం చారు. మహిళా సాధికారత దిశగా కమిషన్ భవిష్యత్ ప్రణాళికను ముఖ్యమంత్రికి వివరించారు. అదే విధంగా మొంథాన్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్త చర్యల్లో భాగంగా గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించి.. వారికి వైద్యసాయం అందించడంలో ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధను మహిళా కమిషన్ తరఫున ఆమె సిఎంకు ధన్యవాదాలు తెలియజేశారు. చైర్‌పర్సన్‌గా పదవిలోకి వచ్చిన అనతికాలంలోనే మహిళా కమిషన్‌కు మంచిపేరు తెచ్చిన శైలజను సీఎం చంద్రబాబు అభినందించారు.

## ముఖ్యమంత్రితో బిజెపి నేత విష్ణువర్ధన్‌రెడ్డి సమావేశం



విజయవాడ, అక్టోబరు 28 ప్రభాత వార్త ప్రతినిధి: భారతీయ జనతా పార్టీ జాతీయ కమిటీ సభ్యులు ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి అమరావతి లోని సచివాలయంలో మంగళ వారం సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గూగుల్ సంస్థ నుంచి విశాఖపట్నంలోకి రావడం అభినందనీయమని పేర్కొ న్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమరావతిలో నిర్మాణాలు వేగవంతం కావడంపై సిఎంని అభినందించా నని ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మీడియాతో పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆ పెట్టుబడుల ద్వారా రాష్ట్ర యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో నిజమైన డబుల్ ఇంజన్ పాలన అందించిం దన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతాల సురేష్, భాజపా మీడియా ప్రతినిధి చిన్నపరెడ్డి రవీంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.



## బుక్ ఎగ్జిబిషన్ రావాలని సిఎంకు ఆహ్వానం

విజయవాడ, అక్టోబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: దక్షిణ భారత దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే విజయవాడ బుక్ ఎగ్జిబిషన్‌కు హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆహ్వానించింది. 2026 జనవరి 2 తేదీన విజయవాడలో నిర్వహించనున్న ఈ 36వ బుక్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి హాజరు కావాల్సిందిగా సొసైటీ అధ్యక్షుడు టి.మనోహర్ నాయుడు, ఎపి ప్రింటర్లు, పబ్లిషర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కాట్రగడ్డ మోహన్, ఆంధ్రా ఆర్ట్స్ గోళ్ళ నారాయణరావు సిఎంను ఆహ్వానించారు. వచ్చే ఏడాది జనవరి 2 నుంచి 7 తేదీ వరకు బుక్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు బుక్ ఫెస్టివల్ సొసైటీ పేర్కొంది. దక్షిణ భారత దేశంలోని పుస్తక పబ్లిషర్లు, ప్రింటర్లు, పాఠకులు పెద్దఎత్తున హాజరు కానున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. అందరిలో పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగేలా బుక్ ఎగ్జిబిషన్ నిర్వహించటంపై బుక్ ఫెస్టివల్ సొసైటీని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు.

# విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటాం

**- బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్**



రేపల్లె, అక్టోబరు 28 ప్రభాతవార్త: రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ హెల్ప్ డెస్క్‌లో నిర్వహిస్తున్న రికార్డును పరిశీలించి ఫిర్యాదు వివరాలను, తీసుకున్న చర్యలను నమోదు చేయాలన్నారు. రేపల్లె సర్కిల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల వివరాలను తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతా ల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తీసు కుంటున్న ఏర్పాట్లుతో పాటు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడితే వెంటనే వాటి తొలగింపునకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై తగిన సూచనలిచ్చారు. తుపాన్ విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవాల న్నారు. సచివాలయాల పరిధిలో పోలీస్ సిబ్బందిని నియమించి ముందస్తు చర్యల్లో భాగంగా కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా పరిధిలో 2884 బోట్లు ఉన్నాయన్నారు. వర్షాలకు ఉధృతంగా ప్రవ హించే కాలువలు, వాగుల వద్ద పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో గస్తీ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ బి.ఉమామహేశ్వర్ వెల్లడించారు.

## తుఫాన్ అంటే భయపడుతున్న తీరప్రాంతం

రేపల్లె, అక్టోబరు 28, ప్రభాతవార్త:తుఫాన్ అంటేనే సముద్ర తీర ప్రాంత ప్రజలు భయపడుతుంటే ప్రజలను ఎలా రక్షించాలో అని అధికారులు,ప్రభుత్వ పాలకులు ఆందోళన చెందటం పరిపాటిగా మారింది.ఏ ప్రాంతంలో అయితే గాలుల తీవ్రత ఉంటుందో ఆ ప్రాంతాన్ని అధిక పీడనమని,తక్కువ గాలుల ప్రభావం ఉన్న ప్రాంతాన్ని అల్పపీడనమని అంటారు.అధిక వేడి,తేమతో కూడిన గాలి పైకి వీచటం వలన అల్పపీడనం ఏర్పడి తుఫాన్ తీవ్రరూపం దాల్చుతుంది. ఉష్ణమండల ప్రాంతాలలోని నీటి వనరులపై తుఫాన్లు ఏర్పడుతున్నాయి.ప్రధానంగా బంగాళాఖాతంలో ఏర్పడే తుఫాన్లు ఆంధ్రప్రదేశ్ పై ప్రభావితం చూపుతున్నాయి. సముద్రంలో ఎక్కడ వేడి నీటి ఉష్ణోగ్రత ఉంటుందో అక్కడ తుఫాన్ ప్రారంభమవుతుంది. కేంద్రీకృతమైన అల్పపీడనం చుట్టూ గాలి వేగంగా పెరిగి తుఫాన్ గా రూపాంతరం చెందుతుంది. తుఫాన్ కారణంగా మంగళవారం రేపల్లె



తీరంలో ఈదురు గాలులతో కూడిన భారీవర్షాలు కురుస్తున్నాయి.లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి.డ్రైన్లు ఉధృతంగా ప్రవహిస్తు న్నాయి.రేపల్లె పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం జలమయమైంది. న్యాయస్థానం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల నీటి వలయంలో చిక్కుకొన్నాయి.మచిలీపట్నం నుంచి నిజాంపట్నంకు జాలర్లకు చెందిన ఒక బోటు కొట్టుకు వచ్చింది.నిజాంపట్నం హార్బర్ లో 8వ నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.తీరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి.

## ప్రజా సమస్యల పరిష్కారంపై రేపల్లె ఆర్డీవో హామీ

రేపల్లె, అక్టోబరు, 28 ప్రభాతవార్త: మోకాళ్ళ లోతు నీటి నిల్వ కారణంగా నడవటానికి ఇబ్బందులు ఏర్పడినా అధికారులు చర్యలు తీసుకోవటంలేదని పట్టణంలోని 18వ వార్డు సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో పేద ప్రజలు మంగళవారం ఆందోళన చేశారు.తాగటానికి మంచినీరు దొరకటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులు తొలగిస్తామన్నారు. తుఫాన్ అనంతరం మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు.రేపల్లె మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ ప్రజల సమస్యల్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ 2 వేల కుటుంబాలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.తుఫాన్ బాధితులకు నష్టపరిహారం పంపిణీ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో నాంచారమ్మ, ఫర్జానా, వీరాంజనేయులు,ఐద్వా రేపల్లె అధ్యక్షురాలు ఎస్ కె.షకీరా, డివైఎఫ్ఐ అధ్యక్షులు సీహెచ్.ప్రకాష్,సిపిఎం నేతలు కె. రమేష్,జి.దానియేలు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

రేపల్లె, అక్టోబరు 28, ప్రభాతవార్త: రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని భట్టిప్రోలు,ఐలవరంలలో మంగళవారం నిరుపేద కుటుంబాలకు బియ్యం, చింతపండు, నూనె, శనగగుళ్ళు, ఖర్జూరాలు, ఉల్లిపాయలు,కందిపప్పు,గోధుమ పిండి, బిస్కెట్లు,



అరటిపళ్ళు పంపిణీ చేశారు.వెల్లటూరు పునరావాస కేంద్రంలోనూ నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ డి ఆర్ డి ఏ,వెలుగు ప్రత్యేక అధికారి ఎం.రమేష్ బాబు, స్థానిక ఏపీఎం జి.శ్రీమన్నారాయణ,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా,సుందరరావు,కుంచె నగేష్ కుమార్,యడ్ల జయశీలరావు,కంభం సుధీర్,మాచర్ల నాగరాజు, కొండలు,దీపాల ప్రసాద్, వెలుగు విజేతలు, సిబ్బంది, సి.సిలు,వీఆర్వోలు పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు

రేపల్లె, అక్టోబరు 28, ప్రభాతవార్త:నిజాంపట్నం మండలంలోని ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా అధికారి యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరినాథ్ బాబు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి తో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని గ్రామాలలో ఎన్ని పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారని,ఎన్ డి ఎఫ్ టీం, ఉద్యోగుల విధి నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు.నిజాంపట్నం, దిండి, అడవులదీవి, కొత్తపాలెంలోని సంజీవ్ నగర్లలో ని పునరావాస కేంద్రాలకు 449 మందిని తరలించినట్లు ఎంపీడీవో నాగలక్ష్మి వివరించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ మోపిదేవి మార్కండేయులు, ఎంపీటీసీ నాజర్ ఖాన్, పంచాయతీ మెంబర్లు అక్క రాజు, పందు, భాషా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నష్టం జరగకుండా చూడాలి

రేపల్లె, అక్టోబరు 28, ప్రభాతవార్త:మొంథా తుఫాను తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని దక్షిణ కోస్తాంధ్ర ప్రత్యేక అధికారి,ఎంపి చేనేత జౌళి శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా ఆదేశించారు.మంగళవారం రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో రామలక్ష్మితో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణం,ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు.పునరావాస కేంద్రాల పనితీరుపై ఆయన ప్రశ్నించారు.ఆర్డీవో రామలక్ష్మి మాట్లాడుతూ రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని అమృతలూరు మండలంలోని 6 పునరావాస కేంద్రాలలో 230 మంది, భట్టిప్రోలు మండలంలోని 3 పునరావాస కేంద్రాలలో 119 మంది, చెరుకుపల్లి మండలంలోని 12 పునరావాస కేంద్రాలలో 613 మంది,కొల్లూరు మండలంలోని 8 పునరావాస కేంద్రాలలో 137 మంది,నగరం మండలంలోని 5 పునరావాస కేంద్రాలలో 263 మంది, నిజాంపట్నం మండలంలోని 8 పునరావాస కేంద్రాలలో 549 మంది, రేపల్లె రూరల్ మండలంలో 8 మంది అని వివరించారు.

## ప్రకృతి విపత్తుల నుంచి ప్రజల్ని కాపాడటంలో చంద్రబాబు తర్వాతే ఎవరైనా: మాజీమంత్రి ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబర్ 28, ప్రభాతవార్త: నియోజకవర్గంలో మొంథా తుపాను తీవ్రత దృష్ట్యా మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం సాయంత్రం పట్టణంలో క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వివిధ విభాగాల అధికారులు.. కూటమి నాయకులు, టీడీపీ శ్రేణులు.. అనుబంధ విభాగాల సభ్యులతో కలిసి 25వ వార్డు (జాగుపాలెం), 28వ వార్డు (కొండ్రుపాడు), సుగాలి కాలనీల్లో పర్యటించారు. సుగాలి కాలనీ, చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజల్ని సమీపంలోని మున్సిపల్ పాఠశాలకు బస్సుల్లో తరలించే ఏర్పాట్లు చేసిన ప్రత్తిపాటి.. ప్రజలకు స్వయంగా ఆహారం అందించి వారికి ధైర్యం చెప్పారు. తమకు ఏ కష్టం రాకుండా చంద్రబాబు చూసుకుంటాడన్న ధైర్యంతో ప్రజలున్నారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం.. అధికార యంత్రాంగం తుపాను పరిస్థితుల్ని ఎదుర్కోవడానికి సర్వ సన్నద్ధంగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, మంత్రులు ఎప్పటికప్పుడు తుపాను తీవ్రతను గమనిస్తూ, ఆర్టీజీఎస్ ద్వారా ప్రజలకు అందాల్సిన సేవలు. సమస్యల పరిష్కారానికి తీవ్రంగా శ్రమిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. స్థానిక యంత్రాంగం ఈ రాత్రి మరింత అప్రమత్తంగా ఉండాలని, తుపాను తీరాన్ని సమీపించినందున ప్రభావం అధికంగా ఉంటుందని ప్రత్తిపాటి సూచించారు. అర్ధరాత్రి కూడా ప్రజలకు అందుబాటులో ఉండి.. వారికి ఏ కష్టం రాకుండా చూద్దామని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. ప్రత్తిపాటి వెంట జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, డిఇ అబ్దుల్ రహీమ్, మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు, వార్డు నాయకులు తదితరులున్నారు.



## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన చైర్మన్

చిలకలూరిపేట, అక్టోబర్ 28, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన మునిసిపల్ చైర్మన్ ఈరోజు చిలకలూరిపేట పట్టణంలోని మాజీ మంత్రివర్యులు మన శాసనసభ్యులు గౌరవనీయులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు పట్టణంలో తుఫాన్ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫ్ఫాని గారు పట్టణం ఆయా వార్డులను పర్యటిస్తున్నారు.దానిలో భాగంగా రూతుడైక్ మెన్ కాలనీ, ఓగేరు వాగు పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రజలను అప్రమత్తం చేశారు. నరసరావుపేట రోడ్డు పక్కన ఉన్నటువంటి పలువురు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. 15 అవార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు గారు మున్సిపల్ చైర్మన్ సహకారంతో పలువురు ప్రజలకు భోజనాలు ఏర్పాటు చేశారు.ఏదైనా ఇబ్బంద్దులు ఉన్న యడల పురపాలక సంఘ కంట్రోల్ రూమ్ నెంబర్ కి 08647253994కి గాని మునిసిపల్ కమీషనర్ గారికి గాని చైర్మన్ గారికి చేయవలసినదిగా ప్రజలకు విజ్ఞప్తి చేసారు

## వర్షాభావ ప్రాంతాల్లో ప్రజలకు అన్నదానం

చిలకలూరిపేట, అక్టోబర్ 28, ప్రభాతవార్త:తుఫాన్ నేపథ్యంలో మాజీ మంత్రి విడదల రజిని నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వర్షా ప్రభావం వల్ల ప్రజలు ఇబ్బంది పడే ప్రాంతాలలో సందర్శించి వారికి అన్నదానం మరియు ఏమైనా సమస్యలుంటే వారికి అందుబాటులో ఉండవలసిందిగా ఆదేశించడం జరిగింది వారి యొక్క ఆదేశాల మేరకు ఈరోజు చిలకలూరిపేట పట్టణంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పేద ప్రజలకి ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు షేక్ దరియా వలి పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ జమీర్ ,పట్టణ ప్రధాన కార్యదర్శి బడే మియా , కౌన్సిలర్ మహబూబ్ సుభాని ( డీలర్ ),, పార్టీ సీనియర్ నాయకులు అహ్మద్ అలీ ,,షేక్. నజీర్,, షేక్ ఖాజావలి , 14వ వార్డు ప్రెసిడెంట్ జాన్ సైదా ,, 21వ వార్డు ప్రెసిడెంట్ అన్నపురెడ్డి ,, విద్యార్థి విభాగం అధ్యక్షులు ఆసిఫ్ వాణిజ్య విభాగం అధ్యక్షులు అహ్మద్ 24 వ వార్డు అధ్యక్షులు బాజీ బాబా , నూరు, హసన్ అలీ, హర్షఫ్,దావూద్, అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## తుఫాన్ సహాయక చర్యల్లో మున్సిపల్ అధికారులు

చిలకలూరిపేట, అక్టోబర్ 28, ప్రభాతవార్త: పట్టణంలో విస్తృతంగా పర్యటిస్తున్న కమిషనర్ పీ శ్రీహరిబాబు... చిలకలూరిపేట మొంథా తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు ప్రతిష్టమైన చర్యలు తీసుకున్నారు.పలువురు అధికారులను బృందాలు గా ఏర్పాటు చేసి శివారు ప్రాంతాలు లోతట్టు ప్రాంతాలు.టెయిల్ పాండ్ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ పి శ్రీ హరి బాబు అన్ని ప్రాంతాలను పరిశీలించారు. అన్న క్యాంటీన్ లో ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచాలని సూచనలు చేశారు. పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.. నాలుగు చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తుఫాను ప్రభావం తగ్గేవరకు అందరూ అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు..

## తుఫాను నేపథ్యంలో ప్రధాన డ్రైన్లలో పూడికలు తొలగింపు

చిలకలూరిపేట, అక్టోబర్ 28, ప్రభాతవార్త: మొంథా తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ పీ శ్రీహరిబాబు ఆదేశాల మేరకు,మంగళవారం నాడు శానిటరీ ఇనస్పెక్టర్ సిహెచ్ రమణారావు జోరువానలో సైతం వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు గడియారస్థభం సెంటర్, కే బి.రోడ్డు లో ఉన్న ప్రధాన డ్రైన్లను జెసిబి తో పూడికలు తొలగింపుల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలను పరిశీలించారు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ షేక్ రఫానీ సూచనల మేరకు కోమల విలాస సెంటర్. మెయిన్ రోడ్డు. శారద హైస్కూల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మురుగు కాల్వలను పరిశీలించి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు

## కుప్పగంజి వాగు పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిలకలూరిపేట, అక్టోబర్ 28, ప్రభాతవార్త: పారిశ్రామిక వాడ గణపవరంలోని చవిటిపాలెంలో డిప్యూటీ ఎంపీడీవో టి. వెంకటేశ్వర్లు సారథ్యంలో పంచాయతీ కార్యదర్శి సింగరాజు మారుతీ బాబు, వీఆర్వో అంకమ్మరావు, పంచాయతీ సిబ్బంది పర్యటించారు. వాగు పరివాహక ప్రాంతాల ప్రజలు రెండు రోజులపాటు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, కోరారు. గ్రామ సచివాలయాల్లో తమ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారని వారికి వివరించారు. పారిశుధ్య సమస్యలు, చెట్లు, విద్యుత్తు స్తంభాలు కూలడంవంటివి జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.


కెనరా బ్యాంక్ Canara Bank | ప్రాంతీయ కార్యాలయం గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. | బంగారు ఆభరణముల వేలం ప్రకటన

**ఇ-వేలం ద్వారా బంగారు ఆభరణములు అమ్మకం**
https://bankeauctions.com

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ఈ క్రింది పేర్కొనబడిన ఖాతాదారులు, దిగువ తెలిపిన కెనరా బ్యాంకు బ్రాంచిలలో బంగారు నగలు తాకట్టు పెట్టి, ఋణం పొందిన క్రింది ఖాతాదారులు గడువు మీరినను, ఋణములు చెల్లించాల్సిందిగా బ్యాంకు వారు పలుమార్లు కోరినను, వారు తమ బాకీలు చెల్లించలేదు. ఋణము బకాయి అయినందున సదరు బంగారు నగలను https://www.bankeauctions.com ద్వారా 14.11.2025 వ తేదీన ఆన్‌లైన్ ఇ-వేలం వేసి వారి పేరున ఉన్న బకాయిలు జమకట్టుకొనబడును. ఈ ఖాతాదారులలో ఎవరికైనను బ్యాంకు వారి నోటీసులు అందని యెడల లేదా నోటీసులు తిరస్కరించిన వారికి పత్రికాముఖంగా చివరగా తెలియజేయడమైనది. వేలము వేసినా బకాయిలు రద్దుకాని యెడల వారిపై చట్టరీత్యా తగుచర్యలు తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును మరియు వేలము తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. ఈ దిగువ ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

| నెం. | ఖాతా నెంబర్లు | ఖాతాదారుల పేర్లు మరియు చిరునామా | స్థూల బరువు |
|---|---|---|---|
| నరసరావుపేట బ్రాంచ్ (8696), పల్నాడు జిల్లా, ఫోన్: 83310 15759 ధరావత్తు (ఇ.ఎం.డి) సొమ్ము జమచేయవలసిన అకౌంట్ నెం.209272434, IFSC: CNRB0008696 | | | |
| 1 | 180408464412 | మర్రిపూడి కోమలి, భర్త : శ్రీనివాస రావు, ఫ్లాట్ నెం.506, 1వ లైన్, NGO కాలనీ, నరసరావుపేట, పల్నాడు జిల్లా. | 106.0 గ్రా |

వేలం నియమనిబంధనలు: (1) పై ఖాతాదారులలో ఎవరికైనా మా బ్యాంకు నందు ఇంకనూ అప్పులు వున్నచో, వేలం ద్వారా మిగిలిన సొమ్మును ఆ ఖాతాకు సర్దుబాటు చేయబడును. (2) ఖాతాదారులు సదరు గడువులోగా రుణం చెల్లించి మీ బంగారు నగలను విడిపించుకోవాలని చివరగా మరొకసారి కోరడమైనది. లేని యెడల తేది.14.11.2025 శుక్రవారం రోజున మ॥ 12.00 గం.ల నుండి మ॥ 3.00 గం.ల వరకు https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం వేయబడును. (3) వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 25,000/- ధరావత్తు సొమ్మును తేది 13.11.2025 సా॥ 4 గం.లోపు పైన తెలిపిన సంబంధిత బ్రాంచ్ కలెక్షన్ అకౌంట్ నెం.కు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చును. (4) వేలంలో పాల్గొన్నవారు పై వస్తువుల విలువ పరిమాణము, నాణ్యత కొరకు ఎటువంటి వివాదములకు బ్యాంకు బాధ్యత వహించదు. (5) హెచ్చుపాటదారుడు మొత్తం పాట సొమ్మును అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. లేనియెడల ధరావత్తు సొమ్ము కోల్పోవుదురు. (6) ఏకారణం చూపకుండానే వేలం షరతులు మార్చుటకు, వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి సర్వహక్కులు కలిగియున్నవి. (7) మరిన్ని వివరములకు ఫోన్: 99481 82222 సంప్రదించండి మరియు సవివరమైన నియమనిబంధనల కొరకు https://www.bankeauctions.com చూడండి.

తేది : 28.10.2025, ప్రదేశం : గుంటూరు — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

30-10pg10exCRP 12 GNT_30-10pg10exCRP.qxd 29/Oct/25 1:13 AM Page 1



# దక్షిణాఫ్రికా సిరీస్‌కు టీమిండియాలో నంబర్ 4?

## శ్రేయస్ ప్లేస్‌కై ముగ్గురు పోటీ


సంజు సామ్సన్


రియాన్ పరాగ్


తిలక్ వర్మ

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో ఫీల్డింగ్ చేస్తుండగా టీం ఇండియా బ్యాట్స్‌మన్ శ్రేయాస్ అయ్యర్ గాయపడ్డాడు. ఆయన కోలుకోవడానికి ఎక్కువ సమయం తీసుకుంటుంది. దీంతో దక్షిణాఫ్రికా సిరీస్‌కు అతని స్థానంలో ఎవరు వస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే పలువురు ప్లేయర్లు ఈప్లేస్‌కోసం పోటీ పడుతున్నారు. దక్షిణాఫ్రికాతో భారత్ తదుపరి వన్డే సిరీస్ నవంబర్ 30న స్వదేశంలో ప్రారంభమవుతుంది. అయ్యర్ స్థానంలో ఎవరు వస్తారనే దానిపై సెలక్షన్ కమిటీ ఇప్పటికే కసరత్తు చేస్తోంది. ఈ ప్లేస్‌కు ప్రధానంగా ముగ్గురు పోటీ పడుతున్నారు. వీరిలో సంజు సామ్సన్ ఉన్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో సంజు ఆఫార్మాట్‌లో పైవరుసలో బ్యాటింగ్ చేస్తాడని ప్రకటించడంతో అతనికి ఆ సిరీస్‌లో అవకాశం రాలేదు. ఇప్పుడు నంబర్ 4 ప్లేస్ ఖాళీగాఉంది కాబట్టి, సంజుకు అవకాశం ఇవ్వాలి. ముఖ్యంగా గత వన్డే సిరీస్‌లో అతను ప్రదర్శించిన ఫామ్‌ను పరిశీలిస్తే, ఇప్పటివరకు 16 వన్డేలు ఆడి 56.66 సగటుతో 510 పరుగులు చేశాడు. అతని పేరులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలుకూడా ఉన్నాయి. అయ్యర్ ప్లేస్‌లో సుల భంగా నాలుగో స్థానంలోకి వచ్చి ఎక్కువ పరుగులు చేయగలడు. మరొకరు తిలక్ వర్మ. గత నెలలో ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌తో తిలక్ వర్మ ఓవర్‌నైట్ స్టార్ అయ్యాడు. 2023లో బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డేలో అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు 4 మ్యాచ్‌ల్లో కేవలం 68 పరుగులు మాత్రమే చేశాడు. కానీ ఆసియా కప్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత, అతను మంచి ఫామ్‌లో ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్‌లో తిలక్ 4వ స్థానంలో బ్యాటింగ్‌ను బలోపేతం చేయగలడు. ఇక రియాన్ పరాగ్ గత ఏడాది శ్రీలంకతో జరిగిన వన్డే మ్యాచ్‌లో అరంగేట్రం చేశాడు. అయితే, గాయం కారణంగా అతను జట్టుకు దూరంగా ఉన్నాడు. కేవలం ఒక మ్యాచ్ మాత్రమే ఆడి తొమ్మిది ఓవర్లలో 15 పరుగులు చేసి 3 వికెట్లు తీసుకున్నాడు. అతను భారత్ తరపున తొమ్మిది టి20లు కూడా ఆడగా, ఆరు ఇన్నింగ్స్‌లలో 106 పరుగులు చేసి 4 వికెట్లు తీసుకున్నాడు. పరాగ్ నాల్గవ స్థానంలో బ్యాటింగ్ చేయగలగడంతో పాటు, అదనపు బౌలింగ్ కాకుండా జట్టుకు సమతుల్యతను అందిస్తాడు.

# పారా క్లైంబింగ్ ప్రపంచ కప్‌లో.. మణికందన్‌కు స్వర్ణం




**న్యూఢిల్లీ:** పారా క్లైంబింగ్ ప్రపంచ కప్-2025లో మణికందన్ కుమార్ స్వర్ణం సాధించాడు. ఫ్రాన్స్‌లోని లావల్‌లో జరిగిన పురుషుల ఆర్పీ2 విభాగంలో ఈ భారత ఆటగాడు అత్యున్నత స్థానాన్ని సంపాదించాడు. అక్టోబర్ 24-26 వరకు ఫ్రాన్స్‌లోని లావల్‌లో జరిగిన ఐఎఫ్ఎస్‌సి పారా క్లైంబింగ్ వరల్డ్ కప్ చివరి రోజున భారతదేశానికి చెందిన మణికందన్ కుమార్ 2025 సీజన్‌లో తన తొలి ప్రపంచ కప్ స్వర్ణాన్ని సాధించాడు. పురుషుల ఆర్పీ2 పోటీ పడుతున్న మణికందన్ అసాధారణ ప్రదర్శనతో జర్మనీకి చెందిన ఫిలిప్ ఫ్రోజెక్‌ను 44+ నుండి 44 తేడాతో ఓడించాడు. ఆస్ట్రియాకు చెందిన డేనియల్ వీనర్ 40 కాంస్య పతకాలతో రెండో స్థానంలో నిలిచాడు. కాగా మణికందన్ ఈ ఈవెంట్‌లో పలుసార్లు పతకం గెలుచుకున్నాడు. వాటిలో ఇటలీలోని ఆర్కోలో జరిగిన 2024 ఎడిషన్‌లో స్వర్ణం కూడా ఉంది. ఈ ఈవెంట్ యొక్క చివరి పతకాల పట్టికలో రికార్డు స్థాయిలో 18 దేశాలు చోటు దక్కించుకున్నాయి. ఫ్రాన్స్ ఐదు స్వర్ణాలు, రెండు కాంస్యాలతో అగ్రస్థానంలో నిలిచింది, జర్మనీ ఎనిమిది పతకాలతో అత్యధికంగా ఒక స్వర్ణం, ఐదు రజతాలు, రెండు కాంస్యాలు సాధించింది.

# ఆసియా యూత్ గేమ్స్.. రికార్డు బద్దలు కొట్టిన ధీనిధి



**న్యూఢిల్లీ:** ఆసియా యూత్ గేమ్స్ 2025లో భారత స్విమ్మర్ ధీనిధి దేశింగు 400 మీటర్ల ఫ్రీస్టైల్ రికార్డును బద్దలు కొట్టింది. ఫైనల్‌లో ఐదవ స్థానంలో నిలిచి తన రికార్డును మూడు సెకన్ల తేడాతో మెరుగుపరుచుకుంది. బహ్రెయిన్‌లో జరిగిన ఆసియా యూత్ గేమ్స్‌లో ధినిధి కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది. ధీనిధి 4:21.86 సెకన్లలో పూర్తి చేసి ఫైనల్‌లో ఐదవ స్థానంలో నిలిచింది. ఆమె 4:24.60 సెకన్ల రికార్డును మెరుగుపరుచుకుంది. ఇదే ఈవెంట్‌లో, దేశానికే చెందిన అదితి సతీష్ హెగ్డే 4:32.00 సెకన్లతో ఏడో స్థానంలో నిలిచింది. భారత బాలికల 4+100 మీటర్ల ఫ్రీస్టైల్ రిలే 4:05.73 సెకన్ల సమయంతో ఫైనల్‌లో చివరి స్థానంలో నిలిచింది. ఇక బాలురలో నితీశ్‌సాయి హరినాథ్ 50 మీటర్ల ఫ్రీస్టైల్ ఫైనల్‌లో 23.72 సెకన్లతో ఐదవ స్థానంలో నిలిచాడు. 400 మీటర్ల ఫ్రీస్టైల్ ఫైనల్‌లో ఈత కొట్టిన ధక్షన్ శశికుమార్ 4:00.87 సెకన్లతో ఏడో స్థానంలో నిలిచాడు. 100 మీటర్ల బటర్‌ఫ్లైలో, వేదాంత్ టాండలే 56.31 సెకన్లతో ఏడో స్థానంలో నిలిచాడు.

## ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్.. నవంబర్ 14 నుంచి

# గ్రేటర్ నోయిడాలో పోరు

**హైదరాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:** ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ 2025కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. నవంబర్ 14 నుంచి 21 వరకు గ్రేటర్ నోయిడాలోని షహీద్ విజయ్ సింగ్ పథిక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ మెగా ఈవెంట్ జరగనుంది. మొత్తం 18 దేశాల నుంచి 140 మందికి పైగా అగ్రశ్రేణి బాక్సర్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. వీరిలో ముగ్గురు ఒలింపిక్ పతక విజేతలు కూడా ఉండటం విశేషం. ఈ టోర్నమెంట్‌లో 20 మంది (10 మంది పురుషులు, 10 మంది మహిళలు)తో కూడిన బలమైన జట్టుతో భారత్ బరిలోకి దిగుతోంది. ఈ జట్టుకు మాజీ ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్ (51 కిలోలు), ప్రస్తుత ప్రపంచ చాంపియన్లు జాస్మిన్ లంబోరియా (57 కిలోలు), మీనాక్షి (48 కిలోలు), రెండుసార్లు ఆసియా చాంపియన్ పూజా రాణి (80 కిలోలు) వంటి స్టార్ మహిళా బాక్సర్లు నాయకత్వం వహిస్తున్నారు.

పురుషుల విభాగంలో ఈ సీజన్ ప్రపంచ కప్ టోర్నీల్లో పతకాలు సాధించిన హితేష్ (70 కిలోలు), అభినాష్ జమ్వాల్ (65 కిలోలు) వంటి బాక్సర్లు ఉన్నారు. జాదుమణి సింగ్ (50 కిలోలు), పవన్ బర్త్వాల్ (55 కిలోలు), సచిన్ (60 కిలోలు), సుమిత్ (75 కిలోలు), లక్ష్య చాహర్ (80 కిలోలు), జుగ్నూ (85కిలోలు), నవీన్ కుమార్ (90కిలోలు), నరేందర్ (90+ కిలోలు) వంటి ఇతర భారత బాక్సర్లు కూడా తమ సత్తా చాటడానికి సిద్ధంగా ఉన్నారు. మహిళల్లో ప్రీతి (54కిలోలు), పర్వీన్ (60కిలోలు), నీరజ్ ఫోగట్ (65కిలోలు), అరుంధతి చౌధరి (70కిలోలు) పోటీ పడుతున్నారు.

ఈ ఫైనల్స్‌లో మూడు పారిస్ ఒలింపిక్ పతక విజేతలైన దక్షిణ కొరియాకు చెందిన ఏజి ఇమ్, చైనీస్ తైపీకి బాక్సర్లు వూ షిహ్‌యి, చెన్ నీన్‌చిన్ బరిలో నిలిచారు. వీరితో పాటు వివిధ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణాలు సాధించిన పలువురు కూడా బరిలో నిలవడంతో పోటీ స్థాయి మరింత పెరగనుంది. ప్రపంచంలోని అత్యుత్తమ బాక్సర్లు స్వదేశంలో పోటీ పడటం మన దేశ బాక్సర్లకు తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి ఒక అద్భుతమైన అవకాశమని బీఎఫ్ఐ అధ్యక్షుడు అజయ్ సింగ్ పేర్కొన్నారు.

ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌కు ఆతిథ్యం ఇవ్వడం భారత బాక్సింగ్‌కు గర్వకారణం. ప్రపంచ స్థాయిలో మేము ఎంత ఎదిగామో ఇది ప్రతిబింబిస్తుంది. ప్రపంచంలోని అత్యుత్తమ దేశాలను, ఒలింపిక్ పతకవిజేతలను ఇక్కడ పోటీకి తీసుకురావడం కేవలం గౌరవం మాత్రమే కాదు, బాక్సింగ్ పవర్‌హౌస్‌గా భారత్ పెరుగుతున్న స్థాయికి నిదర్శనం అని అన్నారు. ఈ వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్ సీజన్ మొత్తంలో జరిగిన గ్లోబల్ సిరీస్‌కు ముగింపు పలకనుంది. సీజన్‌లో అత్యధిక ర్యాంకు సాధించిన అథ్లెట్లు పది వెయిట్ కేటగిరీల్లో ట్రోఫీ కోసం పోటీపడతారు.

# వరల్డ్ టేబుల్ టెన్నిస్-2025 ఫైనల్స్‌కు మనుష్-దియా అర్హత

## తొలి భారతీయ జంటగా రికార్డు



**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్-2025 ఫైనల్స్‌కు అర్హత సాధించిన తొలి భారతీయ జంటగా మనుష్ షా-దియా చిటాలే నిలిచారు. ఇది భారత టేబుల్ టెన్నిస్‌కు చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. మంగళవారం తాజా వరల్డ్ టేబుల్ టెన్నిస్ సిరీస్ ఫైనల్స్ రేస్ ర్యాంకింగ్స్ ప్రకారం, మనుష్-దియా జంట డిసెంబర్ 10 నుండి 14 వరకు చైనాలోని హాంకాంగ్‌లో జరిగే సంవత్సరాంతపు ఈవెంట్‌లో స్థానం నిర్ధారించిన ఐదవ మిక్స్‌డ్ డబుల్స్ జట్టుగా నిలిచింది. అలాగే స్టార్ కంటెండర్ మస్కట్ (నవంబర్ 17-22) ముగింపులో డబ్ల్యూటిటి సిరీస్ ఫైనల్స్ రేస్ ర్యాంకింగ్‌లు డబ్ల్యూటిటి ఫైనల్స్‌కు స్వయంచాలకంగా అర్హత సాధించే ఏడు జతలను నిర్ణయిస్తాయి. ఎనిమిదవ స్థానాన్ని హోస్ట్ వైల్డ్‌కార్డ్ జత తీసుకుంటుంది. ఈ సీజన్‌లో, షా మరియు చిటాలే ట్యూనిస్‌లో డబ్ల్యూటిటి కాంటెండర్ టైటిల్‌ను గెలుచుకున్నారు. అలాగే బ్రెజిల్‌లోని ఫోజ్ డో ఇగువాకులో జరిగిన డబ్ల్యూటిటి స్టార్ కాంటెండర్ ఈవెంట్‌లో రన్నరప్‌గా నిలిచారు. తాజా ఐటిటిఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఈ భారత జంట ఎనిమిదో స్థానంలో ఉంది. డబ్ల్యూటిటి ఫైనల్స్ మొదటిసారి 2021లో జరిగాయి. మొదటి నాలుగు ఎడిషన్ల మాదిరిగానే, ఈ సంవత్సరం ఈవెంట్‌లో కూడా సింగిల్స్ విభాగాలలో టాప్ 16 మంది పురుషులు, మహిళలు పోటీపడతారు. అయితే, 2023, 2024 ఎడిషన్లలో భాగమైన పురుషులు, మహిళల డబుల్స్ విభాగాలను హాంకాంగ్‌లో మిక్స్‌డ్ డబుల్స్ ద్వారా భర్తీ చేయనున్నారు.



# దిగివస్తున్న పసిడి ధరలు

**ముంబయి, అక్టోబరు 28:** బంగారం ధరలు ప్రస్తుతం దిగుతున్నాయి. ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన పుత్తడి తిరోగమనబాట పట్టింది. నిన్న ఒక్కరోజే తులంపై రూ. 2,340 తగ్గిన ధర మంగళవారం కూడా స్వల్పంగా దిగొచ్చింది. ట్రేడింగ్‌లో తులంపై రూ.820 తగ్గింది. దీంతో ఇవాళ ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,22,460కి తగ్గింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.720 తగ్గి రూ.1,12,250కి చేరింది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,23,420గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 1,13,140గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా తగ్గాయి. ఒక్కరోజే కేజీపై రూ.5వేలు తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1.48 లక్షలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో వెండి స్పాట్‌ధర ఔన్స్ ఒక్కింటికి 46.59 డాలర్లుగా కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో దాదాపుగా ఇవే రేట్లు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో పుత్తడికి డిమాండ్ పడిపోవడంతోపాటు అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తత పరిస్థితులు తగ్గుముఖం పట్టడంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన బంగారం నుంచి ఈక్విటీ మార్కెట్లలోకి తగ్గించడంతో వీటి ధరలు తగ్గుముఖం పట్టాయని నిపుణులు చెబుతున్నారు. కాగా, పది రోజుల క్రితం తులం బంగారం ఎన్నడూ లేని విధంగా రూ.1.35 లక్షలు దాటిన విషయం తెలిసిందే. దీంతో వినియోగదారులు పుత్తడి కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు బంగారం ధరలు తగ్గుతుండటంతో కొనుగోలుదారుల్లో ఉత్సాహం నెలకొంది. అటు రేట్లు తగ్గడంపై పెట్టుబడిదారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

# రష్యా చమురుకొనుగోళ్లు నిలిపివేసిన భారత్ కంపెనీలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** రష్యా చమురుకొనుగోళ్లు నిలిపివేయాలంటే భారత్‌పై అమెరికా తెస్తున్న ఒత్తిళ్లు ఆచరణలోకి వస్తున్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు భారత రిఫైనరీలు కొత్త ఆర్డర్లు ఇవ్వడం మానేశాయి. తాత్కాలికంగా చమురు కొనుగోలును నిలిపివేశాయి. ఆంక్షలపై మరింత స్పష్టత కోసం వేచిచూసే వైఖరిలో ఉన్నాయి.

స్పాట్ మార్కెట్ల నుంచి కొనుగోళ్లతో ఆ లోటును భర్తీ చేసుకుంటున్నాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు విషయంలో రష్యా తీరుపై ఆగ్రహంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ దేశ చమురు సంస్థలపై ఆంక్షలు విధించారు. రష్యా నుంచి చమురు దిగుమతులు ఆపేయాలని భారత్, చైనాపై ఒత్తిడి కొనసాగిస్తున్నారు. రష్యా సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌తో పాటు వాటి అనుబంధ సంస్థల నుంచి అమెరికా కంపెనీలు, వ్యక్తులు చమురు కొనకుండా అక్టోబరు 22న అగ్రరాజ్యం నిషేధం విధించింది. అమెరికాయేతర సంస్థలు కొనుగోలు చేసినా పెనాల్టీ ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ రెండు సంస్థలతో కొనసాగుతున్న లావాదేవీలను నవంబర్ 21 నాటికి ముగించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం భారత ముడి చమురు దిగుమతుల్లో మూడో వంతు రష్యా నుంచే వస్తోంది. 2025లో ఇప్పటివరకు సగటున రోజుకు 1.7 మిలియన్ బ్యారల్స్ చమురును దిగుమతి చేసుకుంది. ఇందులో 1.2 మిలియన్ బ్యారెల్స్ చమురు ఆ రెండు సంస్థల నుంచే వచ్చింది. ఇందులో ఎక్కువ శాతం రిలయన్స్, నయారా వంటి ప్రైవేటు సంస్థలే కొనుగోలు చేశాయి. అమెరికా, ఐరోపా దేశాల నుంచి ఆంక్షలు పెరిగిన కారణంగా ముడిచమురు కొనుగోలు కోసం భారత కంపెనీలు పశ్చిమాసియా వైపు దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలపై ఇప్పటికే స్పందించిన రిలయన్స్ ఇండస్ట్రీస్ రిఫైనరీ ఉత్పత్తుల దిగుమతులపై ఈయూ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకుంటామని తెలిపింది. అమెరికా, బ్రిటన్,ఐరోపా దేశాలు ప్రకటించిన ఆంక్షల ప్రభావాన్ని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. ఆంక్షల అమలు, నియంత్రణ చట్టాలకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేసింది. అమెరికాకు సహకరిస్తామన్న సంకేతాలను అందించేందుకే భారత రిఫైనరీలు ఆ దేశ కంపెనీల నుంచి చమురు కొనుగోలును పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా 2022 తర్వాత ఈ అక్టోబరులో అమెరికా నుంచి చమురు కొనుగోళ్లు గరిష్ఠ స్థాయికి చేరాయి. ప్రస్తుతం అమెరికా నుంచి వచ్చే చమురు దిగుమతులు రోజుకు 5.4 లక్షల బ్యారెళ్లకు చేరాయని తెలుస్తోంది. ప్రస్తుతం రష్యా నుంచే ఎక్కువగా ముడిచమురు దిగుమతి అవుతుండగా ఇరాక్, సౌదీ అరేబియా రెండు, మూడో స్థానాల్లో ఉన్నాయి.




# అమెజాన్‌లో 30 వేలమందిపై లేఆఫ్ వేటు

**న్యూయర్కు, అక్టోబరు 28:** ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి భారీ లేఆఫ్స్‌కు సిద్ధమైంది. ఖర్చులను తగ్గించుకునే చర్యల్లో భాగంగా, మంగళవారం నుంచి ఏకంగా 30,000 మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కరోనా మహమ్మారి సమయంలో పెరిగిన డిమాండ్ కారణంగా అధికంగా నియమించుకున్న సిబ్బందిని తగ్గించుకోవడమే లక్ష్యంగా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం 15.5 లక్షల మంది అమెజాన్ ఉద్యోగులతో పోలిస్తే ఈ సంఖ్య స్వల్పమే అయినప్పటికీ, కంపెనీలోని 3.5 లక్షల కార్పొరేట్ సిబ్బందిలో ఇది దాదాపు 10 శాతానికి సమానం. 2022 చివర్లో 27,000 మంది ఉద్యోగులను తొలగించిన తర్వాత, ఇదే అతిపెద్ద లేఆఫ్ కావడం గమనార్హం. అయితే, ఈ వార్తలపై స్పందించేందుకు అమెజాన్ ప్రతినిధి నిరాకరించారు. ఈ ఉద్యోగాల కోత ప్రభావం హ్యూమన్ రిసోర్సెస్ (పీపుల్ ఎక్స్‌పీరియన్స్ అండ్ టెక్నాలజీ), ఆపరేషన్స్, డివైజెస్, సర్వీసెస్, అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) వంటి పలు కీలక విభాగాలపై ఉండే అవకాశం ఉంది. ప్రభావిత ఉద్యోగులకు మంగళవారం ఉదయం నుంచి ఈమెయిల్స్ ద్వారా సమాచారం ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో సిబ్బందితో ఎలా వ్యవహరించాలనే అంశంపై సోమవారం మేనేజర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు సమాచారం. కంపెనీలో అనవసరమైన ప్రక్రియలను తగ్గించేందుకు సీఈఓ ఆండీ జెస్సీ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. దీనికి తోడు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం పెరగడం వల్ల పునరావృతమయ్యే పనులను ఆటోమేట్ చేస్తూ సిబ్బందిని తగ్గిస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.

మరోవైపు, ఈ ఏడాది ప్రారంభంలో అమలు చేసిన వారానికి ఐదు రోజులు ఆఫీసుకు రావాలి అనే నిబంధన వల్ల చాలామంది ఉద్యోగులు స్వచ్ఛందంగా వైదొలుగుతారని కంపెనీ ఆశించినా, అది జరగకపోవడం కూడా ఈ భారీ లేఆఫ్స్‌కు ఓ కారణంగా తెలుస్తోంది. ఒకవైపు ఉద్యోగులను తొలగిస్తున్నప్పటికీ, రానున్న పండగల సీజన్ కోసం గిడ్డంగులు, ఇతర అవసరాల నిమిత్తం 2.5 లక్షల మంది తాత్కాలిక సిబ్బందిని నియమించుకోవాలని అమెజాన్ యోచిస్తోంది. కాగా, కంపెనీకి అత్యంత లాభదాయకమైన ఏడబ్ల్యూఎస్ విభాగం వృద్ధిరేటు, పోటీ సంస్థలైన మైక్రోసాఫ్ట్ అజూర్, గూగుల్ క్లౌడ్ కంటే వెనుకబడింది. అమెజాన్ తన మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను గురువారం ప్రకటించనున్నది.



# ఎలాన్ మస్క్ గ్రోకీ పీడియా రెడీ




**న్యూయార్కు, అక్టోబరు 28:** అమెరికా బిలియనీర్, టెస్లాబాస్ ఎలాన్ మస్క్ మరో సంచలనానికి తెర తీశారు.ముందుగా ప్రకటించినట్లుగానే 'వికీపీడియా'కి పోటీగా గ్రోకిపీడియా పేరుతో కొత్త ఎన్‌సైక్లోపీడియాను పరిచయం చేశారు. ఏఐ (కృత్రిమ మేధ) సాంకేతికతతో పనిచేసే దీని బీటా వెర్షన్‌ను నేడు అందుబాటులోకి తెచ్చారు. ఈ విషయాన్ని మస్క్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. వికీపీడియా కంటే పది రేట్లు ఎంతో బెటర్ అంటూ వెల్లడించారు. వికీపీడియా తరహాలో అంతకంటే మెరుగైన గ్రోకిపీడి యాను డెవలప్ చేస్తున్నట్లు మస్క్ ప్రకటించిన విషయం తెలిసిందే. వికీపీడియా కంటే భారీగా ఉంటుందన్నారు. విశ్వాన్ని అర్థం చేసుకునే లక్ష్యంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. వికీపీడియా కన్నా చాలా విశ్వసనీయమైన, పారదర్శకమైన, భిన్నమైన, కచ్చితమైన సమాచారాన్ని ఇవ్వాలన్న ఉద్దేశంతో గ్రోకిపీడియాను తయారు చేస్తున్నట్లు మస్క్ తెలిపారు.ఇవాళ దాన్ని అందుబాటులోకి తెచ్చారు.ఇదిప్రారంభమైన కాసేపటికే భారీట్రాఫిక్ కారణంగా క్రాష్ అయ్యింది. దీంతో కాసేపటికి సేవల్ని పునరుద్ధరించారు.ఇది వికీపీడియా కంటే కొత్తగా ఏమీలేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# వైమానికరంగంలో మేకిన్ ఇండియా

హిందూస్థాన్ ఏరోనాటిక్స్‌తో రష్యా సంస్థ ఒప్పందం

భారత్‌లోనే పూర్తిస్థాయి ప్యాసింజర్ విమానాలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** విమానాల విడిభాగాలు, హెలికాప్టర్ల తయారీలో మేకిన్ ఇండియా కార్యాచరణను భారత్‌మరింత ముందుకు తీసుకువెళుతోంది. తాజాగా ఎస్‌జె 100 విమానాలు తయారీకి రష్యాకు చెందిన యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ సంసిద్ధత వ్యక్తంచేసింది. హిందూస్థాన్ ఏరోనాటిక్స్‌తో యుఎసి ఒప్పందంచేసుకుంది. భారత్‌లోపూర్తి స్థాయిలో ప్రయాణీకుల విమానం తయారీ ఇదే తొలిసారి. గతంలో ఎవిఆర్ఒ హెచ్ఎస్748 విమానాలను 1961లో తయారుచేయగా 1988లో ఆప్రాజెక్టు నిలిచిపోయింది. రానున్న పదేళ్లలో స్థానిక కనెక్టివిటీకోసం ఎస్‌జె100 వంటి చిన్న పరిమాణం కలిగిన 200 విమా నాలు అవసరం. పౌరవిమానయాన రంగంలో భారత్ ఆత్మనిర్భరత సాధించేందుకుఈ ఒప్పందం కీలకమని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ ప్రకటించింది. ఉడాన్ కింద స్వల్ప దూర ప్రయాణాలకు గేమ్‌ఛేంజర్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తంచేసింది. ఎస్‌జే 100 రెండు ఇంజన్లతో కూడిన చిన్నపరిమాణం కలిగిన విమానం. 103 మంది సామర్థ్యం ఉంది.స్వల్పదూరం ప్యాసింజర్‌సేవలకు అనువుగా ఉంటుంది. నిర్వహణ ఖర్చుకూడా తక్కువే. ఇప్పటికే రష్యా సంస్థ 200 విమానాలు తయారుచేస్తే ప్రపంచ వ్యాప్తంగా 16 ఎయిర్‌లైన్ సంస్థలు వీటిని నడిపిస్తున్నట్లు తెలుస్తోంది.




# నష్టాల్లోకి జారుకున్న సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, అక్టోబరు 28:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలునష్టాల్లోముగిసాయి. రియాలిటీ, ఐటి, ఆర్థికరంగసేవలు, వినియోగరంగ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి పెరిగి సూచీలు దిగువకు దిగజారాయి. గరిష్ట స్థాయిలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగారు. దీనితో సూచీలపై ఒత్తిడిపెరిగి నష్టాల్లోనే ముగిసాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్‌సూచీలు కూడా ఫ్లాట్‌గా ముగి సాయి. సెన్సెక్స్ ముందు లాభాల్లోనే ప్రారంభం అయినా ఆద్యంతం ఒడిదొడుకులతో చివరకు150.68పాయింట్ల నష్టంతో 84,628.16 వద్దముగిసింది. నిఫ్టీ కూడా 29.85 పాయింట్ల నష్టంతో 25,936.20వద్ద స్థిరప డింది. ఇక డాలరులతో రూపాయి మారకం విలువలు 88.27గా ఉన్నాయి.

సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్,ఐసిఐసిఐబ్యాంకు, టెక్ మహీంద్ర, బజాజ్ ఫిన్‌సెర్వ్, మహీంద్ర అండ్ మహీంద్రషేర్లు నష్ట పోయాయి. టాటా స్టీల్, ఎల్అండ్‌టి ఎస్‌బిఐ, కోటక్ మహీంద్ర బ్యాంకు, భారతీ ఎయిర్‌టెల్‌షేర్లు లాభపడ్డాయి.అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు బ్యారెల్‌ధర 64 డాలర్లవద్ద కొనసా గుతుంటే బంగారం ఔన్స్ ఒక్కింటికి 3906 డాలర్లవద్దట్రేడింగ్ జరిగింది. మొత్తంగాచూస్తే మార్కెట్లు ప్రతికూలంగానే ముగిసాయి.బిఎస్ఇలో 1910 కంపెనీలు షేర్లు పెరిగిప 2246 షేర్లు దిగజారాయి. 180 షేర్లు స్థిరంగా కొనసాగాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14